భారతదేశంలో ప్రథమ పర్యాయం!

క్రొత్త గోడల కొరకు క్రొంగ్రొత్త రంగు –

డెకోప్లాస్ట్

ప్రైమరుతో పని లేకుండానే,
క్రొత్త ప్లాస్టరు
మీద కూడా
వెయ్యవచ్చును.
ఎండలలో, వానలలో
ఏళ్ల తరబడి నిలిచి
ఉంటుంది.



సిమెంటు రంగులతో పోల్చి చూస్తే:

- కూలి ఖర్చు 40% తక్కువ!
- రంగు వేయుటకు, 7 పనులకు బదులు 2 పనులే చాలు!
- 5 రెట్లు ఎక్కువ జాగాపై రంగు వేయవచ్చును!


డెకోప్లాస్ట్ బేస్ వైట్‌లో, మేజిక్ టచ్ కలిపి పసందైన 40 ఛాయలు వెంటనే తయారు చేయవచ్చును. దీనికి తోడు, 5 ముదురు పక్కా రంగులు వాడకానికి తయారుగా లభిస్తాయి.

రంగులు విరిసిన రంగారు జీవితానికి **ఏషియన్ పెయింట్స్**

AIYARS-A-70 TEL



రవీంద్ర ఆర్ట్ పిక్చర్స్
ధర్మదాత
నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి
దర్శకత్వం ఎ సంజీవి
సంగీతం టి వి చలపతిరావు
కెమెరా యస్ వెంకటరత్నం M.C.A.
ఆంధ్రప్రదేశ్ లక్ష్మీ ఫిలింసు
మైసూరు వాహో ఫిలిం డిస్ట్రిబ్యూటర్స్
ఒరిస్సా విఘ్నేశ్వర పిక్చర్స్
LAKSHMI



రోమ్‌లో మనోహర దృశ్యాలు
స్పెయిన్‌లో బుల్ ఫైట్స్
స్విట్జర్లాండ్ మంచుకొండల్లో ప్రేమవిహారాలు
పారిస్ ఈఫిల్ టవర్ దగ్గర విహారాలు.
విదేశాల్లో ఎమ్యూజిమెంటు పార్కులు-
నైట్ క్లబ్ ఆటలు
అంతా కన్నుల పండుగే!
చిత్రాలయ
విప్లవం వర్ధిల్లాలి
దర్శకత్వం శ్రీధర్
రచన ఆత్రేయ సంగీతం యం.యస్.విశ్వనాథం నిర్వహణ వై.కన్నయ్య
నవయుగ
అనిల్ ప్రభాస్ ఎంటర్ ప్రైజెస్
NVKR

రచయితలకి మనవి

ప్రచురణకి స్వీకరింపబడని తమ రచనలు తిప్పివంపగోరే వారు ప్రాత్రపతులతో బాటు తగుమాత్రం తపాలాబిళ్లలు అతికించిన, స్వంత చిరునామా కల కవర్లు పంపాలి. స్టాంపులు మాత్రం పంపిన రచనలు తిప్పివంపటం సాధ్యం కాదు కనుక రచయితలు పై నిబంధనని గమనించ ప్రార్థన. (విడిగా స్టాంపులు అతికించిన, స్వంత చిరునామా కవరు పంపించినప్పటికీ రచనలు తిప్పివంపటానికి వీలు కాదు.)

సం॥

ఉత్తరాలు

మీ పత్రికా ముఖంగా కింద పేర్కొనబడిన కవులను వారి రచనలకు నేను చేసిన ఇంగ్లీషు అనువాదం ప్రకటించటానికి అనుమతి అర్థిస్తున్నాను. వారి అడ్రసూ, వారికి తెలిసిన ఇతర కవుల అడ్రసులూ తెలియబరచగానే వారికి నేను చేసిన వారి పద్యాల అనువాదం పంపిస్తాను.

కవులు కీర్తిశేషులయితే వారి వారసులకు ఇది నా విజ్ఞాపన,

ఇదివరలో కొందరికి వ్రాసినా, జవాబు రాలేదు. అందువల్ల దీనిని ప్రకటించమని మిమ్మల్ని కోరుతున్నాను.

బి. వి. ఎల్ నారాయణరావు.
ఎసిస్టెంట్ ప్రొఫెసర్ అఫ్ ఇంగ్లీష్.
వెస్టర్న్ ఇల్లినాయిస్ యూనివర్శిటీ మాకోంబ్ 111,
61455. యు. ఎస్. ఏ.

శ్రీమతులు [1] దొప్పలపూడి అనసూయాదేవి, [2] చావలి బంగారమ్మ, [3] తల్లావఝల విశ్వసుందరమ్మ [4] సౌదామిని.

శ్రీయుతులు 1] బసవరాజు అప్పారావు [2] కొడాలి ఆంజనేయులు, [3] ఆరుద్ర, [4] శిష్ట్లా ఉమామహేశ్వరరావు, [5] దాశరథి, [6] చింతా దీక్షితులు, [7] మాచిరాజుదేవీప్రసాద్, [8] పిలకా గణపతిశాస్త్రి, [9] గుర్రం జాషువా [10] నోరి నరసింహశాస్త్రి, [11] సి. నారాయణరెడ్డి, [12] కరుణశ్రీ, [13] అడివి బాపిరాజు, [14] సంపత్, [15] దువ్వూరి రామిరెడ్డి, [16] మల్లవరపు విశ్వేశ్వరరావు, [17] నండూరి వెంకటసుబ్బారావు, [18] గురుజాడ వెంకటఅప్పారావు, [29] దేవులపల్లి వెంకటకృష్ణశాస్త్రి, [20] కవికొండల వెంకటరావు [21] రాయప్రోలు వెంకటసుబ్బారావు, [22] తల్లావఝుల శివశంకరశాస్త్రి, [23] శ్రీశ్రీ, [24] విశ్వనాథ సత్యనారాయణ, [25] వేదుల సత్యనారాయణశాస్త్రి, [26] అనిసెట్టి సుబ్బారావు, [27] నాయని సుబ్బారావు.

కథలు

దూపాటి సంపత్కుమారాచార్యగారి హైద్రాబాదకథ వాస్తవానికి చాలా దగ్గరగా వుంది. సిటీలోని అద్దెంయిళ్ల అగచాట్లను హృదయానికి హత్తుకునేటట్లుగా చిత్రించారు. సీరియల్సు రెండూ చదువరుల హృదయాలను ఆకట్టుకునేలా వున్నాయి.

కె. రాజ్యలక్ష్మి ఎ.ఆర్.పి. [నిజామాబాద్ జిల్లా]

* * *

"విషవలయం" కథ బాగుంది. చదివేటప్పుడు పాఠకులకు శేఖర్ ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ అనిపిస్తుంది కాని రవిని సి. ఐ. డి.గా చేసి రచయిత పాఠకను చిత్రమైన మలుపు తిప్పారు.

"ఒక వారం వివరీతం"లోని విశేషాలు ఇవన్నీ వాస్తవమేనా అనే సందేహాన్ని కలిగించుచున్నవి.

యుద్ధంశెట్టి విజయలక్ష్మి రాణి [మహబూబాబాద్]

ఉత్తరాలు

వ్యాసాలు

ప్రవాసిగారు వ్రాసిన "మనం ఆంధ్రులం" అనే వ్యాసం ఈ వారం పత్రికకు ఒక హైలైట్. మనం ఏ ప్రాంతంలో ఉన్నా "మనం ఆంధ్రులం" అన్నమాట మర్చిపోకూడదనే సత్యాన్ని చక్కగా చాటి చెప్పారు. పంజాబీలు, తమిళులు మొదలైనవారు వారి ఆచార వ్యవహారాలను మర్చిపోరు. భాషలను కూడా మర్చిపోరు. కాని మన ఆంధ్రులు మాత్రం వేషభాష తో సహా అంతా మర్చిపోతారు. వారి ప్రాంతీయుల కనబడినా ఎవరో అన్నట్లు మసలు తుంటారు. ఈ వ్యాసాన్ని చదివి ఇటువంటి భావన లున్నవార మారటం వారి విధి అని మారాలని కోరుతున్నాను. జి. వి. సుశీల [అనకాపల్లి]

* * *

మే 29—5—70 ఆంధ్ర పత్రికలో "ప్రవాసి" గారు రచించిన "మనం ఆంధ్రులం" అన్న శీర్షిక చదివాక వారు ఏదో చుట్టపుచూపుగా' రూర్కెలా వంటిపెద్ద వూళ్ళలోఉన్న, పై రాష్ట్రాలలో ఉన్న ప్రవాసాంధ్రులను లుసుకున్న తరువాత, ప్రవాసాంధ్రుల కడగండ్లు వారు పూర్తిగా తెలుసు కోకుండా ఒకరకమైన భావం ఏర్పరచుకొని రాశారేమోనని అనిపిస్తుంది.

ఇంటగెలువలేకనేకదా పై రాష్ట్రాలలో స్థిరపడి ఉద్యోగాలు చేస్తున్నది. పేర్లు మార్చుకొనో, మరే అగచాట్లుపడో ఉద్యోగాలు సంపాదించుకొని ఇతర రాష్ట్రాలలో ఉండవలసి వచ్చింది అ ఇంట [ఆంధ్రలో] జరగడంలేదా? అన్నది ఆలోచించాలి.

అట్లాచోట "మేం ఆంధ్రులం" అని బోర విరుచుకొని తిరిగితే ఇప్పటిదేశ పరిస్థితులలో మన గలమా? అన్న విషయం ఆలోచించవలసింది. 100కి 75 మంది ప్రవాసాంధ్రులు ఉద్యోగులేకదా! మరి వీరు ఉద్యోగాలేచేస్తారా? ఆంధ్రత్వం చూపిస్తారా? ప్రవాసాంధ్రులెప్పటికప్పుడు పడుతున్న ఇక్కట్లు అందరికీ తెలిసినదేకదా! పనిచేసి నలుగురి మన్ననలు పొందిన ఆంధ్రుడు ఎక్కడున్నా మన్ననలు పొంద కుండా ఉంటాడా?

ఇంట గెలువలేకనేకదా రచ్చకెక్కారు ప్రవాసాంధ్రులు. మరి అచ్చటైనా గెలిచారంటే ముదావహమే! ఇది హర్షించవలసిన విషయం. ఆంధ్రులకే గర్వకారణం.

ఇట్టి ప్రవాసాంధ్రులపై సానుభూతి చూపక మరింత నిరుత్సాహ పరచడం భావ్యంకాదు. ప్రవాసాంధ్రులకు ఉద్యోగాలిస్తే ఆంధ్రకువచ్చిఆంధ్రత్వం చూపడానికి ప్రతిప్రవాసాంధ్రుడు సిద్ధపడవచ్చు.

కావున ప్రవాసాంధ్రుల ఇక్కట్లు తెలుసు కోకుండా పై దేశాలలో సుఖపడుతున్న ప్రాణాలను [ఇంట సుఖం లేనందున] దుఃఖాన పెట్టొద్దని ప్రార్థన. "ప్రవాసి"గారు ఇట్లు వ్రాసినందుకు అన్యథా భావించరని భావిస్తాను. ఐనా ఇంకా ఈ వర్గ బేధాలెందుకండీ? మనమంతా భారతీయులం.

ఎస్. సుబ్బారావు, బలంగిరు [ఒరిస్సా]

ఆంధ్రసచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు

శుక్రవారం: 26—6—'70

[శ్రీసాధారణనామ సం॥ ఆషాఢ మా॥ బ॥ అష్టమి]

సంపుటము : 63 సంచిక : 41

స్థాపితము:
1908

ముఖ్య సంపాదకుడు:
శివలెంక శంభుప్రసాద్


ఆంధ్రపత్రిక కార్యాలయము
7, తంబుచెట్టి వీథి, మద్రాసు-1

పోస్టుద్వారా

సంవత్సర చందా	26·00
6 మాసముల చందా	13·00
3 మాసముల చందా	6·50

విషయానుక్రమణిక

ముఖచిత్రం
'ఆడజన్మ'లో జమున.


మనకి పార్లమెంటులో ఇంతమంది మిత్రులున్నారని తెలియదే?
నేర నిరోధక చట్టం సవరింపు
మాకు సత్వర అభివృద్ధి కావాలి
యంగ్ టర్కులు
కనిపించే ఆ మసక లేమిటి?
యువకులు

నవ్వులపాలు అయిపోతున్న భారతదేశం...

శనివారం నుంచి జగ్జీవన్‌బాబుగారి కాంగ్రెసు సమావేశం మొదలవుతుంది. ఇది జరిగే రెండు రోజులూ 'యువ తురుష్కు'ల తీవ్ర ఖండనలు కొన్ని వినపడవచ్చు. బాబూ జగజీవనరామ్ రెండు గుర్రాలని ఒకేసారి స్వారీ చెయ్యటం వల్ల [కాంగ్రెస్ అధ్యక్ష పదవి, మంత్రిపదవినీకూడా అలంకరించటం వల్ల] ఏర్పడిన సంచలనం పూర్తిగా తగ్గిపోలేదు. తాత్కాలికంగా అణిగి ఉంది, అంతే. కొందరు దీనిని అదుపులో ఉంచారు.

దీనితో బాటు మేడమ్ ఇందిరా గాంధి నమ్మిన బంట్లు కొందర కలకత్తా వెళ్లి వచ్చారు. అక్కడి పరిస్థితి స్వయంగా చూసిన తర్వాత వారు ఇచ్చిన 'రిపోర్ట్' లు బెంగాలు గవర్నరు శ్రీ ధవన్‌కి విరుద్ధంగా ఉండవచ్చు. అసలు ఈ పదవికి శ్రీ ధవన్ అర్హతలు ఏమిటి? ఒకటి ఆయన ప్రధానమంత్రి కార్యదర్శి వర్గంలో ఉంటున్న ఒక పెద్ద అధికారికి సహపాఠకుడు కావటం [అని కొందరు అంటారు.] శ్రీ ధవన్ కమ్యూనిజమ్ గురించి చెప్తున్న మాటలు కమ్యూనిస్టులకి ఆహ్లాదకరంగా ఉండి తీరుతాయి. ఆయనమేడమ్ ఇందిరాగాంధికి గర్వకారణం అనతగ్గ వ్యక్తి. మేడమ్ ఇందిరా గాంధి భారత దేశానికి గర్వ కారణం అనతగ్గ వ్యక్తి.

మేడమ్ గాంధి గారి అనుచరులు తయారు చేసిన నివేదికలో నక్సలయిట్లని గురించి కొంత ఉంది. వారు కలకత్తా మయిదాన్‌లో రోజూ సభలు జరుపుతూ ఉంటారు. ప్రజలని విప్లవం లేవదియ్యమని చెప్తూ ఉంటారు. శ్రీ డాంగేగారి పార్టీ ఏమో బలవంతంగాభూము లని ఆక్రమించుకోమని ప్రచారం చేస్తుంది.

శివాజీ ప్రత్యేక ప్రతినిధి

ఇక శివాజీ ప్రత్యేక ప్రతినిధి శ్రీ యశ్వంత రావు బలవంతరావుచవాన్ ఏమంటున్నారు? ఆయన ప్రస్తుతానికి పరిస్థితిని పరిశీలిస్తు న్నారు, అంతా అదుపులో ఉంది, అని మాత్రం చెప్తున్నారు. ప్రధానమంత్రి మత దురభి మానాన్ని గురించి బాధ పడుతున్నారు. హిందువుల తీవ్ర మతాభిమానం 'నాజీ' తత్వం వంటిదని ప్రచారం జరుగుతోంది. ఇంతలో ప్రధాన మంత్రి ముఖ్య అనుయాయులు, కమ్యూనిస్టులు, ప్రభుత్వం 'మయినారిటీ ప్రభుత్వం' అంటున్నారు. బెంగాలులో 'పలహా సంఘం' [కన్సల్‌టేటివ్ కమిటీ] కి చవాన్ అధ్యక్షత వహించరాదని వాదిస్తున్నారు.

ఏది ఎలా వున్నా శాంతి భద్రతలు తగ్గి పోతున్నాయి. ప్రాణానికి విలువ తగ్గుతుంది. నక్సలయిటు భీభత్సాలని చూసిన ఒక సాక్షిని కోర్టులో, మేజిస్ట్రేట్ కళ్లముందు, కాల్చి చంపి వేశారు. భారతరాజధానిలో జరిగే హత్యలు ప్రతిరోజూ పత్రికలలో వార్తలుగా కనిపిస్తూనే ఉంటాయి. భారత దేశం ఎటు వెడుతోంది? ఎవరికి తెలుసు, ఎవరికి పట్టింది..........

హింస వల్ల కొత్త సమాజం సృష్టి కావచ్చు. కాని, అది సాధనమా లక్ష్యమా? తుపాకి గొట్టంలో నుంచే అధికారం పుట్టవచ్చు కాని ఒకనాడు తుపాకీ నియంత అయి కూర్చుంటే? అరాజకం ఏర్పడితే నియంతృత్వం వచ్చి తీరు తుంది.

నవ్వులపాలు

భారతదేశంలో ఏమి జరుగుతోందో అంద రికీ తెలిసినదే. ప్రపంచంలో పెద్ద రాజ్యాల వారందరూ ఇక్కడ రాయబారవర్గాలనినడుపుతున్నారు. ఆదేశాల పత్రికల వారు ఇక్కడ తెలివిగల విలేఖరులని ఉంచు కున్నారు ఈ పరిస్థితులలో మారిషస్‌లో మేడమ్ గాంధి చెప్పినమాటలు. స్విట్జర్లాండ్‌లో శ్రీ గిరి గారు చెప్పిన మాటలు నవ్వు పుట్టించక మానవు — విదేశాలవారికి.

ఫ్రెంచి పత్రిక 'లెమాండ్' ఇలా రాసింది—

'పశ్చిమ బెంగాలులో హింసాకాండల సంఖ్య ఈమధ్య బాగా పెరుగుతోంది. ఇవి.....నక్స లయిట్ల.........వల్ల జరిగేవే అని ఎందరో అంటు న్నారు. బెంగాలులో మార్క్సిస్టు, లెనినిస్టుల కార్యకలాపాలు అత్యధికం అవుతున్నాయి. వివిధ విశ్వ విద్యాలయాల మీద తీవ్ర వామ పక్షాలవారు చేసిన దాడులు లెనిన్ శతజయంతి ఉత్సవంలో భాగంమాత్రమే కావు., 1969 ఏప్రిల్‌నెలలో నక్సలయిట్ ఉద్యమం ప్రారంభం జ్ఞాపకార్థంగా చేసేవి మాత్రమే కావు., మావో సిద్ధాంతవాదులు చెప్పినట్టు అవి 'సాంస్కృతిక విప్లవంలో ఇవి మొదటి మెట్టుతో సమాన మయినవి, ఒకరకం సంస్థమీద తిరుగు బాటుకి నాంది వంటివి?'

'గతించిన కొన్ని వారాలలో నక్సలయిట్లు పాఠశాలలనీ, గ్రంధాలయాలనీ, సినిమా హాళ్లనీ, బస్సులనీ తగులబెట్టి, విరక్కొట్టి నాశనం చేశారు. పోలీసుకార్ల మీద దాడిచేశారు. కొన్ని బెంగాలు ప్రభుత్వం కార్యాలయాలమీద బాంబులు వేశారు— ఇది అపూర్వ మయిన విషయం.

పల్లెలు—పట్నాలు

అల్లర్లు పట్టణప్రాంతంలోకన్నా పల్లెప్రాంతాల లోనే ఎక్కువగా ఉన్నాయి. పశ్చిమ బెంగాలు మార్చి నుంచి రాష్ట్రపతి పాలన కిందఉంది. అప్పటి నుంచి అయిక్య సంఘటనలో వివిధ వర్గాలవారి మధ్య పోట్లాటలు తగ్గి ప్రతిదినం నక్సలయిట్ల అల్లరుల ఎక్కువ అవుతూ వస్తున్నాయి.

'నక్సలయిట ఉద్యమం హింసా ప్రధాన మయినది. అది పీకింగ్‌నాయకత్వాన్ని గుర్తిస్తుంది. సుమారు డజను రాష్ట్రాలలో రేగుతున్న హింసా కాండకి ముఖ్యకారణం ఈ ఉద్యమమే అని ఇంచు మించు అందరూ అంటున్నారు. దాని సభ్యుల సంఖ్య కొన్నివేలు మాత్రమే ఉండవచ్చు కాని, బీహారు, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, తమిళనాడు, కేరళ, అస్సామ్ [ఇక్కడ ఇది నాగా,] మిజో తిరుగుబాటు వర్గాలతో స్నేహంగా ఉంటోంది.], పంజాబు, జమ్మూ, కాశ్మీరులలో నక్సలయిట్లు చురుకుగా పని చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఉత్తరంవయిపు ఉన్న శ్రీకాకుళం జిల్లాలో నక్సలయిట్లు ఒక 'కల్లోల కేంద్రాన్ని' నడుపుతున్నారు. రేడియో పీకింగ్ ఈ ప్రాంతం 'ఎర్రవిప్లవం మొదటి మెట్టు' వంటిది అంటోంది.

'ఏది ఎలా ఉన్నప్పటికీ నక్సలయిటు ఉద్యమం రయితాంగానికి మాత్రం పరిమితం అవకుండా ఆ ఉద్యమ నాయకులు చూసుకుంటున్నారన టానికి నిదర్శనం పట్నాలలో పెరిగిపోతున్న నక్సలయిటు కార్యక్రమాలే. నగరాలలో విద్యార్థుల సహాయం అవసరం అని నక్సలయిటు నిర్ణ యించు కున్నారు.

శ్రీ మజుమ్‌దార్

'వారి నాయకుడు శ్రీ మజుమ్‌దార్ తమ విప్లవోద్యమం ఎటువంటిదో స్పష్టంగా వర్ణిం చారు. మావో మాసపత్రిక 'లిబరేషన్'లో ఈ పత్రికలో ఆయన తాము రాసిన ఒక వ్యాసం ప్రచురించారు. నక్సలయిట్లలో గెరిల్లా దళానికి అది పాఠం పుస్తకం. గ్రామాలలో, పొలిమేరలలో వర్గశత్రువులని కార్మికుల సహాయం యంతో అణగదొక్కి పారవెయ్యాలి. నగరాలలో తిరుగుబాటుకి ఇది మొదటి మెట్టుగా తోడ్పడ గలదు,' అని ఆయన ఒకచోట అన్నారు. సాయుధ విప్లవం పల్లెలనుంచి పట్నాలకి

పోకిపోతూ ఉంటే ప్రజల ఉద్యమానికి ఎన్నో విజయాలు తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వగలవు, అని ఆయన వాదం.

'కుట్రలు, నగరాలలో గెరిల్లా యుద్ధం—వీటికి సంబంధించిన వివరాలని ఈ వ్యాసం చర్చిస్తుంది. 'సెయిని దళా' లని ఎలాగ కూర్చి యుద్ధానికి పంపాలో చెప్తుంది. నక్సలయిట్లు 'ఎర్ర రక్షకులు' ఆరుగురి జట్లు చొప్పున పని చేస్తారు.

'వారు హటాత్తుగా దాడి చేసి మాయ మవుతారు. ఈ దాడులలో ప్రాణహాని గూడా కద్దు. వెళ్లిపోయేముందు 'అధ్యక్షుడు మావో మహా నాయకుడు!' అని రాయ గలిగిన చోట రాస్తారు. ఇటువంటి ఇతర నినాదాలని కూడా రాస్తూ ఉంటారు. 'ఎన్ని పుస్తకాలు చదివితే అంత తక్కువ తెలుస్తుంది.! అన్నది వారి నినాదాలలో ఒకటి.

నిస్పృహ

'బెంగాలులో సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితి ప్రమాదకరమయినది. ఎన్నో విషయాల సంఘర్షణలవల్ల పరిస్థితి ఎప్పుడూ తీవ్రస్థాయిలోనే ఉంటుంది. తూర్పు పాకిస్తాన్ నుంచి వచ్చే లక్షల మంది కాందిశీకుల వత్తిడి, భరించరాని సాంఘిక దురాచారాలు, నిరుద్యోగులలో పేదరికం రయితులలో నేలకోసం ఆకలి, వ్యవసాయంలో సంస్కరణలకి తోడ్పడే శాసనాలు వ్యర్థం కావడం [భూమి యాజమాన్యాన్ని పరిమితిచేసే శాసనాలు మరీను]— మొదలైనవి. ప్రజలలో 'ప్రగాఢమయిన నిస్పృహ' ఏర్పడి పరిపాలనలో సంస్కరణ అనేది వీలు కాకుండా ఉంటోంది.

'ఈ పరిస్థితులలో నక్సలయిటు ఉద్యమం బెంగాలు రాజకీయాలలోకి నీటిలోకి చేపవలె జారిందంటే ఆశ్చర్యం లేదు. ఈ ఉద్యమం భూమిలేని రయితులనే కాక, టీతోటలలో కూలివారినేకాక విశ్వవిద్యాలయాలలో పట్టాలని పుచ్చుకున్న వారిని కూడా ఆకర్షించగలుగుతోంది. మాస్కోపక్షం కమ్యూనిస్టులు బోధించే 'ప్రజాస్వామ్యపద్ధతులు' వారికి అనవసరమయిన ఆలస్యానికి కారణం కాగలవిగా కనిపిస్తాయి వారికి."

రాష్ట్రపతి వ్యాఖ్య

అంతర్జాతీయ కార్మిక సమితిలో రాష్ట్రపతి చేసిన ప్రసంగం భారతదేశంలో మంచి ప్రచారం సంపాదించుకుంది. ఆ ప్రసంగం పాఠం ముందు రోజే పత్రికలకి పంచి పెట్టారు. స్విట్జర్లాండు పత్రికలలో ఎంత ప్రచారం లభించిందో తెలియదు. బ్రిటన్‌లో పత్రికల సమ్మెవల్ల అసలే ప్రచారం తప్పి పోయింది.....

రాష్ట్రపతి 'పేద, గొప్ప' రాజ్యాల మధ్య చీలికని గురించి మాట్లాడారు. కాని, ఆయన శ్రోతలకి శ్రీ గిరిగారి దేశంలో ఏమి జరుగుతోందో బాగా తెలుసు. బాబూ జగజీవనరావ్ గారి కాంగ్రెసు మొదలు పెట్టిన 'పేదరికాన్ని పారద్రోలండి' అనే ఉద్యమం గురించి ఆయనని వారు అడిగి ఉండవచ్చు.

ఇక మేడమ్ ఇందిరా గాంధి, శ్రీ నిజలింగప్ప వీరిద్దరూ నాయకత్వం వహించే రెండు కాంగ్రెసు పక్షాల మధ్య చీలిక సంగతి ఏమిటి?

కనకదుర్గా క్షేత్రం - విజయవాడ

ఆంధ్రప్రదేశరాష్ట్రంలోని పెద్దపట్టణాల్లో విజయవాడ ఒకటి. ప్రాచీనకాలం నుంచీ దీనికి బెజవాడ అనే పేరు ప్రసిద్ధమై ఉండినది. విజయవాటిక అనే పేరుకూడా గ్రంథాల్లో కానవస్తున్నది. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత వచ్చిన యితరమార్పులతోపాటు బెజవాడ పేరు కూడా విజయవాడగా మారిపోయింది.

విజయవాడ విద్యా విజ్ఞానాలకూ, పరిశ్రమలకూ, వ్యాపారానికీ, సంస్కృతికీ కేంద్రంగా పేరుపొందినది. గాని ఇక్కడి ఇంద్రకీలాద్రిపైని కనకదుర్గా — మల్లేశ్వరుల దేవాలయాలు ఉన్నా క్షేత్రంగా ఎక్కువ ప్రసిద్ధికి ఎక్కలేదు. అయినా— ఉత్తర దేశయాత్రలు పోయే దాక్షిణాత్యులూ, దక్షిణతీర్థయాత్రలుచేసే ఔత్తరాహులూకూడా విజయవాడ స్టేషనులో దిగి, పవిత్రకృష్ణాస్రవంతిలో స్నానంచేసి కనకదుర్గా మల్లేశ్వరులను తప్పక దర్శిస్తూ ఉంటారు.

ఇక్కడి ఇంద్రకీలాద్రి మహాభారతాదుల్లో చెప్పబడిన ఇంద్రకీలాద్రే అనీ, అర్జునుడు పాశుపతాస్త్రం కోసం పరమశివుని గురించి యిక్కడే తపస్సు చేశాడనీ చెప్తారు. ప్రాచీనకాలంలోనే యిక్కడ కనకదుర్గాలయం, మల్లేశ్వరాలయం, విజయేశ్వరాలయం అనే మూడుదేవాలయాలు ఉండేవట! దుర్గాలయ ప్రాచీనతను గురించి విశేషంగా తెలియదుగాని ఆ దేవి స్వయంవ్యక్తం అని ప్రసిద్ధి. మల్లేశ్వరుణ్ని ధర్మరాజు ప్రతిష్ఠచేసినట్లు చెప్తారు. చాళుక్యరాజైన త్రిభువనమల్లుడు ప్రతిష్ఠించినందున ఆ దేవునికి మల్లేశ్వరుడనే పేరు వచ్చివుండవచ్చునని కొందరి అభిప్రాయం. విజయేశ్వరుణ్ని విజయుడనే నామాంతరంగల అర్జునుడు ప్రతిష్ఠించినట్లు జనశ్రుతి. యుద్ధమల్లుని శాసనాన్ననుసరించి కుమారస్వామిగుడి ఉండినట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం కనకదుర్గా మల్లేశ్వరుల దేవాలయాలే ప్రసిద్ధాలయి ఉన్నవి.


తమకు కౌరవులతో జరిగే యుద్ధంలో విజయాన్ని సాధించడానికి అవసరమైన పాశుపతాస్త్రాన్ని సంపాదించడం కోసం అర్జునుడు ఇక్కడ శివునిగురించి ఘోరమైన తపస్సు చేశాడట. ఆ సందర్భంలో వందినిగురించి కిరాతవేషంలో వచ్చిన పరమేశ్వరునితో యుద్ధం సంభవించినా, యుద్ధ మధ్యంలోకూడా ప్రతినిత్యమూ జరిపే నియమం ప్రకారం అర్జునుడు మట్టితో శివలింగాన్ని (పార్థివలింగన్ని) చేసి పూజించి మరీ యుద్ధం చేసేవాడట! అతని భక్తికిమెచ్చి శివుడాతని కోరిక నెరవేర్చాడట!

చారిత్రకంగా కూడా దుర్గామల్లేశ్వరాలయాలకు ప్రాముఖ్యం ఉన్నది. పూర్వం ఈ ప్రాంతాన్ని పాలిస్తూ ఉండిన మాధవవర్మ అనే ప్రభువు—తనకుమారుడు ప్రమాదవశాత్తూ చింతకాయలు అమ్ముకొని జీవించే ఒక పేదరాలి కొడుకును చంపినందున— ధర్మాన్ని పర్యాలోచించి తన కుమారుణ్ని ఉరి తీయించాడట! అతని ధర్మనిరతికి మెచ్చి మల్లేశ్వరస్వామి ఆ మృతుల నిద్దరినీ పునర్జీవితులను చేశాడట!

ఈ మాధవవర్మే ఇప్పటి విజయనగర సంస్థాన ప్రభువులైన పూసపాటి వంశీయులకు మూల పురుషుడు కావచ్చును. ఆ మాధవవర్మ గొప్ప తపశ్శాలి. దుర్గాదేవి భక్తుడు. అతని భక్తికీ, తపస్సుకూ మెచ్చి దుర్గాదేవి అతని రాజ్యంలో ఏడు గడియల పాటు కనకవర్షం కురిపించినదట! అందువల్లనే దేవికి కనకదుర్గ అని పేరు వచ్చిందట!

పరమ శైవుడయిన పండితారాధ్యుడు యిక్కడ స్వామి సన్నిధిలో యోగులకంటె శివభక్తులే ఉత్తములని చెప్తూ, దానికి నిరూపణగా వస్త్రాన్ని నిప్పులు ముడిగా కట్టాడట! ఆ వస్త్రం కాలిపోకుండా, నిప్పులముడి ముడిగానే ఉన్నదట! అప్పుడు మల్లేశ్వరుడతని భక్తికి మెచ్చి ప్రత్యక్షమయాడట!

ఈ కనకదుర్గాక్షేత్రం కల్యాణి చాళుక్యరాజుల కొకప్పుడు రాజధానిగా ఉండినది. దక్షిణ భారతదేశాన్ని ఏకచ్ఛత్రాధిపత్యంగా పాలించిన శ్రీ కృష్ణదేవరాయలు పూర్వదిగ్విజయయాత్ర చేసినప్పుడు




విజయవాడలోని కనకదుర్గ ఆలయం

కొన్ని దినాలిక్కడ ఉండినట్లు ఆముక్త మాల్యదవల్ల తెలుస్తున్నది.

విజయవాడలో ఎన్నో దేవాలయాలున్నా, ఇంద్రకీలాద్రిపైని ఉండే కనకదుర్గా మల్లేశ్వరుల ఆలయాలే ప్రధానంగా పరిగణింపబడుతున్నవి. ఇక్కడికే జనం ప్రతిదినం తండోపతండాలుగా వస్తూ ఉంటారు. కనకదుర్గాదేవి సర్వదా అలంకారములతో దేదీప్యమానంగా కానవస్తోంది. ఏడాది కొకసారి — సంవత్సరాది నాడు మాత్రం అలంకారాలన్నీ తీసివేసి అభిషేకాదులు జరిగిస్తారట! అప్పుడు ఆమె స్వరూపం మిక్కిలి భయంకరంగా ఉంటుంది. సింహాచలంలో అక్షతృతీయ నాడు నృసింహస్వామికి చందనం వలిపు చేసిన తర్వాత భక్తులకు నిజరూప దర్శనానికి అవకాశం ఉంటుంది. కాని ఇక్కడమాత్రం ఆ పద్ధతి లేదట! అలంకారం జరిగిన తర్వాతనే భక్తులకు నాడు దుర్గాదేవి దర్శనం లభిస్తుంది.

భక్తులు ఎక్కువగా క్షేత్రాలకు వెళ్లుతూ ఉన్నప్పుడూ, ఆదాయం అధికంగా ఉన్నప్పుడూ క్షేత్రాన్ని గురించి ఎక్కువ ప్రచారం కలగడానికి అవకాశం ఉంటుంది. జీర్ణ దేవస్థానాలను పునరుద్ధరణ చెయ్యడమూ, యాత్రికులకు సౌకర్యాలు కలిగించడం మూలంగా ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు చాలా క్షేత్రాలు ప్రజాసామాన్యాన్ని ఆకర్షిస్తూ ఉన్నవి. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంవారి దేవాదాయ ధర్మాదాయ శాఖవారూ, ముఖ్యంగా ఆ శాఖ ముఖ్యాధికారి — కమీషనరు శ్రీ కొండపల్లి — వాసుదేవరావుగారూ చేస్తున్న కృషి ప్రశంసనీయం. వారు దేవస్థాన విషయంలో ఎక్కువ శ్రద్ధ తీసుకొంటూ ఎంతో అభివృద్ధికి తెస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం చూచిన దానికంటె కనదుర్గా మల్లేశ్వరదేవస్థానం యిప్పుడు ఎంతో అభివృద్ధిని పొందింది. ఇదివరలో



కనకదుర్గ విగ్రహం

ఇంద్రకీలాద్రి పైకి వెళ్లడానికి ఘాటు రోడ్డు లేదు. ఇప్పుడు రమారమి ఆరు లక్షల రూపాయల వ్యయంతో కృష్ణా నది ప్రక్క నుండి కొండమీదికి రోడ్డు వెయ్యబడింది. కృష్ణా స్రవంతిలో 70 వేల వ్యయంతో చక్కని స్నాన ఘట్టం కూడా ఏర్పరచబడింది. యాత్రికులు పవిత్ర కృష్ణా జలాల్లో స్నానం చేసి శ్రమలేకుండా పర్వతం మీదికి వచ్చి దుర్గామల్లేశ్వరులను దర్శించుకోవచ్చును. ఈ సౌకర్యాలు కలిగించడంలో ప్రభుత్వంతో పాటు కార్యనిర్వాహకోద్యోగి (ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు) శ్రీ డి. నందగోపాలరెడ్డిగారు, శ్రీ మల్లెల శ్రీరామమూర్తిగారు మున్నగు దేవస్థాన సంఘసభ్యులు తీవ్రకృషి చేసినట్లు తెలుస్తున్నది. శ్రీ నందగోపాలరెడ్డిగారు E. O గా వచ్చిన తర్వాత ఆదాయం కూడా పెరిగింది. 1967 లో రమారమి మూడు లక్షల ఆదాయం ఉండగా 1968 లో ఆదాయం రెండు లక్షలు పైగా పెరిగింది. 1969 లో ఆదాయం ఆరు లక్షల నలభైవేలకు పైగా వచ్చింది.

దేవస్థానాల వల్ల వచ్చే ద్రవ్యం యాత్రికుల సౌకర్యాలకూ, ప్రజాహిత కార్యాలకూ మాత్రమేకాక, ప్రాచ్య విద్యా ప్రచారానికి కూడా ఉపయోగించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖవారి సంకల్పం. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్‌లోని దేవస్థానాలు సంస్కృత భాషా ప్రచారానికీ, ఆగమాల్లో విద్వాంసులను తయారు చెయ్యడానికీ, మత ప్రచారానికీ తమ ఆదాయంలో కొంతభాగం వినియోగిస్తున్న సంగతి అందరికీ తెలుసును. ఇదివరలో ఇక్కడ ఒక సంస్కృత పాఠశాల ఉండి, కొన్నాళ్లకు మూయ్యబడింది.

కమీషనరు శ్రీ వాసుదేవరావుగారి ప్రోత్సాహం ఊతగా గైకొని ఈ దేవస్థానంవారు 'శ్రీ దుర్గా సంస్కృత విద్యాగురుకులం' అనే పేరుతో గత సంవత్సరం నవంబరు 14 వ తేదీని (శ్రీ నెహ్రూ జయంతి దినం) మల్లేశ్వర స్వామివారి సన్నిధిని నెలకొల్పబడింది. దానికి కమీషనరుగారే ప్రారంభోత్సవం జరిపారు. బహుభాషావేత్తలూ, సుప్రసిద్ధ విద్వాంసులూ అయిన శ్రీ పి. పేరయ్యశాస్త్రిగారు ఆచార్యులుగా ఉండి దీన్ని నడుపుతున్నారు. విద్యాబోధ ప్రాచీన పద్ధతిలో జరుగుతూ ఉండడం మెచ్చదగినది.

లక్షరూపాయలు ఆదాయం వచ్చే దేవస్థానాలన్నిటిలోనూ సంస్కృత పాఠశాలలను స్థాపింప సంకల్పించినట్లు శ్రీ వాసుదేవరావుగారు తెలియజేసినట్లు తెలుస్తున్నది. సంస్కృతంతో మన ఆంధ్ర భాషకు ఎక్కువ సంబంధం ఉన్నది. మన భాష అభివృద్ధి పొందాలంటే సంస్కృత భాషాభివృద్ధి అవసరం. దాని అభివృద్ధికి ఉన్నతోద్యోగులూ, దేవస్థానాలూ అవకాశాలు కల్పించవలసి ఉన్నది. శ్రీ దుర్గ సంస్కృత విద్యాగురుకులం మిగిలినవాటికి ఆదర్శప్రాయంగా ఉండగలదని ఆశిస్తున్నాను.

— బులుసు వేంకటరమణయ్య

నక్సలైట్లు


రోజూ ఇలా వేపుకు తింటుంటే నక్సలైట్ అనక ఏమంటారేం
నక్సలైట్లకంటేనేం
పిల్లల్ని భరించలేకుండా ఉన్నానండీ- నానాటికీ పిల్లల అల్లరి మితిమీరిపోతోంది
ప్రజల ఆస్తిపాస్తులు దోచుకునే కాకుండా- పచ్చినెత్తురు కూడా తాగుతున్నారే- ఈ నక్సలైట్లు!
నాకేం కొత్తకాదు అలాంటిఘటం మాయింటోనూ ఉంది- నేను కాపురానికి వచ్చిన దగ్గర్నుంచి- ఆ కర్రను వెనకాలే
సూర్యకూడా వాళ్ళతో చేరి బస్సులు తగల పెట్టావా- తప్పుకదూ-?
మరి కొత్త బస్సులు ఎలా వస్తాయి?
అప్పుడు
బాబోయ్- పోలీసులు
ఇప్పుడు
బాబోయ్ నక్సలైట్లు
మాధవి
మాధవి



పగటివేళ 8 సర్వీసులు
రాత్రివేళ 7 సర్వీసులు

IATA

50 సంవత్సరాల
ప్రపంచ వైమానిక
సహకారం.

ఎయిర్-ఇండియా

బి. ఓ. ఏ. సి మరియు క్వాంటాస్‌వారి సౌజన్యంతో

ప్రశ్నోత్తరం

...కె. రామలక్ష్మి...

వి. వి. ఆర్, హైదరాబాదు

శ్రీమతి లతగారి ఊహాగానం పుస్తక, రూపంలో ప్రచురింప బడ్డాయి ?

పుస్తకంగా వచ్చాయి.

పి ఆర్. ఆర్, ధారూరు

మీరు 'తాముదిగిన గంగ'లో ఆడవారికి వంట వార్పు ముందే తెలిసివుండాలని వ్రాశారు కాని మీ ఉషలాగా 'పావెలా తెల్లగా వస్తున్నాయి' అన్నారు. అంటే మీ పని అందరికీ చెప్పడమేగాని మీ పిల్లలకు వర్తించదనా అర్థం ?

అంత కోపం ఎందుకు చిట్టితల్లీ. ఉష నా కూతురన్నానా? నా క్లాస్‌మేట్. ఈ నాడు ఉషలా సూకా లెవరూ చెయ్యలేరనిపిస్తుంది!

టి. ఎల్. వి, హైదరాబాదు

నా పద్దెనిమిదేళ్ల జీవితంలోనూ నేను చూడవలసినవి అనుభవించ వలసినవి అన్నీ అయిపోయాయి ఇప్పుడు నాకు జీవితం మీద విరక్తి పుట్టింది ...

అవ్వ! ఎవరేనా వింటే నవ్విపోతేరు. . . . వెనుకటికి విలియామ్ సారోయన్ వో చిన్న కథ రాశాడు. వో రైల్‌స్టేషను ప్రయాణికు లరికగా కూర్చుని చుట్ట కాలుస్తున్నాడట. వో పద్దెనిమిదేళ్ళ కుర్రాడొచ్చి కూర్చుని— నిరుత్సాహంగా దేనికేసీ చూడకుండా ఉండడం చూసి ఆశ్చర్యమేసి 'ఇంజను చూస్తావా?' అన్నాడు తలడ్డంగా తిప్పాట్ట. 'బొగ్గే స్తాను చూస్తావా?' అన్నాట్ట. పెదవి విరిచాట్ట. ఇంత చిన్న కుర్రాడికింటను సరదాలేవేమిటి చెప్మా అని 'వో చుట్ట కాలుస్తావా?' అని అడిగాట్ట. 'తల అడ్డంగా తిప్పి మానేసి చాలా రోజులైంది అన్నాట్ట కుర్రాడు !. . . . . అలా ఉంది నీ ధోరణి చూస్తుంటే!!

ఆర్. వి ఎస్. ఎస్, చింతామణి (మైసూరు)

... మీ చమత్కార హాస్య సంభాషణలను విని ఆనందించిన ప్రేక్షకుల్లో నేనూ ఒకడిని. మీరు మీ ప్రశ్నావళికిచ్చే జవాబులు చదువుతూంటే అచ్చు మీతో సంభాషించినట్టే ఉంది. అచ్చులో అచ్చం మీరే పలుకరించినట్లుంటుంది... తెలుగులో ఉండే అన్ని, లేక ఎక్కువ పత్రికల చిరునామాలు పేర్లు నాకు కావాలి. ఎవరిదగ్గర దొరుకుతాయి ?

మీరు కోరిన పత్రికల చిరునామా వివరాలు— రిజిస్ట్రార్ ఆఫ్ బుక్స్, పీరియాడికల్స్ దగ్గర ఉండొచ్చు. అలాగే నేషనల్ లైబ్రేరీలనబడే — కనిమెరా, మద్రాసు నేషనల్ లైబ్రరీ, కలకత్తా మొదలైన వారి వద్ద ఉండొచ్చు. ప్రయత్నించండి.

పి. వి. వి. ఎమ్, ముంగపాక

కాలేజీలో చేరిన ఆడపిల్లలు చెడిపోతున్నారు కారణం ?

ఎప్పుడు తీశారు అంకెలు?. . . . తీరి కూర్చు నెందుకిలాంటి స్టేట్‌మెంట్లు పారేస్తారు?

బి. వి. పి ఆర్, సివి (బీహారు)

కనకానికి లొంగని వాడు కాంతకు లొంగుతాడు ...

అంతేమరి. కాంతకు లొంగినవాడు కనకానికి లొంగినట్టేకదా!

కె. ఎస్. ఎమ్, పొదలాడ

రామలక్ష్మిగారూ, తోకచుక్క లు పొడిస్తే ఒక మహావ్యక్తి చనిపోతారని పెద్దలంటున్నారు. నిజమేనా.

ఏరీ ఇకఆ పెద్దలూ, మహానుభావులూ?!

టి. ఎస్ వి, రాజమండ్రి


'నేను నాస్తికుణ్ణి, మా పెళ్ళి మంత్రాల పెళ్ళికాదు. గుళ్ళో మంత్రాల పెళ్ళికాదు, సివిల్ 'మ్యారేజి'...అంటూ రాశారు. నేనుకూడా పరమ నాస్తికుణ్ణి. మరి మీరుకూడా నాలాగ, , మీవారిలాగా నాస్తికులా ?

కాదు. . . . .

ఎమ్. ఎన్. ఆర్; ఆర్. ఆర్; కిరీంగరు

సమాజానికి నిర్వచనం ఏమిటి ?

విద్రకీ నిష్క్రమణకీ నడుమ మానవకోటి!




ఒక వారం విపరీతం పాఠకుడు

బాలాఘాట్ జిల్లాలోని బార్కెరా గ్రామంలో ఆరు బయట నిద్రపోతున్న ఒక కుటుంబాన్ని ఎవరో దారుణంగా చంపేశారట. మొత్తం ఆరుగురు వ్యక్తులున్న ఆ కుటుంబములోని చంటి పిల్లలని కూడా హత్య చేశారట. వారెవరో! అసలీహత్య ఎందుకు చేయాల్సి వచ్చిందో ఆరాలు తీస్తున్నారు.

బస్సులో ప్రసవం

పుర్నియా నుంచి ముజాఫర్‌పూర్‌కు బయలుదేరిన ఒక బస్సు వూరువదలి పోఫది కిలోమీటర్లు వెళ్ళేసరికి బస్సు ప్రయాణీకులలో ఒక గర్భిణి స్త్రీ బస్సులోనే ప్రసవించిందట. ఈమె లోగడ స్టెరిలైజేషన్ [పిల్లలు పుట్టకూడదనే ఆపరేషను] కూడా చేయించుకుందట.



ట్రంకులో స్త్రీ శవం

ఉత్తర బొంబాయికి చెందిన బోరివిల్లి స్టేషనుకు వచ్చిన ఒక రైలులో ఎవరూ తీసుకుపోకుండా పడున్న వో ట్రంకు పెట్టెను పోలీసు అధికారులు తెరుస్తే దాంట్లో ముక్కలు ముక్కలు చేయబడిన ఒక స్త్రీ శవం ఉందిట. ఆ శవానికి మొండెం మాత్రమే ఉందట. ఈ మొండానికి రెండు అర్ధ పన్నెండు గాజులు [చేతులకు] తప్ప యింకేమీ లేదట. చేతులమీద "సీతా మహాదేవి" [సీతా మహాదియో అవి అనచ్చు] అని పచ్చబొట్టు పొడిచి ఉందట. ఈ మొండెం తాలూకు తల సెంట్రల్ బొంబాయి సముద్రపు ఒడ్డున ఒక ప్లాస్టిక్ సంచిలో దొరికిందట. తల కుళ్ళిపోయిఉందట. ఈమె అప్పటికి [చూసే టయిముకు] సుమారు 48 గంటల క్రితమే చనిపోయి ఉండాలని డాక్టర్లంటున్నారట.

వాచీ ఉంగరం పోయిన వాచర్

కలకత్తాలో లా కాలేజీ పరీక్షహాలులో తనను విచ్చలవిడిగా కాపీకొట్టుకోనివ్వటం లేదని ఒక విద్యార్థికి కోపం వచ్చి హాలులో వాచర్‌గా వున్న లెక్చరరు మీద తిరగబడ్డాడట. అతనికి మరికొందరు సహాయం చేశారట. కుర్చీ ఎత్తి ఆయన మీద విసిరారని, వాచీ, వుంగరం ఎత్తుకుపోయారనీ అధికార వార్తలొచ్చాయి.

నూతిలో శవం

జానకిరామన్ అనే అతనూ, నీలకంఠన్ అనే అతనూ చేరి మద్రాసులాటరీలో వో టిక్కెట్టు కొన్నారట. తీరా ఆ టిక్కెట్టుకు వొవెయ్యి రూపాయలు వచ్చేసరికి జానకిరామన్ అందులో వాటా నీలకంఠన్‌కి యివ్వ నిరాకరించాడట. దాంతో కక్ష పట్టిన నీలకంఠన్ రాజగోపాల్ అనే ఒక స్నేహితుని సహాయంతో జానకిరామన్ పీక నులిమి చంపి, శవాన్ని ఆ గ్రామాధికారి పెరట్లోని నూతిలో పడేశాడట— ఇది సెయ్యారులో జరిగింది.

*　　*　　*

మా పిల్లల చదువుకుంటున్నప్పుడే జాగ్రత్తగా చదువు అని హెచ్చరించుకోవాలి తప్ప, తీరా పరీక్ష తప్పాక గమ్మున తిట్టిపోయరాదు. సెయ్యారుకు చెందిన 19 ఏళ్ళ నాగరాణి అనే ఆమె పి. యు. సి. పరీక్ష తప్పినందుకు మనస్సు విరిగి, నూతిలో పడి చనిపోయిందట.

ప్రాణంతీసిన ద్రావకం

గుడియాత్తంలో మణియమ్మాళ్ అనే ఆమెకు కొన్నాళ్ళ క్రితం కవలపిల్లలు పుట్టి పోయారట. ఆనక మళ్ళీ గర్భవతి అయిందట. అప్పటికే ముగ్గురు పిల్లలు వుండడం వల్ల యిహ యీ కడుపు వద్దు, పిల్లలూ వద్దు అవటాని ద్రావకం త్రాగేసిందట. త్రాగిన కాస్సేపటికి రక్తంవాంతి చేసుకుని, ఆసుపత్రిలో చేర్చాక చనిపోయిందటామె.

ఆత్మహత్యల పరంపర

ఈ మధ్య ఆత్మహత్యలు చాలా చౌక అయిపోతున్నాయి. ఆంబూర్‌లో 25 ఏళ్ళ పద్మావతి అనే ఆమె తన భర్త రెండో ఆట సినిమాకు వెళ్ళినందుకు తిట్టాడని అభిమానపడి, ఆత్మహత్య చేసుకుందట. రెండోఆట సినిమాకు వెళ్ళానంటే భర్త ముడియాదు అన్నాడట. భర్త మాటకన్నా సినిమాకే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చి సినిమాకు వెళ్ళివచ్చిందట. తన మాటను నిర్లక్ష్యం పెట్టినందుకతను భార్యను తిట్టాడట. దాంతో పద్మావతికి జీవితం మీద విరక్తి పుట్టి నూతిలో దూకి ఆత్మహత్య చేసుకుందట.

నగ్న నృత్యాలు

మద్రాసు మవుంట్‌రోడ్డులోని "పాల్స్ రెస్టారెంటు"లో కాబరే అనే డ్యాన్సులు ముమ్మరంగా జరుగుతున్నాయట. ఈ డ్యాన్సుల పేర నగ్న నృత్యాలు, దృశ్యాలు కూడా సాగుతున్నాయ పోలీసులు మాటు వేశారట. రిబెక్కా అనే ఆమె, జోక్రా అనే ఆమె నృత్యం చేస్తూ— డ్యాన్సు చేస్తూ కట్టుకున్న ఒక్కోబట్టా విప్పి లాఘవంగా చూపరులవైపు ఎగరేస్తూ చివరికి ఆఖరి బట్ట కూడా విప్పి విస్తిరవతల పారేసి, నగ్నంగా నృత్యం ప్రారంభించారట. సమయంకోసం కాసుకున్న పోలీసులు చటున వారిద్దరినీ అరెస్టు చేశారట. ఈసందర్భంలో పోలీసుకమిషనర్ కుప్పుస్వామి మాట్లాడుతూ యీ నృత్యాల మీద కొన్ని నిబంధనలు వేస్తున్నట్టు చెప్పారట. కాబరే డ్యాన్సు చేసే వారు విధిగా వంటి మీద దుస్తులు వుంచుకుని తీరాలని, నృత్యం చేస్తూ చూపరులను చట్టుక ముద్దుపెట్టుకోకూడదని, చూపరుల తొడల మీద కూర్చోరాదని, బట్టలు విప్పి ఎగరేయకూడదనీ తమిళ ప్రభుత్వం అన్నదట. ●



భార్యపోరు-ఆత్మహత్య

తనభార్యతో పొద్దస్తమానూ, జీవితం వున్నంత కాలం పోట్లాట, పోరు భరించలేని సుబ్రహ్మణ్యం అనే అతను విషం త్రాగి, ఆత్మహత్య చేసుకున్నాడట. ఇది తిరువన్నామలైలో జరిగింది.

మంత్రానికి చింతకాయలు

మంత్రానికి చింత కాయలు రా—ఆఫ్రికాలో మంత్ర విద్యలు విపరీతంగా వున్నాయట. ఈ మంత్ర విద్యలలో మాలావి అనే వూరు యింకా ప్రసిద్ధి చెందినదట. ఆ వూళ్లో మంత్రగాళ్ళు తమ యిష్టప్రకారం కావాలంటే మొసళ్ళ రూపానికి కూడా మారగలరట. చేతబడులద్వారా వాళ్ళు చేయలేని పనులు లేవట. వీరి సహాయంతో అక్కడ కొన్ని ఆటల క్లబ్బుల వాళ్ళు అవతల వారిమీద మంత్రం ప్రయోగించి ఆటలు కూడా గెలు పొందుతున్నారట—




భార్యా హత్యా

శర్వాణి అనేఆమె భర్తతో పోట్లాడి, పుట్టింటికి వచ్చేసి కూర్చుండేదట. పుట్టింట్లో వుండి, శ్రీనివాససెట్టి అనే ఒక వ్యక్తితో రహస్య సంబంధం పెట్టుకుందట. ఈమెకు వివాహమై 10 ఏళ్ళయిు, భర్తతో తెగతెంపులు చేసుకుని మూడేళ్ళ యిుందట. తమ కూతురి ప్రవర్తన నచ్చని ఆమె తలిదండ్రులు ఆమెను మరోవూరికి మట్టారింటికి పంప నిశ్చయించారట. ఈ సంగతి తెలిసిన శ్రీనివాస సెట్టి శర్వాణిని వూరు వదలి పోవద్దని చెప్పాడట. అతని మాటల కామె వుత్సాహం చూపలేదని, ఆ రాత్రి నిద్రపోతున్న ఆమెమీద నైట్రికామ్లాన్ని పోశాడట. ●

గొలుసునవల

అపరాజిత



నలుగురు రచయిత్రుల సంయుక్త రచన

నాలుగవ భాగం

నాయని కృష్ణకుమారి

జరిగిన కథ

శ్యామల రాధలతో పాటు మాధవిని కూడా స్వంత కూతుర్లాగే పెంచింది పరమేశ్వరి. శివశాస్త్రికి మాధవి మీద కంటే మాధవి తెచ్చే జీతం మీద అభిమానం ఎక్కువ. శ్యామలకి రాజారావుతో పెళ్ళయింది. శ్యామల బిడ్డనికని కన్నుమూసింది. ఆ బిడ్డభారం మాధవిపై పడింది. ఆ యింట్లోనే అద్దెకుంటున్న మధు మాధవిని ప్రేమించాడు. మాధవిని రాజారావు పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాడని తెలుసుకుని మధు కుంగిపోయాడు. రాధకీ మధుకీ గల సంబంధాన్ని తెలుసుకుని మాధవి ఆశ్చర్య చకితురాలవుతుంది. రాధ రాసిన ఉత్తరంలో ఆమె మనస్తత్వం పూర్తిగా అర్థమైపోయింది. రాధ గర్భవతి. తల్లి కాబోతున్నానన్న భయం ఆమెకి లేదు. రాధ ఉద్యోగాన్వేషణలో హైదరాబాదు చేరుకున్నది.

17

రాధకు మొత్తం హైదరాబాదంతా గాలించినా అనువైన యిల్లు దొరకలేదు. తను సంపాదించబోయే రెండు వందల రూపాయల్నీ తన గర్భంలో పెరుగుతున్న ప్రాణినీ దృష్టిలో ఉంచుకుని ఎక్కువ అద్దెలు కోరే ఇళ్ళవైపు చూడడానికైనా సాహసించ లేకపోయింది. ముందూ వెనకా కాస్త మెల్లా ఉన్న మధ్యరకం యజమానులు ఇళ్ళకున్న ప్రాముఖ్యం బాగా గుర్తించారు. తామంతకుముందు కోళ్ళను పెంచడానికో, గేదెలను కట్టేసుకోడానికో వేసుకున్న రేకుల షెడ్లన్నీ ముందు వరసలో దర్వాజాలూ కిటికీలూ బిగించి, మనుషులు నివసించే స్థలాలుగా మార్చి పారేశారు. అవే ఒక్కొక్క వాటా యాభై రూపాయలపైనే పలికేవి. యజమానికి ఏమాత్రమూ కష్టంలేని వికరమైన రాబడి అది. సత్యవతమ్మ గారున్న వీధిలోనే వో చిన్న యిల్లు ఖాళీ అయ్యేదాకా రాధ వాళ్ళ యింట్లోనే ఉండిపోవలసి వచ్చింది. ఆ సన్నిహిత ప్రవర్తనవల్ల సత్యవతమ్మగారికి రాధ చదివిన పుస్తకంలా క్షుణ్ణంగా అర్థమైపోయింది. జీవితంపట్ల రాధకున్న అభిప్రాయం ఆవిణ్ణి ముగ్ధురాల్ని చేసింది. ఎన్ని కష్టాల నెదుర్కోవలసి వచ్చినా, ఎంత సంఘ ప్రతికూలత ఉన్నా ఈ అమ్మాయి చలించదు. తాను నమ్మి, కోరుకున్న దారిన వెళ్ళిపోవడానికి ఈ పిడకు ఎటువంటి భయసంకోచాలూ లేవు. పదిమంది ఎదురు నిల్చి యుద్ధానికి సిద్ధమైనా భయపడే రకం కాదు రాధ. వాళ్ళను చీల్చి చెండాడే ప్రయత్నం చేస్తుంది. ఆఖరు క్షణందాకా విజయ కాంక్షను జారిపోనీయకుండా కొత్త శక్తిని పుంజుకుంటూ దెబ్బకొడ్తూనే ఉండగలదు. ఈ పిల్ల నిజంగా 'అపరాజిత' అనుకున్నదామె.

రాధ టీచరుగా తన జీవితాన్ని దిగ్విజయంగా నడపగలిగింది. పిల్లలకు ఉత్సాహాన్నీ ధైర్యాన్నీ అందిస్తూ, వాళ్ళదగ్గర నుండి అభిమానాన్నీ గౌరవాన్ని అందుకో గలిగింది. క్లాసుకు వెళ్ళిన మొదటిసారి సన్నని చలిలాంటిది జివ్వున నరాల్లో ఎగప్రాకినట్లయింది. క్లాసు రూము నిండా దాదాపు నలభై మంది విద్యార్థినులు. వాళ్ళల్లో పిల్లల తల్లులున్నారు. అందరి ముఖాలమీదా దిగులు తెర దించినట్లుగా ఉండడం రాధ గుర్తించింది. ఏం చెయ్యాలి? వీళ్ళకోసం తనేం చెయ్యగలదు? మనస్సంతా కలవరం నిండి కొన్ని క్షణాల పాటు మూగగా ఉండిపోయింది.

'మాకు లెక్కల్లో టైమ్ అండ్ వర్క్ దాకా పోర్షనయిందండీ!' అన్నదో అమ్మాయి టెక్స్ట్ బుక్ అందిస్తూ.

రాధ అందుకుంది. ఆ అమ్మాయికి పద్ధెనిమిదేళ్ళుండవచ్చు. అందమైనదే. కళ్ళల్లో సోగతనంతోపాటు 'గడుసుదనం' కూడా ఉంది.

'నీ పేరేమిటి?' అడిగింది రాధ.

'రాజరాజేశ్వరండీ.'

రాధ అందరి పేర్లూ అడిగి రిజిష్టర్లో అటెండెన్స్ వేసింది. వీళ్ళ చరిత్రలేమిటో? ఎందుకు వీళ్ళంతా ఉన్న ఊరునూ కన్నతల్లినీ వదిలిపెట్టుకుని యిలా శరణాలయాల పాలయ్యారో! ఒక్కొక్క వ్యక్తికి గతంలో ఒక చిత్రమైన కథ ఉంటుంది కాబోలు. సంఘంలో తోటి మనుషుల అభిమానాన్ని కాకుండా అభిశాపాన్ని అందుకునే కథ! ఇప్పుడీ జీవితాలకు శరణాలయ నివాసమొక మలుపు. ఇక తర్వాత ఆ జీవితాల్లో ఎన్ని సుఖాంతాలో, మరెన్ని విషాదాంతాలో! రాధలోని రచయిత్రి ఇటువంటి ఆలోచనలతో ఉక్కిరి బిక్కిరి కాసాగింది.

తన్ను తాను సమ్మాళించుకుని, పాఠం మొదలుబెట్టింది. పిల్లల్లో చాలామంది చురుగ్గానే ఉన్నారు. భవిష్యత్తులో పెద్ద వాళ్ళు కల్పించే ఎటువంటి భరోసాలూ అందని యీ అభాగినులకు తమ ముందు జీవితం మీద స్థిరదృష్టి ఏర్పడక తప్పదు. చదువుకోవాలనీ, ఏదో ఒక వృత్తిని ఆధారంగా చేసుకుని నలుగుర్లో మళ్ళీ తల యెత్తుకుని గౌరవంగా బ్రతకాలనీ, దృఢమైన అభిప్రాయం వాళ్ళ నరాల్లో జాగరితంగా ఉంది. ఈ చైతన్యం రాధను బాగా కదిల్చింది. మరీ జడ ప్రాయంగా చావుకూ బ్రతుకుకూ మధ్య తేడాలు తెలీని నికృష్టపు దశలో మగ్గిపోకుండా, వీళ్ళనీ విధంగా ఉద్ధరించ గలుగుతున్న శరణాలయాన్ని మనసారా అభినందించింది. ఈ చైతన్యం కొడిగట్టి ఆరిపోకుండా ఎగసన త్రోశి వెలిగించే పుల్లలాగా తాను ఉపయోగపడగలిగినందుకు చాలా సంతోషించింది.

ఇంతలో హాస్టలు ఆయా వచ్చి, 'అమ్మగారూ, కాస్త రాజేశ్వరమ్మను పంపించండి. అవతల పిల్ల గుక్కపట్టి ఏడుస్తూ ఉంది. ప్రాణం కడంటి పోద్దేమో' అన్నది వినయంగా. ఆ మాట రాధ కింకా సరిగా అర్థం కాకముందే తన సీట్లోనుంచి స్ప్రింగులా లేచి నిలబడింది రాజేశ్వరి. 'వెళ్ళొస్తాను టీచర్' అని రాధ సమాధానానికి ఎదురు చూడకుండానే రెండంగల్లో క్లాసురూము దాటి కనుమరుగైపోయింది. విస్మయంగా చూస్తున్న రాధను సమాధానపరుస్తున్నట్లుగా, ఆయా—

'అయమ్మ నీళ్ళాడి యింకా మూడు నెల్లైనా కాలేదండమ్మా. చెంపకు చేరడేసి కళ్ళు తెరుచుకుని దీపంలా ఉంటుంది పిల్ల. ముదనష్టపోడు, వాళ్ళ ఊర్లో...'

'సరేలే — ఇప్పుడవన్నీ ఎందుకు' అని మధ్యలోనే తుంచేసింది రాధ.

తర తరాలుగా ఎప్పుడూ స్త్రీలకు సంబంధించిన జాలి గాధ లిలానే కదా ఉండేది! లోకానికి వాళ్ళమీద జాలికంటే, వాళ్ళ దురదృష్ట గాధల్ని వినాలనీ చెప్పాలనీ ఎక్కువ కోరిక.

టైమయిపోయింది. గంట గణ గణా లాడాక, రాధ క్లాసు రూమునుండి ఇవతలికి వస్తుంటే రాజేశ్వరి చక చకా నడుస్తూ



ఎదురువడ్డది. ఎదుటి మనిషికి ఏనుగంత బలాన్నిచ్చే చిరునవ్వును ఆ పిల్లమీదికి విసిరి రాధ ఎదురుగా ఉన్న సత్యవతమ్మ గారి ఆఫీసులో అడుగుపెట్టింది.

'రామ్మా ! క్లాసయిందా !' అని ప్రశ్నించారావిడ.

'అయిందండీ!'

'ఎలా ఉంది నీ ఉద్యోగం? నీకు నచ్చిందా ?'

'ఒక విధంగా మనస్సుకు చాలా తృప్తిగా ఉంది. లోకం దృష్టిలో నేనూ వీళ్ళ జాబితాలోకి చేరవలసిందాన్నే అయినా, నాకున్న ధైర్యంవల్ల ననండి, లభించిన అవకాశంవల్ల ననండి, వీళ్ళకు చేతనైన సేవ చేయ కలుగుతున్నానని గర్వంగా కూడా ఉంది.

'సంతోషం రాధా! ఇక్కడున్న దాదాపు నూరుమంది స్త్రీల జీవితాల్లోనూ, శాపం లాంటి ఒకేఒక సంఘటన నూరు విధాలుగా వేషం కట్టి కనిపిస్తుంది. సన్నివేశాలు సంఘటనలూ ఎటువంటివైనా పర్యవసానం ఒకటే. కాని యీ అభాగినుల మనసులూ మమకారాలూ ఎంత చిత్రంగా ఉంటాయనుకున్నావు రాధా !'

'చూస్తున్నానండీ ! ఇందాక క్లాసులో పాఠం జరుగుతుండగానే, పిల్లేడుస్తున్నదన్న కబురు విని చెంగున వెళ్ళిపోయిందొకావిడ !'

'ఎవరు, రాజేశ్వరేనా !' అడిగారావిడ!

'అవును ఆమ్మాయిపేరు రాజేశ్వరే !'

అపరాజిత


'ఆమ్మాయి అయిదుగురు సంతానంలో పెద్దపిల్ల. తండ్రి చెడతాగి ఇల్లూ ఒళ్ళూ గుల్ల చేసుకుని కళ్ళుమూస్తే తల్లే అష్టకష్టాలూ పడి వీళ్ళను సాకింది. వయసొచ్చిన యీ పిల్లనో ఉద్యోగస్థుడి ఇంట్లో పనికి పెట్టిందట. అతగాడు నలుగురు బిడ్డల తండ్రి. బీర పువ్వులా ఒంటినిండా నగలు దిగేసుకుని తిరిగే పెళ్ళానికి భయపడే ప్రాణి. కాని ఆవిడ కన్నుగప్పి యీ పిల్లను లొంగదీసుకున్నాడు. జరగవలసిందేదో జరిగాక దొంగకు తేలుకుట్టిన రకంగా గప్‌చిప్‌గా ఊరుకున్నాడు. తల్లేం చేస్తుంది ? పిల్లని చేతనైనంత హింసించి, ఆపైన మందో మాకో తెచ్చివ్వబోయింది. వాళ్ళ యింటి పక్కనుండే గ్రామసేవిక ఈ సంగతి కనిపెట్టి, శరణాలయానికి పంపించే ఏర్పాటు చేసింది. రాజేశ్వరి వచ్చిన కొత్తలో మొండిగా ప్రవర్తించేది. తనలోపల పెరుగుతున్నజీవి తన గర్భశత్రునా అన్నట్టుండేది. 'ఆ మురదష్టపు మొహం నేను చూడనుసు మండీ! నాకు చూపించకుండా ఎవరికిస్తారో ఇచ్చేయండి' అనేది. కటిక ఉపవాసాలు చేసి, తినరాని వన్నితినీ, గర్భం పోగొట్టుకోవాలని నానారకాలుగా తాపత్రయపడేది. ఆ పిల్లను పట్టుకోవడం మరీ కష్టమైపోయేది మాకు. హాస్టల్‌పిల్లల్లో చివరో ఒకరు ఇరవైనాలుగ్గంటలూ ఆవిణ్ణి కనిపెట్టుకుని ఉండేవాళ్ళు.'

రాధ విస్మయంగా వినసాగింది. పిల్ల అక్కర్లేదన్న మనిషేనా, దాని ఏడుపైనా సహించలేక చెంగున లేడిపిల్లలా దూకి పరుగులు తీసింది !

'పిల్ల పుట్టాక మంత్రసాని చూపించబోతే మొహం అవతలకు తిప్పుకుంది. కాని తర్వాత ఎట్లా వచ్చిందో ఆ ప్రేమ. అది క్షణం కళ్ళముందు లేకపోతే విలవిలలాడేస్థితికి వచ్చింది. ఈ మధ్య ఎవరో పెంపకానికో ఆడపిల్ల కావాలని వచ్చి అడిగారు— పిల్లనిచ్చేద్దా మన్నాను. భవిష్యత్తును గురించి వివరంగా చెప్పాను. 'పిల్లతోసహా నిన్ను ఆ ఉద్యోగస్థుడు స్వీకరించే అవకాశాలు లేవు. నీకు పెళ్ళి ప్రయత్నాలు చేస్తాను. నీ జీవితం నిశ్చింతగా వెళ్ళిపోతుందని చిలక్కు చెప్పినట్టు చెప్పి చూచాను. అప్పుడు రాజేశ్వరి ఏమందో తెలుసా! రాధా 'ఇంక నాకు పెళ్ళక్కరలేదండీ !— నా రక్తం పంచుకు పుట్టిన ఈ నలుసు కోసం నేనేమయినా చేస్తాను. ఎన్ని కష్టాలయినా పడతాను. దీన్ని పెద్దదాన్ని చెయ్యడమే నా ధర్మం. అందుకు అన్ని అర్హతలూ కలిగేట్లు నన్ను తీర్చి దిద్దండి చాలు.' అని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది— ఇప్పుడీ చదువులో ఆ పిల్లదే ఫస్టుమార్కులని వింటున్నాను. తన జీవిత గమ్యాన్ని ఎటువంటి పరాజయమూ లేకుండా చేరుకుంటుందనే నా విశ్వాసం—'

రాధ మనస్సులో సుళ్ళు తిరుగుతున్న తలపులతోపాటు కళ్ళు కూడా చెమ్మగిల్లాయి.

'జీవితంలో ఇంకా పూర్తిగా అడుగైనా పెట్టకముందే సంఘంచేత చావుదెబ్బలు తింటున్న స్త్రీలందరూ ఇట్లా ధైర్యంగా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని ప్రయత్నిస్తే, ఇక అంతకంటే కావలసిందేముంటుందండీ! ఒక్క స్త్రీ జీవితం కూడా సమయానికి సహాయం అందించే చెయ్యి దొరకక నిరాశతో అంతం కాకూడదు. తాను తెలిసీ తెలియని దశలో వేసిన తప్పటడుగువల్ల తన నూరేళ్ళజీవితమూ



వ్యర్థమేనన్న నిస్పృహ ఏ స్త్రీకీ కలగకూడదు. ఇటువంటి మహా కార్యనిర్వహణంలో చాలా పెద్దపాత్ర వహిస్తున్న మిమ్మల్ని మీ శరణాలయాన్ని మెచ్చుకోకుండా ఉండలేక పోతున్నాను' అన్నది రాధ ఆవేశంగా.

కించిత్తుగా స్పందించే ఆవిడ పెదవులూ, ఎఱ్ఱబడ్డ బుగ్గలూ, ఆవిడ పలుకుల్లో ధ్వనించే నిశ్చితత్వమూ, మెల్ల మెల్లగా ఆఘ్రాణించుకుంటూ, ఆవిడ అంతర్యాన్ని అంచనా వేస్తూ ముగ్ధంగా ఉండిపోయారు సత్యవతమ్మగారు.

* * *

శకుంతలకు రెండో ఏడు. అప్పుడే తండ్రి దగ్గరకు వచ్చి సంవత్సరం దాటింది. ఇల్లంతా కాంతినింపే ఆ పాప కళ్లల్లో రాజారావుకు చిత్రంగా మాధవే కనిపించేది. 'శకుంతలను తీసుకుని ప్రయాణం వస్తాదామనుకుంటున్నాను' అని మాధవి ఉత్తరం రాశాక మళ్లీ ఆమె రాజారావును చూడలేదు. మనవరాలిమీద మనసు పుట్టినప్పుడల్లా, పరమేశ్వరీ, శివశాస్త్రీ వచ్చి వెళ్తుండేవాళ్లు. మధు ఎక్కడికో వెళ్లి పోయాడనీ, మాధవి అతని ప్రసక్తి వస్తేనే మండిపడుతున్నదనీ, పెళ్లిమాటలు తెచ్చినా కోపం తెచ్చుకుంటున్నదనీ అత్తగారు చెప్పినప్పుడు రాజారావు అర్థం కానట్టుగా ఉండిపోయాడు. మాధవికీ మధుకూ మధ్య పెద్ద అఘాతం ఏర్పడ్డ తర్వాతనే మాధవి తన ఆశ్రయాన్ని కోరిందా? అవసరమైన వేళలో దాన్ని అందించలేక తానే ఆమె అభిమానాన్ని గాయపరిచాడా? రెంటికీ చెడ్డ రేవడి విధంగా మనశ్శాంతి లేక అల్లాడుతున్న మాధవికి, ఆ స్థితి రావడానికి తనకూ భాగమున్నదనిపించింది. ఏ మొహం పెట్టుకుని మాధవిని చూడడం! ఎలా ఆమె మనస్సును శాంతింప జెయ్యడం? తన హృదయ కవాటం మాధవికోసం ఎప్పుడూ తెరిచే ఉంది. ఆ మూర్తి రాత్రీపగలూ ఎప్పుడూ మరుపు రాకుండా తన మనస్సు లోపలి పొరల్లో భద్రంగా ముద్రించబడే ఉంది. తాను శ్యామలను చేసుకున్నాడన్న మాటే గానీ ఆవిడను లాలించిన మధురక్షణాలలోనైనా ఆవిడలో మాధవి రూపాన్ని వెతుకుతూనే ఉండిపోయాడు. ఇప్పటికీ కూడా రాజహంసలా రెక్కలు విప్పుతున్న శకుంతల ప్రతి కదలికలోనూ, మాధవిని పోల్చుకోడానికి అప్రయత్నంగా అతని గుండె ఉరకలు వేస్తోంది. తనంతట తను వస్తానన్నప్పుడు పెద్ద త్యాగమూర్తిలా అడ్డగించి, మళ్లీ రమ్మంటే మాత్రం ఎలా వస్తుంది! పీఠం విడిచి వెళ్లిపోయినదేవతను తిరిగిఆవాహనచేయడం అంతతేలికకాదుకదా!

ఒక్కొక్కక్షణాన రాజారావుకు పిచ్చెత్తినట్లయ్యేది. తనకు బోలెడు సంపద ఉంది, నిమ్మకు నీరెత్తినట్లుగా జీవితం గడిచి పోతుందనే నమ్మకం ఉంది. కాని సుఖం లేదు. నడివయస్సులో ఉన్న తనకు పిల్ల నివ్వడానికి కన్యాదాతలు పోటీలు పడుతూనే ఉన్నారు. ఎవరిని చేసుకున్నా సుఖపెట్టలేడు. తాను సుఖపడలేడు. జీవితమంతా ఇట్లా భగ్న ప్రేమికుడిలా గడపాల్సి వస్తుందన్న ఊహ అతని నరనరాల్లో నిస్పృత్తువను పూరించేది. కాని ఏం చేయగలడు తను? ఏంచేయడానికీ తన చేతుల్లో ఏమీ లేదని తనకు బాగాతెలుసు.

'పోస్ట్' అన్న కేకతో తన ఊహాల ప్రపంచంలోనుండి బయటికి వచ్చి ఉత్తరం అందుకున్నాడు రాజారావు. దాని మీది వ్రాత చూడగానే ఒక్కసారి నరాల్లోని రక్తమంతా ముఖానికి ఎగదట్టి హృదయ కంపనం హెచ్చినట్లయింది. అది మాధవి చేతి వ్రాత. ప్రేయసి చేతి వ్రాత, నోటి మాట, కొనగోటి తాకిడి అన్నీ హృదయస్పందనాన్ని ఎక్కువ చేయగలవే అని ఎవరో వ్రాసిన విషయం గుర్తుకు వచ్చి నవ్వుకున్నాడు. అవును. తను మాధవిని ప్రేమిస్తున్నాడు. ఆ ప్రేమ ఫలించేదారి లేకపోయినా దానికి క్షతి లేదన్న విషయం తనకు తెలుసు. ఉత్తరం ఆత్రంగా విప్పి చదివాడు. శివశాస్త్రికి పక్షవాతం వచ్చిందనీ తనకు కాళ్లూ

డాక్టర్ కబుర్లు

చర్మ బాధలకి కొత్త మందులు

కొన్ని చర్మరోగాలకి కొత్త రకం చికిత్స ఒకటి దొరుకుతోందిట! ఇది వింత చికిత్స—ఎందుకంటే, కొన్ని చర్మ రోగాలకి అతిమూత్రవ్యాధి మందులు వాడుతున్నారు.

ఈ రోగాలు ఎటువంటివి? కొందరికి చర్మం పొడిగా ఉండి పొడలుగా ఉంటుంది. మరి కొందరికి కందటం, మొటిమలు రావటం ఉంటుంది. ఈ రెండు రకాల బాధలకీ ఒక అతిమూత్ర వ్యాధి మందు బాగా పని చేసింది.

కొందరికి హటాత్తుగా తెల్ల మచ్చలు వస్తాయి. ఇవీ ఈ మందులవల్ల కొంత బాగా పోతాయుట.

పొట్టు రాలటం, దురద—వీటికికూడా కొంతగుణం లభించ వచ్చుట కాని మొత్తం మీద



అంత బాగా నయం కాదుట.

అయితే ఈ రకం మందులు పుచ్చుకున్నవాడు రక్తంలో చక్కెర పాళాదుని జాగ్రత్తగా పరిశీలించటం అవసరం. ఇది తరచు జరగాలి! పొరపాటున ఎక్కువ మందు పుచ్చుకోవటం జరగరాదు...

(కాపీరయిటు)

చేతులూ ఆడడం లేదని వ్రాసింది మాధవి. వెంటనే రెండు జతల బట్టలు సంచిలో కుక్కుకుని పిల్లనూ ఇంటినీ ముసలమ్మ కప్పజెప్పి బయలుదేరాడు రాజారావు.

బండి దిగి యిల్లు చేరుకునేసరికి వల్లంతా ఆలగోడు బాలగోడుగా ఉంది. శివశాస్త్రి ఎడమభాగానికి పక్షవాతం వచ్చింది. ఆ భాగమంతా ఈచుకపోయి ఇట్నాయి ముఖం వంకర తిరిగి చూడడానికి వికృతంగా ఉంది. నోట మాటలేదు. గాజువారిన కళ్లతో అతను చూచే చూపుల్లో ప్రపంచంలోని బాధామయ గాధలన్నీ రెక్కలు విప్పుకుని చిందులు తొక్కుతున్నట్లున్నయ్. ఆ దృశ్యాన్ని చూచి రాజారావు చలించిపోయాడు. అనాయాస మరణం ఎటువంటి అదృష్టవంతులకో?

మాధవి బావగారిని పలకరించి కాళ్లకు నీళ్లు తెచ్చిచ్చింది. ఆ పలకరింపులో మమతల్ని వెతికే సమయం అది. కాక పోయినా రాజారావు హృదయం వాటిని అన్వేషించకుండా ఉండలేక పోయింది. మాధవి కొంత చిక్కింది. కళ్లచుట్టూ ఏర్పడ్డ తేలికైన నల్లచారలు ఆవిడ సౌందర్యాన్ని హరించలేకపోయినా ఆవిడ పడుతున్న అలసటను చాటుతున్నయ్. మానసికంగా, శారీరకంగా మాధవికి విశ్రాంతి లేదు. పెదనాన్న అసమర్థుడుగా, పిల్లల సంపాదనమీద ఆధారపడిన స్వార్థపరుడుగా, పనికిమాలిన సోమరిపోతుగా అన్నాళ్లూ ఆవిడ మనస్సులో మంచి స్థానాన్ని సంపాదించుకోలేకపోయాడు. ఇక యిప్పుడు, మృత్యుముఖంలో ఉండి కాళ్లూ చేతులూ స్వాధీనం తప్పి దెబ్బతిన్న లేడిపిల్లలా చూపులు సారించే ఈ పెదనాన్నను మాధవి అసహ్యించుకోలేకపోయింది. ఉత్త పసి పాపను తల్లి లాలించినట్లు, పిల్లైనంత వరకూ తానే రోగిని కనిపెట్టుకుని ఉండేది. విశ్రాంతి తీసుకోమ్మా అని పరమేశ్వరి పోరించినా మాధవి వినలేదు. శివశాస్త్రి ఏమాలోచిస్తుండేవాడో చెప్పుకోలేడు. అన్నివేళలా గాజువారిన చూపులే సారించే అతని కళ్లు భావప్రకటన చెయ్యలేవు. మాధవి తన దగ్గర చేరి తనకు మందు పోస్తున్నప్పుడు, ఆహారం ఇస్తున్నప్పుడు, పక్క సారుస్తున్నప్పుడు అతని చెంపల వెంట అవిరళంగా కన్నీరు జారేది. అది అతను పడుతున్న బాధలవల్ల కాదు. ఈ సేవామూర్తికి తాను చేసిన అన్యాయం అతనిలో పశ్చాత్తాపాన్ని నింపి అలా బహిర్గతమౌతున్నదని మాధవికి తెలియదు.

నిరాసక్తంగా యంత్రవత్తుగా పని చేసుకుపోయే మాధవి రాజారావు హృదయాన్ని కదిల్చివేసింది. శీతాధిక్యం వల్ల గడ్డకట్టుకుపోయిన మనిషిలో చేష్టలుడిగి పోయినట్లు మాధవిలో చైతన్యం స్పందించడంలేదు. రాతిబొమ్మలా ఉన్న ఈ పడతి తిరిగి ఎప్పుడు మనుషుల్లో పడుతుంది? నూరేళ్ళ జీవితాన్ని యిలా శిలలా ఈవిడ గడపడానికి వీల్లేదు. అని పదే పదే అనుకున్నాడు రాజారావు. ఆ వేళ మధ్యాహ్నం పరిసరాలు సద్దుమణిగాక, వంటింట్లో పెదనాన్నకోసం బత్తాయిరసం తీస్తున్న మాధవిని నిశ్చలమైన మనస్సుతో సమీపించాడు.

'రాధ రాలేదేం మాధవీ?' — వెనకపాటుగా వచ్చిన ప్రశ్నకు చిన్నగా ఉలిక్కిపడి అటు తిరిగింది మాధవి. రాజారావు కళ్లు తన కళ్లల్లోకి చూస్తున్నాయి. ఆ కళ్లల్లో ఉన్న ఆరాధనా భావానికి ఏ మార్పూ లేదు. వెనకటి బావ మారనే లేదు. బేలతనంతో తొందరపడి తన్ను తాను బావ కర్పించుకుందామనుకున్నా తన మనస్సు రాపిడిని ఊహించి గొప్ప త్యాగం చేశాడు. అతని అణువణువూ తన్ను కోరుతున్నా, ఏ మాత్రమూ స్వార్థాన్ని పెచ్చురేగనీయలేదు. ఆ ఊహతో మాధవి కళ్లల్లో బావ మీది గౌరవం పూర్తిగా నిండి మనస్సు ఆర్ద్రత వహించింది. ఈ బావ దగ్గర తనకు అరమరికలు లేవు. ఆప్తుడై, రెండు చేతులూ చాచి సమాశ్వసించి ఆదరించే ఉదారమూర్తిగా తన మనస్సులో మెలుగుతున్నాడు. ఇతనికంటే తనకు దగ్గరి వారెవరు?

'లేదు బావా! రాధ ఉద్యోగస్థురాలైందన్న సంగతి నీకు తెలుసుగా? ఎవరికీ ఆఖరికి పెద్దమ్మకు కూడా తెలీని రాధ విషయాలు కొన్ని నీకు చెప్పాలి. మెల్లిగా తర్వాత చెప్తాను. అప్పుడుగాని, రాధ ఎందుకిక్కడికి రాలేదో నీకు తెలియదు. ప్రస్తుతానికి అది స్కూలు పిల్లలతో ఎక్స్‌కర్షన్‌కు వెళ్లినందువల్ల పెదనాన్న ఆరోగ్య విషయం అందక రాలేదని మాత్రమే పెద్దమ్మకు తెలుసు. ఆవిడ నింతకంటే ఎక్కువ రెక్కించి అడగకు.'

'మధు విషయమేమన్నా తెలిసిందా?'

'లేదు. తెలియనక్కర్లేదు కూడా అవతల పెదనాన్నకు రసం వేళైపోతుంది. నన్ను పోనీ!'

'ఒక్కక్షణం ఆగు. నన్నలా తప్పించుకు తిరక్కు మధూ! అది నేను భరించలేను. నీ మనస్సు విప్పి చెప్పుకోడానిక్కూడ నీకు ఆప్తులెవరూ లేరని నాకు తెలుసు. మనిషి మనసులోపడే రంపపుకోతను పంచుకోడానికి మరెవరన్నా ఉండాలి. అప్పుడే గాయాలు నెత్తురు లెగజిమ్ముతున్నా ప్రాణాలు పోకుండా నిలబెట్టుకోవడం సాధ్యమవుతుంది. నిజం చెప్పు మాధవీ! నువ్వు మధుతో సంధి ప్రయత్నాలు చెయ్యనే లేదా?'

ఈ మాటలతో మాధవి చలించి పోయింది. కళ్లనిండా నీళ్లు పెట్టుకుని, తడిసి బరువైన రెప్పలెత్తి, అయోమయంగా రాజారావు వంక

ఇది మీకు తెలుసా?

* రోజుకి నాలుగు చెంచాల తవుడేనా వాడాలి.

* తవుడు ప్రకృతి ప్రసాదించిన ఆహారం. పోషక పదార్థాలు, రక్షకపదార్థాలూ సంపూర్ణంగా ఉంటాయి దీన్లో.

* బియ్యంతోసహా తినడానికి భగవంతుడు తయారుచేసినది తవుడు—ఎలాగా మిల్లుపట్టి తీసేస్తున్నాం కనుక అవతల పారేయకుండా కొంచెమేనా వాడాలి.

* వారానికి రెండు సార్లు కొత్తగా తవుడు తీసుకోవచ్చు.

* దోరగా వేయించి డబ్బాలోపోసి గాలి తగలకుండా మూతపెట్టాలి.

—కె. రా.

చూచింది. తనకు జీవితంతోనే సంధి కుదరలేదు. ఎప్పుడు ఏవైపు చూచినా ఎదురు దెబ్బలు లభించడమే అలవాటై పోయింది. ఈ విషయం బావకు ఎలా చెప్పడం? జీవితంలో ఘోరపరాజయాన్ని పొంది తను అలసిపోయింది — ఆ తలపు మాధవిలో ఇన్నాళ్ళుగా పేరుకున్న దుఃఖాన్ని గోప్యంగా ఉండనివ్వలేదు. ఓదార్చేవారిని చూస్తే ఊరకలూ పరుగులూ తీస్తూ దుఃఖం వెలికిరావడమూ సహజమే కదా!

తన ప్రశ్నకు సమాధానం లేకుండా వెక్కి వెక్కి ఏడుస్తున్న మాధవి నెలా ఊరడించాలో రాజారావుకు తెలియలేదు. తమ ఇద్దరిస్థితీ యించుమించు ఒకటే. కాని యిద్దరూ కాలప్రవాహంలో ఒకరికొకరు దూరదూరంగా విసిరివేయబడుతున్నారే తప్ప ఒకటి కాలేకపోతున్నారు.

'ఊరుకో మధూ! నీ మనస్సులో దుఃఖాన్ని చేత్తో తీసేయగలిగితే ఎంత బాగుండును? నీ జీవితానికి నేనేమీ చెయ్యలేక పోయాను. పైపెచ్చు తెలిసో తెలియకో నీవీస్థితిలో ఉండడానికి నేనూ కొంత కారణమన్నది నామనస్సు నెప్పుడూ మండిస్తూంటుంది. ప్రేమించిన వారికోసం లోకం త్యాగాలు చెయ్యడం విధిగా నేర్చుకుంటుంది. కాని ప్రేమించినవ్యక్తి జీవితం పాషాణంగా మారిపోవడానికి నేను కారణమయ్యాను. నన్ను క్షమించగలవా మాధవీ!'

మాధవి ఆమాట వింటూనే చప్పున తేరుకుంది. 'అంతమాటనకు బావా! ఇందులో నీవు చేసిందేమీ లేదు. ఒక చపలచిత్తుడికీ సహసం లేని వాడికీ, నా మనస్సునీ ప్రాణాన్నీ మీదు కట్టుకున్న తొందరపాటుతనం నన్నిలా శిక్షిస్తోంది. మధు చదువుకున్న వాడూ సంస్కారమున్నవాడూ అవునుగాని, గుండె బలం లేనివాడు. పరిస్థితులు విషసర్పాల్లా బుసలుకొడుత్తూ మీదకి ఎగబాగుతున్నపుడు వాటికందకుండా పారిపోగలిగాడే కాని, వాటిని ఒడుపుగా అదుపులోకి తెచ్చుకునే వివేకం చూపించలేకపోయాడు. ఈ వివేకరాహిత్యం నన్నూ రాధనూ ఇద్దరినీ మాడ్చి మసి చేస్తోంది.'

'రాధనా?' అన్నాడు రాజారావు.

'అవును బావా, రాధనే! నాకంటే ఎక్కువ అన్యాయమే జరిగింది రాధకు. కాని అది నిబ్బరమైనపిల్ల. ఒకసారి నువ్వు వ్రాశావు జ్ఞాపకముందా? 'జీవితంలో ఎటువంటి ఒడుదుడుకులైనా ఎదుర్కొనే స్థైర్యంకలది రాధ' అని— అది అక్షరాలా నిజం. అటువంటి వాళ్ళు మొదట మొదట ఎన్నికష్టాలు పడ్డా చివరికి తాము కోరుకున్నది పొందుతారు. అలా పొందే ప్రయత్నంలోనే తమ శక్తియుక్తుల్ని ఉపయోగిస్తారు. అందుకు తన మన అనే మొహమాటం కాని నిస్వార్థ చింతనకానీ అడ్డురావు.

'ఏం జరిగింది మాధవీ? రాధకేమయింది? ఇందాక నువ్వేదో చెప్పాలన్నదానికిది ఉపోద్ఘాతమేనా?'

'అవును వివరంగా చెప్పడానికిది అదునూకాదు, స్థలమూకాదు. సాయంత్రం మనం పార్కులో కలుసుకుందాం బావా! నీదగ్గర నేను దాచ దల్చుకున్నది ఏమీ లేదు. నీకంటే ఆప్తుడు నాకెవరూ లేరు' దృఢంగా అని గ్లాసులో బత్తాయిరసం పోసుకుని, చకచకా శివశాస్త్రి గదివైపు కదిలిపోతుండగా, అలాగే చూస్తూ ఉండిపోయాడు రాజారావు.

(ఇంకా వుంది)

వారఫలం

26-6-1970 శుక్రవారం మొదలు 2-7-1970 గురువారం వరకు

మేషం : కొన్ని వ్యవహారాల్లో అనవసరమైన శ్రమ కలుగుతుంది. మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. ఉద్యోగంలో గౌరవం బాగా ఉంటుంది. విద్యా వైజ్ఞానికరంగాల్లో ఖ్యాతి లభించగలదు.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి అధిక వ్యయం జరుగుతుంది

వృషభం : వృత్తిలో ఆదాయం బాగా ఉంటుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వారం మధ్యలో ప్రయాణాల్లో శ్రమ కలుగుతుంది. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం ఆఖరులో తిరిగి అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

మిధునం : వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుప గలరు. పోటీవారిలో గౌరవం బాగా ఉంటుంది. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. మిత్రుల సహాయం లభించగలదు. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లో నే నష్ట రావచ్చును.

స్త్రీలకు:— సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

కర్కాటకం. వృత్తి వ్యాపారాల్లో మీ కార్యక్రమాలు బాగా ఉంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. సాహిత్యకళారంగాల్లో మీ కృషి రాణిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభించ గలవు.

స్త్రీలకు:—ఆరోగ్యం బాగా ఉంటుంది. బంధుమిత్రులను కల్సు కొంటారు.

సింహం : కొన్ని వ్యవహారాల్లో మీ తాలూకు మనుష్యులే మిమ్మల్ని వ్యతిరేకిస్తారు. ఉద్యోగంలో కార్యభారం పెరుగుతుంది. వారం మధ్యలో వృత్తిలో అనుకూల వార్తలను వింటారు. ఆర్థిక వ్యవహారాలు బాగా ఉంటాయి. పోటీవారిలో గౌరవం లభిస్తుంది.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాల్లో చికాకులు యేర్పడతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కన్య : ప్రయత్నించిన ప్రతిపనీ సులువుగా నెరవేరుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు. వారం మధ్యలో సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం వస్తుంది. వ్యాపారంలో శ్రమ కలుగుతుంది. వారం ఆఖరులో అన్ని వ్యవహారాల్లోను అనుకూలత లభిస్తుంది.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

తుల: కొన్ని వ్యవహారాల్లో మీరు అనుకొనేది ఒకటి జరిగేది మరొకటి కావచ్చును. పోటీవారితో మాట పట్టింపులు తగవు. ప్రయోజనం గల పరిచయాలు యేర్పడతాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వారం ఆఖరులో ఆకస్మికంగా చికాకులు యేర్పడతాయి.

స్త్రీలకు:— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. దైవకార్యాలు నెరవేరుతాయి.

వృశ్చికం: వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. రాజకీయ వ్యవహారాలో చికాకులు యేర్పడతాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు. భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి.

స్త్రీలకు:—ఆరోగ్యం బాగా ఉంటుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

ధనుస్సు: మీరు యెంతగానో ఆశించిన వ్యవహారాల్లో ఫలితం సామాన్యంగా ఉంటుంది. పోటీవారిలో గౌరవం లభిస్తుంది. సాహసముతో కూడిన వ్యవహారాలు లాభిస్తాయి. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది. ఏ వ్యవహారంలోను యితరుల మీద ఆధారపడడం తగదు.

స్త్రీలకు:— పుణ్యకార్యాలు చేస్తారు. పోటీవారితో వాదప్రతివాదాలు తగవు.

మకరం : వ్యాపారంలో అనుకూల వార్తలను వింటారు. రాజకీయ వ్యవహారాలు బాగా ఉంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. స్థిరాస్తి వ్యవహారాలు బాగా ఉంటాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు.

స్త్రీలకు:— ఆరోగ్యం బాగా ఉంటుంది. సంతానానికి సౌఖ్య సంతోషాలు లభిస్తాయి.


కుంభం: భాగస్వాములతో కలసి చేసే వ్యాపారాలు బాగా ఉంటాయి. రావలసిన డబ్బు సమయానికి అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగా ఉంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో ఆదాయం కంటే అడాపుడి అధికంగా ఉంటుంది.


స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగా ఉంటాయి. సంతోషకరమైన వార్తలను వింటారు.

మీనం : వ్యాపారంలో ఆదాయం బాగా ఉంటుంది. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. నూతన విషయాలను తెల్సుకొంటారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు సులువుగా నెరవేరుతాయి.

స్త్రీలకు:—ఆరోగ్యం బాగా ఉంటుంది. విలాస వస్తువులు కొంటారు.

—మహేష్ ●


లవ్ లెటర్
బొమ్మలకథ సీరియల్
శ్రీనికు
7
ఇప్పుడు బుద్ధిమంతుడిలా నీ సుజాతకి ఓ తీయని లవ్ లెటర్ రాయాలి నువ్వు!
ఒకవేళ యీ ఉత్తరం సుజాతకి బదులు వాళ్ళన్నయ్య కందితేనో!
ఏడ్చినట్టుంది! అంతవరకి సన్యాసి విప్రములోకెందుకు, వచ్చావ్? ముందు ఆ లెటర్ రాస్తావా?
రాస్తాలేగానీ ఏమని రాయనూ! ఎలా ప్రారంభించనూ?
వార్నీ! అదికూడా నేను చెప్పాలా
బాబ్బాబు! కొంచెం సాయం చేసి పెట్టరా! సాయంత్రం సినిమా చూపిస్తా!
సాంబాబు సహాయంతో రాంబాబు ఎలాగో కష్టపడి సుజాతకి ఓ 'లవ్ లెటర్' తయారు చేశాడు!
* * *
"మిస్ సుజాత, గ్రీన్ విల్లా, ... హైదరాబాద్"
ఎక్సలెంట్! ఎడ్రస్ కూడా సరిగ్గా సరిపో యింది! మన రాము - ఎడ్రస్ కూడా రాసి పోస్టు చేసెయ్! సుజాత దగ్గర్నుంచి రిప్లై రేపే వచ్చేస్తుంది!
(ఇంకా ఉంది)



దైవస్వరూపులైనే తలిదండ్రుల పాద పద్మముల పూజకు నోచుకోలేని అభాగ్యురాలైన మీ 'సునంద' లేఖ.

ఇప్పటివరకు ఎన్నో ఉత్తరాలు వ్రాశాను. ఒక్కదానికీకూడా జవాబు లేదు. అయినా నాకు విసుగు లేదు. వ్రాస్తాను. మళ్లీ మళ్లీ వ్రాస్తాను. నాలో ఓపిక సహనం వున్నంతవరకు, నా చేతుల్లో శక్తి, మీపై భక్తి నిలిచివున్నంతవరకు వ్రాస్తూనే వుంటాను.

నాపై మీకందరికీ పగ, ద్వేషం, కోపం అన్నీ వున్నాయని నాకు తెలుసు. మీరు నన్నెంత మూర్ఖురాలిగా, నీచురాలిగా జమ కట్టినా, వంచకిగా, దోషిగా నన్ను మీనుండి పూర్తిగా వెలివేసినా, మీపై అభిమానం, అనురాగం నాలో ఏనాటికి చావవు. అది మున్నాటికీ నిజ ప్రేమాభిమానాలకు మృత్యువాత లేదు

నేను చేసిన పని ఎంతో తుచ్ఛమైనదనీ, నీచమైనదని మీరెన్ని నిష్ఠూరాలాడినా ఫర్వాలేదు. ప్రపంచమే కోడై కూసినా నేను లెక్కచేయను. నే నెంతో లోతుగా ఆలోచించి చేసుకున్న నిర్ణయమే, నా స్వంత భావాలకు స్వతంత్రమివ్వటంతో పొరపాటు

చేయలేదు. కుటుంబ శ్రేయస్సు కొఱకు నే నొక మంచిపని చేసాను, అన్న ఆత్మ సంతృప్తి నన్నెంతో ఉన్నతురాలిగా చేస్తోంది.

మీకు కనిపించకుండా, మాట మాత్రం చెప్పకుండా వెళ్లిపోతే ఆరోజున మీరెంతగా విలపించారో! ఆ తరువాత యెన్ని నిందలను అపవాదులకు, పరుషవ్యాఖ్యానాలకు గురి అయ్యారో అనుభవంమీద నేను తెలుసుకో గలను.

ఎన్నిమార్లు గుండెలవిసేలా ఏడ్చి, ఏడ్చి పిచ్చిగా తలలు గోడకు బాదుకున్నారో ఊహించుకుంటే నా గుండె పగులుతోంది.

నాది రాతిగుండె అమ్మా! ఇది నికర్షం కాదు. ఆడదాని గుండెలో విషం కూడా ఒక పాలు మిళితమై వుంటుంది. కాకుంటే పసికందునుంచి అల్లారుముద్దుగా, అపరంజిబొమ్మలా పెంచి పెద్దచేసి, విద్యాబుద్ధులు నేర్పినందుకు నా బాధ్యత విస్మరించి, మీ మాట నెదిరించిన కృతఘ్నురాలినిగానా? అదే నా బాధ. కాని బరువు బాధ్యతలను, విమర్శనాత్మకంగా ఆలోచించే జ్ఞానం, ఆచరించగల సమర్థత నాకూ వుంది.

మన ఇంటి ఆర్థిక పరిస్థితులే నన్ను తీవ్రమైన వత్తిడికి గురి చేసాయి. చాలీ చాలని సొమ్ముతో ఏదో గొప్పలకు పోవటం మంచిది కాదని పించింది. నా పెళ్లి విషయమై మీరు పడే ఆవేదన, ఆందోళన నన్ను నిలువునా కాల్చివేసింది. నేను సంఘంలో ఒక వ్యక్తురాల్నిగా గుర్తింపబడనంతకాలం మీరు నాకే లోటు పాట్లు లేకుండా పువ్వులా పెంచుతూ వచ్చారు. అన్నయ్యకు ఉద్యోగం దొరికింది. నాన్నగారి జీతం హెచ్చింది. డబ్బుకు కొదువ లేదు. నా జీవితం నందనవనంలా విరాజిల్లింది.

కావలసినన్ని దుస్తులు. నైలాన్, వాయిల్, మఖ్మల్ ధరించి, రకరకాల స్టైల్స్ చేసేదాన్ని. నేనేది కోరితే అలా నిముషాలమీద తెచ్చి యిచ్చేవారు. ఊళ్లోకి కొత్త సినిమా వస్తే చాలు మొదటి ఆటకే అడ్వాన్సు టికట్ తీసుకొని మరీ వెళ్లేదాన్ని. ఎన్నోమార్లు నా జన్మదినోత్సవాలకి ఎన్నెన్ని పిండివంటలు, మిఠాయిలు నానోటి కందించారు. అప్పట్లో నా ఆనందానికి అవధులు లేకపోయాయి. స్నేహితురాండ్ర సందర్శి పిలిచి పార్టీ చేస్తానని మీతో మారాం చేసినా ససేమిరా ఒప్పుకోలేదు. కోపంతో నేను అలిగి పరుండిపోయానని అన్నయ్య అప్పటికప్పుడు అన్ని అయిటమ్స్ అరేంజ్‌చేసి నన్నెంతో సంతోష పెట్టాడు.

నా నవ్వే మీకొక పండగలాగుండేది. మరోమారు నా వేలి వుంగరం ఎక్కడో జారిపోయిందని మీతో చెప్పలేక భయపడి బెంగపెట్టుకుంటే, అమ్మా! నీ వుంగరాన్ని నా చేతికి తొడిగి నన్నెంతగనో లాలించావు కదా అమ్మా!

నా ఆనందంకోసం మీ రెన్నడూ దేనికి వెనుకాడలేదు. ముగ్గురన్నయ్యల తరువాత ఆడపిల్లనని ఎంతో గారాబంగా పెంచారు.

ఆ తరువాత నేను సమాజంలో ఒక రోజు వ్యక్తిగా పరిగణించబడ్డాను. స్త్రీగా నాకొక ప్రత్యేకత ఏర్పడింది. కాలేజీలోజేరి చదవ నారంభించాను. ఆ ఏడు అన్నయ్య పెళ్లికూడా జరిగింది. అన్నయ్య వేరుపడ్డాడు. మిగతా ఇద్దరన్నయ్యలు ఉద్యోగాన్వేషణకై వూళ్లు పట్టేశారు. కొద్ది రోజులకే నాన్నగారు రిటైరయ్యారు. అన్నయ్య వేరుపడటంతో ఇంటికి డబ్బు ఇవ్వటం మానుకున్నాడు.

బరువు, బాధ్యత నెత్తిన పడగానే స్వతంత్రులవుతారు. ఎవరిది వారే నన్న తలంపుకు వస్తారు గాబోలు.

ఊళ్లు పట్టేసిన ఇద్దరన్నయ్యలకు ఆ సంపాదించుకున్న జీతం రాళ్లు వాళ్ల తిండికే సరిపోవటంలేదని ఉత్తరాలు వ్రాసేవారు.

నాన్నగారికి వృద్ధాప్యం దాపురించింది. రిటైరవగా, ఆ వచ్చే డబ్బుతో ఇల్లు కట్టారు. అదే నేటికి మనపాలిట దేవతయ్యింది.

అప్పట్లో నా పెళ్లి ప్రసక్తి వచ్చినా కట్నం గురించి అంత తీవ్రంగా ఆలోచన రాలేదు. ముగ్గురన్నయ్యలకు ఒక్కగా నొక్క చెల్లెలు ఆ మాత్రం ఆదుకో— లేరా? తలొక చేయివేసి అక్షింతలు జల్లరా? అనే ఆలోచనతో అన్నయ్యలపై పూర్తి విశ్వాసంతో ఇంటి నిర్మాణానికి పూనుకున్నారు.

ఇప్పుడు ఆ ఇల్లే లేకపోతే నడిబజారులో నగుబాటు పడేవాళ్లం. పరిస్థితులు విషమించాయి. రాబడి పూర్తిగా తక్కువై పోయింది. పెద్దన్నయ్య పూర్తిగా ఇంటి ఛాయలకే రావటం మానుకున్నాడు. వదిన మాట జవదాటలేని అన్నయ్య అసమర్థుడయ్యాడు.

తల్లిదండ్రులపై దయాదాక్షిణ్యాలు కరువయ్యాయి.

ఆ ఏడు పరీక్ష ఫీజు కట్టవలసి వున్నా మిమ్మల్ని అడగలేక పోయాను. మీ దైన్యావస్థ చూచి నా నోరు పలుకలేదు.

పరీక్షకు వెళ్లకుండా వెళ్లానని అబద్ధ మాడదామనుకున్నాను. కాని మరో ఆపద్బాంధవుడు ఆదుకుని నన్నెలాగునో గట్టెక్కించాడు.

పి. యు. సి. పరీక్ష పాసయ్యాను. ఆర్థిక పరిస్థితుల ఇబ్బందులవల్ల నేను పైచదువులకు నోచుకోలేక పోయాను.

ఇటువంటి క్లిష్టపరిస్థితుల్లో మీరు నాకు పెళ్లి సంబంధాలు చూడసాగారు. ఆ వెదికే సంబంధాలు కూడా మనకు సరితూగేవి కాకుండా, నే నేదో సుఖపడి పోవాలని, పెద్దవాటికి, పై అంతస్థులకే పరుగులు పెట్టేవారు.

ఎంతచెట్టుకి అంతే గాలి వుండాలని నేనెన్నిమార్లు మొరపెట్టుకున్నా మీ చెవి కెక్కలేదు.

పెళ్లిచూపులకు పెద్ద అట్టహాసాలు, అప్పులుచేసి జరిపించి తృప్తిపడేవారు. అడ్డుపడితే అపశకునపు మాటలు కూడదని తిరిగి నన్నే తూలనాడేవారు.

పెళ్లి చూపులవారు వచ్చినట్లే వచ్చి ఏదో వంకపెట్టి మెల్లగా జారుకునేవారు.

అప్పుజేసిన డబ్బు తిరిగి తీర్చే శక్తి లేకపోయేసరికి వడ్డీలు కొండంతగా పెరిగి పోయాయి. దీనంగా ఒకరి ముఖాలొకరు చూచుకోవటం తప్ప యింకేమీ చేయలేక పోయాం.

అలా ఎన్నో సంబంధాలు తుడుచుకు పోయాయి. మరికొందరు అన్నీ జరిగాక కట్నాల దగ్గర మాత్రం కీచకులు, కిరాతకులుగా మారిపోయేవారు.

'వియ్యమైనా కయ్యమైనా సరిసమానంగా తూగాలండి' అని వోమారు ఒకాయన నాన్నగారితో అన్నాడు.

మన పరువు, ప్రతిష్ట ఎన్ని అంగుళాల మేరకు భూమిలోకి కృంగిపోయిందో,

తెగింపు

నా గుండె లెన్ని చెక్కలైందో, నా కన్నీళ్ళు ఎన్ని కడవలై నా పైటను తడిపివేసాయో మీరు ఏమాత్రం ఊహించి వుండరు.

ఒకరోజు అర్ధరాత్రి మీరిద్దరు ఏదో మాట్లాడుకుంటున్న సమయాన మంచినీళ్ళకని లేచి అటువైపుగా వచ్చాను. మీ సంభాషణ విని చకితురాలనయ్యాను.

నా గుండెల్లో నిజంగా దడ బయలుదేరింది. నాకెందుకో ఈ ఆడజన్మమీద అసహ్యం వేసింది. రోషం పుట్టుకొచ్చింది.

పుణ్యమైన స్త్రీలెప్పుడూ గొప్ప అంతస్థుల్లోనే జన్మిస్తారు గాబోలు.

శ్రీమంతుల వంశంలో జన్మించని స్త్రీ జీవితం పురుగుకన్నా హీనమవుతుంది.

మధ్యతరగతులలో పుట్టి పెరిగిన ఆడపిల్లల బ్రతుకులు అస్తవ్యస్తమైనవి. అయోమయమైనవి.

త్రాగుతున్న మంచినీళ్లల్లో ఆ క్షణాన ఏ విషక్రిమైనా పడి చస్తే పీడ విరగడయిపోను.

ముందు వెనుక ఆలోచనలేకుండా నా కోసం మీరెంతటి త్యాగానికైనా ఒడిగడుతున్నారు.

నాకు పెళ్లి చేయాలంటే ఒక్కటే మార్గం వుంది. లటి ఉన్న ఇల్లు కాస్తా అమ్మజూపటం. అదే మీ స్థిరి ఆలోచన. ఆ డబ్బుతో, ఏ పురుష పుంగవుడి చేతిలోనో కట్నం రూపంగా ధారపోస్తే, అతగాడు నన్నొక బానిసగా బ్రతికినన్నాళ్లు కలిసి గడపమంటాడు.

కట్నం లేకుండా నాకు పెళ్లి జరగదట. ఏ పురుషోత్తముడు అంతటి ఔన్నత్యమైన పనికి పూనుకోలేడట. అలా దిగి రావటం అసంభవమని మీ ఊహ.

దేశం గొడ్డుపోయిందా?

ఇల్లు అమ్మి వీధి అరుగులో నెత్తిన గుడ్డవేసుకొని తలిదండ్రులు దేవులాడుతుంటే ఆ ధనంతో నేను రాజయోగాలు అనుభవించాలా?

మీరు కూడుగుడ్డలకు అలమటిస్తున్నా ఫర్వాలేదు. తీయటి మాటకు, చల్లని చూపుకు నోచుకోలేకపోయినా ఫర్వాలేదు. నేనుమాత్రం సర్వసౌఖ్యాల్ని పొందాలా?

ఇదెక్కడి అనురాగం! ఇదేమి అనుబంధం?

కన్నకడుపు తీపికొఅకు ఎంతటి దారుణానికైనా వెనుదీయరన్నమాట!

మమతకు, మానవత్వానికి మరోరూపం మీరు.

నేను గుండెలపై కుంపటిని కాబోడదు, నేనంత బరువుగాన్నిగాను మంచి మానసౌశ్యం లేని మానసికానందిమో, నెత్తు బు నాకూ వుంది.

అన్నయ్య మూఢుడై, బాధ్యతారహితుడైనంత మాత్రాన, నేను తల్లిదండ్రులకు విధేయురాలిగా, వారి బరువు, బాధ్యత వహించకూడదా?

నన్ను వదిలించుకోవటానికి ఎందుకింత యాతన పడుతున్నారు. దూరంగా వెళ్లిపోయిన అన్నయ్య ప్రేమభిక్షకొరకు అంతగా ప్రాధేయపడుతున్నారేమిటి?

ఆడపిల్ల ఎదిగిన కొలది ఎంత త్వరగా వదిలించుకుంటే అంత మంచిదని ఆలోచించే వాళ్లను చూస్తుంటే, నా కెందుకో చిన్నతనమనిపించింది.

అంతా అయోమయంగా తోచసాగింది. అర్థంకాని అవస్థలో పడిపోయాను.


మీరు ఇల్లు వెచ్చించటానికే చివరి నిర్ణయం చేసుకున్నారు. ఆ డబ్బుని కట్నం రూపంలోపోస్తే, నేనేదో సుఖపడిపోతానని భావించారు. కాని మీ భవిష్యత్తు మరింత భయంకరంగా తయారవుతుందని ఊహించుకోలేకపోయారు.

నాకోసం మీ సర్వస్వాన్ని త్యాగం చేయటం నాకేదో బలహీనతగా తోచింది. నేనంతటి పాపాత్మురాల్ని గాలేను.

ఆడపిల్ల అంత బరువుగావుంటుందని, మరో మగవాడి చేతుల్లో (చచ్చినా, బ్రతికినా) వుంచటానికి నిద్రాహారాలు మాని, రాత్రీ పగలు అదేపనిగా విరామం లేకుండా ఆలోచిస్తుంటారని నేనప్పుడే తెలుసుకున్నాను.

నా పెళ్లి పెటాకులకోసం మిమ్మల్ని అంతటి భయంకరంగా చిత్రహింసకు గురి చేయలేను. మీరు పిల్లల్ని సుఖపెట్టాలని ఎంతగా శ్రమిస్తున్నారో అంతకు పదిరెట్లు మిమ్మల్ని వృద్ధాప్యంలో పిల్లలు ఆదుకోవాలి, అప్పుడే నిజమైన మానవత్వానికి అర్థం పరమార్థం వుందీ.

మీరు నాకు పెళ్లిచేయనిదే నిద్రపోరు. తిండి సహించదు. విచారంతో క్రుంగి కృశించిపోతున్నారు. నాకు పెళ్లి చేయాలంటే ఇల్లు అమ్మక తప్పదు. అమ్మినా నన్ను పువ్వుల్లోపెట్టి పూజించగలిగే భర్త వస్తాడని నమ్మకమేమిటి? కట్నాలకు కుమ్మరించిన తరువాత చూడవలసినది, మగవాడి ఉద్యోగం, అందం మాత్రమే




మీ మీ సరకుల పట్టిలో
ఉండే తీరాలిది
ఆ టీ పేరే A-1 డస్ట్
రుచికి అమోఘం
సువాసనలో గొప్పతనం
తరచి తరచి చూడండి
–డబ్బు ఆదా చేస్తుంది!
Brooke Bond Tea
Brooke Bond
A-1 Dust Tea
బ్రూక్ బాండ్ A-1 డస్ట్
ప్యాకెట్టుకు
హెచ్చు కప్పుల మంచి టీ

కాదు; అతడి గుణగణాలు; వేషాలు, దోషాలు చూడాలి. తెలుసుకోవాలి.

ఎన్నేళ్ళ పరిచయం కాకపోతే అవి గమనించగలరు. గుర్తించగలరు!

ఏమి చేసినా మీరు నాకు స్వేఛ్ఛ నివ్వలేరు. ఇన్నాళ్ళకు అజ్ఞానం అనే చీకటి ముసుగు తొలిగిపోయింది.

మీరు సుఖపడాలంటే నేను దూరంగా పారిపోవటం ఒక్కటే శ్రేయస్కరమైన మార్గం. ఆ విధంగానైనా మీరు కట్టించుకున్న ఇంట్లో శాంతిగా బ్రతికినన్నాళ్ళ నీడపరుచుకుంటారు.

ఆ ఆలోచనే నన్ను నా ప్రియతముడి దగ్గరకు చేర్చింది. వర్ణాంతరాన్ని నేను ఖాతరు చేయను. జాతి విచక్షణా భేదం నాకు లేదు. అదంటే నాకు మంట.

నా హితవు కోరేవాడు, నన్ను ప్రేమతో, అనురాగంతో లాలించి బుజ్జగించేవాడు. నా ఆపద సమయాల్లో ఆప్యాయతతో ఆదుకునేవాడు నాకు కావాలి.

అలాంటివాడే అసలు స్త్రీకి భర్తగాని, ఎక్కడో, ఎప్పుడో ముక్కూ మొగం చూడని మగవాడికి పచ్చనోట్ల ఎర చూపి ముడివేయించటం, నిజంగా అది నా దృష్టిలో కిరాతక చర్య కిందే జమకడతాను.

నాకీ సంఘంపై ద్వేషం, పగ యింకా చల్లారలేదు.

ఈ నాగరికతా సమాజం ఇంకా బాల్యంలోనే వుంది. పెరుగుదల లోపించింది.

ఇది యింకా పైకి, పైపైకి రావా

తెగింపు

లంటే నాలాంటి స్త్రీలింకా యెంతో ముందడుగు వేయాలి.

కట్నాలకై కక్కుర్తి పడే మగరాయళ్లకు గట్టిగా బుద్ధిచెప్పే సమయం రావాలి. దానికై ప్రతి యువతి ఎదురు చూడాలి. అవసరమైతే ఎదురు తిరగాలి.

అమ్మా! నే నావేశపడుతున్నాను కదూ! నా ఆందోళన అలా వుంది మరి. అసలు నేను చేసిన అంత పెద్ద తప్పేమిటమ్మా? మీ దృష్టిలో అది అంత పెద్ద నేరమయి పోయిందా?

నాకు నేనే, కోరుకుని మీ సమ్మతి లేకుండా పెళ్లి చేసుకున్నందుకు నాది దోషమే! కాదనగలనా? కానీ ఈ రోజు మీరు అంత హాయిగా మీరు వేసుకున్న నీడలో నిశ్చింతగా గుక్కెడు నీళ్ళు తాగుతున్నందుకు మీకు గర్వంగా లేదూ?

అమ్మా! ఆడపిల్లలకు కట్నం పోస్తేనేగాని పెళ్లి కాలేదని మంకు పట్టు పట్టే మీలాంటి వాళ్ళందరకూ నా చర్య ఒక గుణపాఠంగ, గుర్తింపుగా నిలుస్తుందమ్మా!

ఆనాడే నాలో ఆ తెగింపే లేకపోతే మీరీనాడింత సౌఖ్యంగా వుండేవాళ్ళా?

కష్టాల్లో కొడుకులు మిమ్మల్ని ఆదుకునేవారా? పరిస్థితులను అవగాహన చేసుకొనే ధైర్యం చేసాను. ధృఢమైన మనస్సుంటే మహా కార్యాలే, సాధించవచ్చు. కొడుకుల సంపూర్ణమైన సహకారంతో, సంతోషంగా మీరు నాకు పెళ్లిచేయలేరనే నిరాశ, నిస్పృహ నాలో పెరిగింది. అది నామనోవేదనకు దారితీసింది.

పెద్దన్నయ్య వదిన మాటల్ని పెడచెవినిపెట్టి నాకు పెళ్లి తలపెట్టలేదు. ఆ ఆలోచనే రానీయడు.

మిగతా అన్నయ్యలు వాళ్ళ పొట్టకే నానాపాట్లు పడుతూ బాధ పడుతున్నా, వాళ్ళకు ఒక పెళ్లికెదిగిన చెల్లెలుందని గుర్తుంటుందా? వాళ్ళు నాకు పెళ్లి చేయగలరా? ఎంతటి హాస్యాస్పదంగా వుంటుందో ఆలోచించగలరా?

ఉన్న గూటిని కాస్తా అమ్మి నన్ను మీరు సుఖపెట్టగలరా? మీరు నిశ్చింతగా ఉండగలరా? అంతా భ్రమ. వృధాశ్రమ.

ఇవన్నీ నాపై ఎదురు తిరిగిన బలమైన కారణాలు భయంకరమైన నగ్నసత్యాలు.

వీటన్నిటికి సమాధానాలు నాకు నేనే సరిజేసుకోవాలి. ఆ బరువు, బాధ్యత నాపైనే వుంది. నేనే భరించాలి.

మీపై భారాన్ని మోపి బాధ్యతల్ని విస్మరించటం వివేకమనిపించుకోదు.

అందుకనే, దేనికన్నా గుర్తింపు, తెగింపు వుండాలని తెలుసుకున్నాను.

కనుకనే, నా అంతట నేనే, నాకిష్టమైన వాడ్ని, నన్ను ఇష్టపడేవాడ్ని వివాహమాడాను.

కట్నాని కాశపడని మగవాడుండడు. ఇచ్చేవాళ్ళుంటే పుచ్చుకునేవాళ్ళు కాదూ?

ప్రేమ వివాహాలంటే మీ దృష్టిలో అదో పెద్ద నేరం. ఘోరం కాని కట్నమిచ్చి పెళ్ళి చేయలేని మీరు, ప్రేమ వివాహాలనైనా ప్రోత్సహించలేని మీరు ఏకార్యానికీ పూనుకోకుండా నన్నెలా సుఖపెడతారు? నాకానందాన్నెలా కలిగించగలరు?


ఇవన్నీ గుర్తించే తెగించాను. నాలో ఆ తెగింపు వుంది. నాకు అన్నివిధాలా అనుకూలుడైన భర్తని ఎన్నుకున్నాను.

నా జీవితం ఇప్పుడు సుఖప్రదంగా, హాయిగా, ఆనందంతో— వోలలాడుతోంది.

అనుదినం మీదీవనలకై ఎదురుచూస్తున్నామని మరోమారు గుర్తుచేస్తున్నాను.

మా గృహాన్ని మీరొకసారి పావనం చెయ్యండి. మాకు కన్నులపండువ చెయ్యండి.

సదా మీ శ్రేయస్సునే కాంక్షిస్తున్నాను. మీ ఆనందమే నా సంతోషం. నా సౌఖ్యమే, మీ క్షేమమే నా ఆశయసిద్ధి. ●





మనఃపరివర్తన

బులుసు వేంకటరమణయ్య

దొంగతనం చేసికొని, కొట్లాటలలో గాని, తదితర దౌర్జన్య చర్యల్లోగాని అపరాధి పట్టుపడితే శిక్ష విధించి చెరసాలలో ఉంచుతారు. అపరాధి ఆయా అపరాధాలనుబట్టి పరిమితమైన కొంత కాలం మాత్రం శిక్షను అనుభవించవలసి వుంటుంది, హత్యలు మున్నగు కొన్నిటిని మాత్రం తప్పించి. చెరసాలలో దుర్భరంగా జీవితాన్ని గడపవలసి వుంటుంది. కష్టాలు పడుతున్న ఆ వ్యక్తి తన తప్పులను గ్రహించి, పశ్చాత్తాపం పొంది, విడుదల అయిన తర్వాత సరిఅయిన పద్ధతిలో నడచుకోవాలనే అభిప్రాయంతోనే యీ విధంగా శిక్షలు విధించబడతాయి. అపరాధుల్లో చాలామందికి మనః పరివర్తనం కలిగి —తర్వాత వాళ్లు ఋజుమార్గంలో ప్రవర్తించడం కానవస్తూ ఉన్నది.

అయితే — కొందరు మొండిఘటాలు లేకపోలేదు. అసురతత్వంగల ఆ వ్యక్తులు జైళ్ళలో ఎన్నికష్టాలు పొందినా—వాళ్ల మనస్సులో మార్పు కలగదు. చెరసాల జీవితానికి అలవాటు పడిపున్నవాళ్ళు శిక్షాకాలం పూర్తి అయి బయటికి వచ్చినా, మళ్లీ అపరాధంలో పట్టుపడి జైలులో పడతారు. వాళ్లలో మానవత్వం మాయమవుతుంది.


అపరాధిని కనిపెట్టి పోలీసులకు అప్పగించినట్లయితే — పోలీసుల మీద కంటే—ఆ పట్టియిచ్చిన వారి మీదనే అతనికి పగ ఎక్కువగా ఉంటుంది. మన పొలంలోని పంటనుగాని, ఇంట్లోని వస్తువాహనాలనుగాని అపహరించిన దొంగను మనం పట్టియిస్తే—శిక్షాకాలం పూర్తి అయాక విడుదల అయిన ఆ ఆసామీ మనమీద పగపట్టి ఎలాంటి హాని చెయ్యడానికయినా సిద్ధపడతాడు. అంతే కాని—తాను చేసినది తప్పుపని అని గ్రహించే స్థితికి రాడు. అందువల్ల పశ్చాత్తాపం కలగనే కలగదు.

అలాటి కఠినహృదయుల మనస్తత్వాన్నికూడా మార్చడం సాధ్యమవుతుంది. అయినా—

ఒకవ్యక్తి దేనినయినా అపహరించినప్పుడు—ఆ సంగతి గ్రహించి—అతన్ని పట్టుకుని ఆ వస్తువును తీసుకుంటే—అతనిమనస్సు మారడం అసాధ్యం. మళ్లీ మరొక అవకాశం చూచుకుని అపహరించి, తన నష్టాన్ని పూర్తి చేసుకోవాలనే సంకల్పమే ఆ ఆసామీకి కలగవచ్చు. మనమీద ద్వేషమూ కలగవచ్చు. అలా చెయ్యకుండా, ఆ వస్తువును అతడు అపహరించుకొని పోతూ ఉండగా ఊరుకున్నా ఫలం ఉండదు. తాను తస్కరించడం ఎవ్వరికీ తెలియలేదనే ధీమా అతనికి కలుగుతుంది. తర్వాత కూడా అతని వ్యాపారం వహామూలుగానే సాగిపోతుంది.

మనస్సు మార్చి మంచి పద్ధతిలో మనిషిని పెట్టడానికి చెయ్యవలసినది ఏమిటంటే—

ఏ వ్యక్తి అయినా వస్తువులను— అపహరిస్తున్నప్పుడు చూచి, వాటితో కూడా మరికొన్నిటిని ఇవ్వాలి, 'నీకు ఎంతో అవసరం ఉండబట్టే వీటిని తీసుకోడానికి శ్రమపడి వచ్చావు' అంటూ ఘంచిగా మాటలాడాలి. అలా చేస్తే— ఆ వ్యక్తి మనస్సు తప్పకుండా మారుతుంది. తాను తీసుకున్న వస్తువులు అక్కడే ఉంచివేసి — పశ్చాత్తప్త హృదయంతో వెళ్లిపోతాడు. ఒకవేళ—అలాకాక —ఆ వస్తువులను తీసికొని వెళ్ళినా— తర్వాత—మరెన్నడూ ఆ పనికి పూనుకోడు. పశ్చాత్తాపం కలుగుతుంది. మనసు తప్పక మారుతుంది.



శ్రీమతి శ్రీమావో ఏమి చేస్తుంది?

-రాల్ నాక్స్



శ్రీమతి బండారనాయకే

ఈసారి ప్రధానిగా శ్రీమతి శ్రీమావో విధానాలు ఎలాగ ఉంటాయి? ఈ వ్యాసం రాసిన శ్రీ రాల్‌నాక్స్‌కి ఆమె వ్యక్తిగతంగా తెలుసు. ఆమె విమర్శ సహించదు, ఆమెకిఅడ్డదార్లు తొక్కే అలవాటు ఉంది అంటారు రచయిత—కాని, చేసిన తప్పులవల్ల నేర్చుకునే శక్తికూడా ఆమెకి ఉంది అంటాడు.

శ్రీమతిశ్రీమావో బండార్‌నాయకే తిరిగి సింహళప్రధాని అయింది. అయిదు సంవత్సరాలక్రితం ఆమె 'శ్రీలంకా ఫ్రీడమ్‌పార్టీ' ఎన్నికలలో ఓడిపోయి శ్రీ డడ్లీసేనానాయకపార్టీ 'యునయిటెడ్ నేషనల్ పార్టీ' అధికారంలోకి వచ్చింది,

సింహళద్వీపజనానికి ఏ ప్రభుత్వమూ ఎక్కువకాలం అధికారంలో ఉండటం ఇష్టంలేదు అని మాత్రమే ఈ మార్పు అర్థం అంటారు కొందరు గడుసువాళ్ళు...ఏది ఏమయినా ఎన్నికలలో ఎన్నిక స్వాతంత్ర్యం అనేది సింహళంలో ఉంది అనవచ్చు!

1960లో శ్రీమతి శ్రీమావో పార్టీ కొందరు కమ్యూనిస్టుల, మార్క్సిస్టుల మద్దత్తుతో తనపార్టీని గెలిపించింది అంటే కొన్ని ప్రత్యేక కారణాలు లేకపోలేవు.వాటిలో ఒకటి ఆవిడ కీ. శే. ఎస్. డబ్ల్యు.ఆర్. డి. బండారనాయకే వితంతువు కావటమే. (శ్రీ బండారనాయకేని నలుగురు తీవ్రవాద బౌద్ధభిక్షువులు హత్యచేశారు.) ఆమెపట్ల ప్రజలకి సానుభూతి కలిగింది. వోట్లు వేశారు.

అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె కొన్ని పొరపాట్లు చేసింది. ఉత్తర సింహళంలో తమిళుల 'తిరుగుబాటు'ని క్రూరంగా అణచివేసిందనే ఆరోపణ ఎన్నోచోట్ల వినపడింది. ఈ ఆరోపణకి ఆమె సమాధానం ఏమిటంటే—సైన్యం ఎంతో సహనంతో నడుచుకుంది, అని; ఎందరో వందలమంది తమిళులని కాల్చివెయ్యాలని తను మొదట అనుకున్నది, అని!

ఆమె ప్రధాన సలహాదారుడు ఆమె చుట్టం ఫెలిక్స్ డయాస్ బండారనాయకే. అతని సలహాని పాటిస్తూ ఆమె ఎంతో గడసరితనాన్ని అలవరుచుకుంది. భారత ప్రధాని మేడమ్ గాంధి వలనే తానూ కేవలం కొందరు పురుషుల చెప్పుచేతలలో ఉండే ఆడ నాయకురాలు కాదని రుజువు చేసుకుంది......

ఆర్థిక కారణాలు

1965 శ్రీమతి శ్రీమావో పార్టీ ఓడిపోవటానికి ఎన్ని కారణాలు ఉన్నా

శ్రీమతి శ్రీమావోకి వోట్లు వేసిన యువతరంవారిని సమాధానపరచాలి!

ఆర్థికమయినవే ముఖ్యమయినవని చెప్పాలి. అధికారంలో ఉన్నప్పుడు ఆమె పార్టీవారు అమెరికన్ సహాయం వద్దన్నారు, విదేశీ వ్యాపారస్థులని బెదిరించేవారు, ఇబ్బంది పెట్టేవారు. చివరికి దేశంలో ఎంతో అసంతృప్తికరమయిన పరిస్థితి ఏర్పడింది.

1970 ఎన్నికలలో ఆమె విజయానికి తోడ్పడినవీ ఆర్థికమయిన కారణాలే! ప్రపంచ బాంక్ సూచన ప్రకారం శ్రీ డడ్లీ సేనానాయక రూపాయి మారకం విలువ తగ్గించటమేకాక వారం బియ్యం రేషన్‌ని నాలుగునుంచి రెండు పళ్ళకి తగ్గించాడు. ఒకవయిపు వరి పండించే రయితుకి సబ్సిడీ యిస్తూ మరొకవయిపు పట్నాలలో బియ్యాన్ని తినేవారికి సబ్సిడీ ఇప్పించడం కష్టం అని ప్రపంచ బాంక్‌వారు అన్నారు. సాగుబడిలో కొత్త పద్ధతులని తీసుకు వస్తున్నారు కాబట్టి రయితులకి సబ్సిడీ ఇవ్వక తప్పదు. ఈ కొత్త పద్ధతులవల్ల సిలోన్‌లో ఆహారధాన్యాల పంట విపరీతంగా పెరిగింది. అసలు సింహళం ఆర్థిక పరిస్థితిని చక్కపెట్టటానికి సేనానాయక ప్రభుత్వం చేసినది ఇంతా అంతా కాదు. అయితేనేమి, ద్రవ్యోల్బణం పెరుగుతోంది. 5 లక్షలమందికి ఉద్యోగాలు లేవు (మొత్తం జనాభా 1.2 కోట్లు.) బియ్యం రేషను సగం అయితే ఎవరు సహిస్తారు?

శ్రీమతి శ్రీమావో వయస్సు దాదాపు అరవయి. సింహళద్వీపవాసులు మొత్తం మీద చలాకీవారు. పాత ప్రభుత్వం మీద కోపంతో ఆమె పార్టీకి వోట్లు వేసిన వారిలో ఎందరు ఆమె విధానాలని చూసి హర్షిస్తారు?

శ్రీమతి బండారనాయకేకి విమర్శ అంటే కోపం. కొందరు కార్టూనిస్టుల బొమ్మలని చూసి కోపం వచ్చి ఆమె పత్రికలని అదుపులో పెట్టటానికి ప్రయత్నించింది అంటారు. 1965 లో నేను, కొత్త ఎన్నికలు జరగకపోవచ్చునన్నాను. అవి జరగకుండా ఉండేందుకు ఎత్తులు వేస్తున్నారు అన్నాను. నన్ను సిలోన్ నుంచి వెళ్లిపొమ్మన్నారు!

ప్రజాస్వామ్యంగురించి శ్రీ సేనానాయక హెచ్చరికలు చేశాడుగాని వోటర్లకి బియ్యం రేషను సంగతే గుర్తుకివచ్చింది, వోట్లు వేసే సమయంలో......


శ్రీమతి బండారనాయక విద్యాభ్యాసం ఆమెలో ఇంగ్లీషువారిపట్ల ఏహ్యభావాన్ని కలిగించింది. ఆమె సహచరులకి కొందరికి అమెరికా అంటే పరమద్వేషం. ప్రపంచ బాంక్‌వారు మహావేలినది పథకానికి సహాయం చేస్తామంటే అది సింహళ స్వాతంత్ర్యానికే ముప్పు అన్నట్లు ప్రచారం చేశారు. కొత్త ప్రభుత్వం విదేశీ బాంకులని తప్పకుండా జాతీయం చేసివేస్తుంది—వాటిలో ఎక్కువ బ్రిటిషు బాంకులే. అయితే, శ్రీమతి బండారనాయక పదవి సుస్థిరంగానే ఉండి సింహళం అమెరికా డాలర్ల సహాయాన్ని పుచ్చుకొనటానికి వీలు కావచ్చు. ఈ సహాయం సింహళానికి అవసరం.


తమిళులు

ఇక తమిళ సింహళవాసుల సంగతి—వీరిపట్ల శ్రీమతి శ్రీమావో ఎప్పుడూ ఉదాసీనంగా ఉంటూ వచ్చారు. నేడు ఆమెకి మంచి మెజారిటీ ఉంది. పార్లమెంటులో తమిళప్రతినిధుల మద్దతు ఆమెకి అవసరం కాకపోవచ్చు. అయితే, ఈసారి ఎన్నికలలో ఆమెకి బౌద్ధసన్యాసుల బలం అంతగా అవసరం లేకపోయింది. దీని అర్థం ఏమిటంటే, ఈ సన్యాసులని సంతోషపెట్టటానికని ఆమె తమిళులతో పేచీలు పెట్టుకో నవసరం లేదు...

ఏది ఎలా ఉన్నా, ఆమెకి కొంతకాలం దాకా చేతినిండా పని ఉంటుంది. యువజనంవారు ఆమె సోషలిజమ్ ప్రతినిధి అంటున్నారు. శ్రీమతి బండారనాయకేకి అడ్డదార్లుతొక్కే అలవాటు ఉంది: సింహళజనం దీనిని సహిస్తారా? వారికి ప్రజాస్వామ్యం అంటే ఇష్టం......

(ఫో. వ. ఫీ) ●





కమల :

బి. యే. ప రీ క్ష లు వ్రాయటం పూర్తవగానే విజయవాడ వెళ్లేను.

విమలను చూసి స రీ గ్గా సంవత్సర మయింది అప్పటికి. విమలా, నేను చిన్ననాటి స్నేహితురాళ్లం. ఒక కంచంలో తిని ఒక మంచంలో పడుకోకపోయినా రోజులో చాలాభాగం యిద్దరమూ కలిసే గడిపేవాళ్లం. సాధారణంగా మా యిద్దరి మధ్య దెబ్బలాటలు వచ్చేవి కావు. ఎప్పుడైనా వచ్చినా ఎవరో ఒకరం మాటలు కలపటానికి ప్రయత్నించేవాళ్లం. కొద్ది నిమిషాల్లోనే మాదెబ్బలాట మర్చిపోయి మామూలుగా ఆడుకునే వాళ్లం.

విమలకి వాళ్లవాళ్లు స్కూల్‌ఫైనల్ తోనే చదువు మాన్పించి పెళ్లి సంబంధాలు చూడటం ప్రారంభించేరు. నేను కాలేజీ చదువుకోసం కాకినాడ వెళ్లేను. సెలవల్లో యింటికి వచ్చినప్పుడల్లా మా కబుర్లకు అంతనేది ఉండేది కాదు. గడ్డివాము చాటున, కాలవగట్టున, చెట్ల పాదుల దగ్గర, ఎక్కడపడితే అక్కడ కూర్చుని గంటల తరబడి కబుర్లు చెప్పుకునేవాళ్లం. నేను మా కాలేజీ అమ్మాయిల ఫాషన్లు, లెక్చెరర్లు, విద్యార్థుల అల్లరి చేష్టలు మొదలైన వాటిని గురించి చెప్తే విమల మా గ్రామరాజకీయాలనుండి తన పెళ్లిచూపుల కోసం వచ్చిన అబ్బాయిలవరకు అన్నీ చెప్పుకొచ్చేది.

నేను బి. యే. ఫైనలియర్‌లోకి ప్రవేశించక ముందు వేసవిలో విమల పెళ్లయింది. అప్పుడు నేను రెండవ సంవత్సరం పరీక్షలు వ్రాస్తుండటం వల్ల విమలపెళ్లికి వెళ్లలేక పోయేను. తరువాతకూడా విమల వచ్చినపుడు నేను ఊళ్లో లేకపోవటం, నేను వచ్చినప్పుడు విమల లేకపోవటం జరగటంవల్ల మేమిద్దరం కలుసుకోవటం కుదరలేదు. మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు మాత్రం తరచుగా నడుస్తూండేవి

పరీక్షలవగానే యింటికికూడా పోకుండా సరాసరి విజయవాడ ప్రయాణమయ్యేను. రైల్లో ప్రయాణం చేస్తున్నంతసేపు, మా యిద్దరి స్నేహాన్ని గురించి ఆలోచించుకుంటూ గడిపేను.

రైలు విజయవాడ స్టేషనులో ఆగగానే విమల నవ్వుముఖం కనిపించింది. ప్లాట్‌ఫారంమీద నేను అడుగుపెట్టగానే విమల గబగబ వచ్చి నన్ను కౌగలించుకుంది.

మా యిద్దరికి అప్రయత్నంగా కన్నీళ్లు వచ్చినయ్.

మాలోని భావోద్వేగం తగ్గి మేము మామూలు మనుషుల మయ్యేసరికి అప్పటికే విమల భర్త విశ్వం రెండు రిక్షాలు మాట్లాడటం, అందులో ఒకదాంట్లో నా సూట్‌కేసు పెట్టటం కూడా జరిగిపోయినయ్.

అంతవరకు ఆయన ఉనికినే మర్చిపోయిన మేమిద్దరం అటుచూసి సిగ్గుపడ్డాం.

విమల యేదో అనబోతుండగా ఆయన

నవ్వుతూ 'నేరే యింక పరిచయాలెందుకు? మీ యిద్దరి స్నేహాన్ని గురించి నువ్వు రోజూ చెప్తుంటే వింటున్నాను. ఈరోజు ప్రత్యక్షంగా చూస్తున్నాను' అన్నారు.

నేను విమల ఒక రిక్షాలోను, విశ్వం రెండవ దాంట్లోను ఎక్కి బయలుదేరేం.

పెళ్ళయిన తరువాత విమల శరీరంలో చాలా మార్పు వచ్చింది. విమల పెళ్ళికాక పూర్వం సన్నగా, సుకుమారంగా ఉండేది. ఇప్పుడు కొంచెం లావయింది. శరీర ఛాయ కూడా పెరిగింది. ముఖంలో ఒక కొత్త కాంతి, నడకలో ఠీవి వచ్చినయ్. ఐతే మనస్తత్వంలో మాత్రం ఎక్కువమార్పేమీ వచ్చినట్లు కనపడలేదు. అప్పటిలానే గల గల నవ్వుతూ దారిపొడుగునా కబుర్లు చెప్పసాగింది.

ఇంటికి చేరుకోగానే స్నానంచేసి కడుపు నిండా భోజనం తిని వళ్ళు తెలియకుండా నిద్రపోయేను. మళ్ళీ నిద్రలేచేసరికి సాయంత్రం నాలుగయింది. విమల, విశ్వం అప్పుడే ఫలహారం, కాఫీ తీసుకుని తీరికగా కూర్చున్నారు.

నన్ను చూడగానే విశ్వం నవ్వుతూ 'లేవారా? రండి. విమలకి ఒకటే ఆత్రంగా ఉంది మీరు ఎప్పుడు లేస్తారా, ఎప్పుడు హస్కు మొదలెడ్తామా అని' అన్నాడు.

'నేను వట్టి వాగుడు కాయననని మీరు మాటి మాటికీ చెప్ప నక్కరలేదు' చిరుకోపంతో అని లేచింది విమల. 'కమలా, రా. కూర్చో. టిఫిను తీసుకొస్తాను' అంటూ లోపలికి వెళ్ళింది.

విమల లేచివెళ్ళిన సోఫాలో కూర్చున్నాను నేను.

విశ్వం 'ప్రయాణం అదీ బాగా జరిగిందా?' అనడిగేడు.

'థర్డ్ క్లాసు రైలుపెట్టిలో ప్రయాణం ఎలా జరిగేదీ వేరే చెప్పాలా?' అన్నాను నేను.

గట్టిగా నవ్వేడు విశ్వం.

కొద్దిసేపైనాక అన్నాడు విశ్వం. 'విమలకి మీరంటే పిచ్చిప్రేమ. మీ రూపం, గుణం, మీ అలవాట్లు, అభిరుచులు—ఒకటేమిటి—మీలో ఆమె మెచ్చుకోని విషయమంటూ లేదంటే నమ్మండి. ఒక్కొక్కప్పుడు ఆమె మీ మీద చూపుతున్న అభిమానానికి నాకు అసూయకూడా కలిగేది. కొత్తగా పెళ్ళయిన స్త్రీ అయినా మొగుణ్ణి గురించి గొప్పలు చెప్పుకోవటం చూసేంకాని స్నేహితురాలిని గురించి డబ్బా వాయించటం ఎక్కడా చూళ్ళేదు.'

అతనలా అంటుంటే నా కదోలా అనిపించింది.

నిజానికి నాకు మగవాళ్లతో మాట్లాడాలంటే అదోరకం బిడియం. అందులో మొదటినుండి ఆడపిల్లలబళ్లో చదవటం వల్ల ఆ బిడియం మరింత ఎక్కువయింది. అందుచేత విశ్వం అంత చనువుగా నాతో మాట్లాడుతుంటే సిగ్గనిపించింది నాకు.

నా చేతి గోళ్లకున్నరంగు వైపుచూసుకుంటూ తలవంచుకుని కూర్చున్నాను.

ఇంతలో విమల టిఫిను, కాఫీ తీసుకు వచ్చింది. వస్తూనే 'ఏమిటలా కొత్త పెళ్ళికూతురిలా తల వంచుకుని కూర్చున్నావ్? మా వారేమన్నా జోక్ వేసేరేమిటి?' అంటూ ఆయన పక్కనే కూర్చుంది.

నేను నవ్వాను.

విశ్వం 'అందరూ నీలానే ఉంటారేమిటి? ఆమెది కొంచెం మైల్డ్ నేచర్!' అన్నారు.

విమల ముఖం చిన్నబోవటం నేను గమనించక పోలేదు.

కొంచెం మొహమాట పడుతూ నేను ఫలహారం, కాఫీ పూర్తిచేసేను.

ఆ సాయంత్రం ముగ్గురం కృష్ణానది వైపుగా షికారుకు వెళ్ళాము.

షికారుకు బయల్దేరేముందు నేను డ్రెస్ చేసుకుంటూ అద్దంలో నా ప్రతిబింబాన్ని చూసుకున్నాను. పింక్ కలర్ మీద ఎర్రటి గులాబిపూలున్న నైలెక్స్ శారీ, ఎర్రబ్లౌజు, చెవులకు పెద్దరింగులు. మెడలో సన్నని గొలుసు. నాకంటికి నేనే ఎంతో అందంగా కనిపించేను. ఎంతో గర్వమనిపించింది నాకు.

వెంటనే ఆనాటి విమలరూపం గుర్తుకు వచ్చింది నాకు. బంగారపు జరీ పూలు కుట్టిన తెల్లని పట్టు చీర, జాకెట్టు, గుండ్రని మెడను స్పృశిస్తున్న వెడల్పాటి నల్లపూసల దండలలో విమల ఎంతో హుందాగా కనపడింది.

నాలో ఎంత అందమున్నా ప్రస్తుతం విమలలోవున్న నిండుదనం దర్జా లేవనిపించింది నాకు. వివాహంవల్ల విమల సౌందర్యం పరిపూర్ణత చెందిం..

అలా అస్తవ్యస్తంగా ఆలోచించుకుంటూన్న నేను 'ఇంకా ఎంతసేపే నీ సింగారం?' అన్న విమల పిలుపుతో ఉలికిపడి చూసేను.

గుమ్మందగ్గర నిలబడిన విమల నన్నోసారి ఆపాదమస్తకం పరిశీలనగా చూసింది.

ఇదివరకైతే అలా చూడగా వెంటనే విమల నన్ను కౌగలించుకొని 'అచ్చు అప్సరసలా ఉన్నావే!' అనో 'అపరంజి బొమ్మవే నీవు' అనో అనేది.

కాని యిప్పుడు నన్ను చూట్టం అవగానే వెంటనే కళ్ళు వాల్చేసుకుని 'త్వరగా రా. బయట రిక్షాలు నిలబడి ఉన్నయ్' అంటూ వెనక్కి తిరిగింది.

ఆమె అలా వెనుదిరిగినప్పుడు ఆమె ముఖంలో ఏవో నీలినీడలు కదలాడినట్లు నాలోని అంతర్నేత్రం యిట్టే చూడగలిగింది.

ఐతే కృష్ణ ఒడ్డున ఉన్నంతసేపూ విమల ఎంతో హుషారుగా ఉంది. వేరుశనగకాయలు, సోడా కొన్నది. కొత్తగా వచ్చిన తెలుగు సినిమాలను గురించి పత్రికలు, ప్రజలు ఏమంటున్నదీ చెప్పింది. మర్నాడు ఫస్టుషోకి టికెట్లు రిజర్వు చేసి ఉంచమని భర్తను ఆజ్ఞాపించింది.

విశ్వం సరేసరి. విమలను చూట్టానికి అతనికి రెండుకళ్ళు చాలటంలేదా అనిపించింది.

వీళ్ళిద్దరూ ఒకరి నొకరు హాస్యాలాడుకోవటం, వెక్కిరించుకోవటం, వోరచూపుల ద్వారా శృంగార భావాలను ప్రసారం చేసుకోవటం ఒకటి, రెండు సార్లు నేను చూట్టం లేదనుకుని విశ్వం విమల నడుం మీద, మెడమీద చెయ్యివెయ్యటం అన్నీ గమనించిన నాకు ఎందుకో దిగులనిపించింది. ఏదో ఒంటరితనం ఫీలయ్యాను. అంతేకాక నా అంతరాంతరాల్లో విమలమీద ఒక రకమైన అసూయకూడా కలిగింది.

ఐతే ఆ భావాలన్నిటినీ యింటికి వెళ్లేసరికి మర్చిపోయేను. రాత్రి భోజనాలైనాక పన్నెండు దాటే రకు ముగ్గురం పేకాడుతూ కూర్చున్నాం.

ఆటలో ఓడిపోయినపుడల్లా విమల

ఇమ్మనేది. ఆమె వుడుకుబోతుతనం చూసి విశ్వం ఆమెను మరింత ఏడిపించేవాడు.

దాంతో విమల కోపంగా పేకముక్కలు అతనిమీదకు విసిరి లోపలికి వెళ్ళిపోయింది. విశ్వం లేచి ఆమెవెంట వెళ్ళేడు.

అతను విమలను మెల్లగా అనునయించటం, ముద్దులు పెట్టుకుంటూ బ్రతిమాలటం ఆ అర్ధరాత్రి నిశ్శబ్దంలో స్పష్టంగా వినగలిగిన నా మనసు అదోలాగైపోయింది. ఐదు నిమిషాల తరువాత యిద్దరూ తిరిగి వచ్చేరు.

మళ్ళీ ఆట మొదలెట్టేం.

భర్తచేత బ్రతిమాలించుకు వచ్చిన తరువాత విమల కళ్ళల్లో — బుగ్గలలో ఒక చిత్రమైన కాంతి వచ్చింది.

మాటిమాటికీ విమల భర్తమీదకు ఒరిగిపోవటం అతనేదైనా జోక్ చేసినపుడు గట్టిగా నవ్వుతూ అతని వీపుమీద, తొడమీద కొట్టటం, విశ్వం ఎర్రబారిన కళ్ళతో విమలవంక ఆరాధనగా చూడటం అన్నీ గమనించేక యింక నా మనసు ఆటమీద లగ్నం కాలేదు.

అపార్థం

'నాకు నిద్రవస్తోంది. ఆట ఆపేద్దాం.' అంటూ లేచేను నేను.

ఆ రాత్రి చాలాసేపటివరకు నాకు నిద్ర పట్టనేలేదు.

విమల:

సంవత్సరం గడిచేక మళ్ళీ యిప్పుడు చూసేను కమలను. కమల నన్ను చూసి ఏమనుకుంటుందో!

మేము హైస్కూల్లో చదువుకునే రోజుల్లో మా యిద్దరికీ పెళ్ళన్నా, మగవాళ్ళన్నా యిష్టం ఉండేదికాదు. జీవితాంతం కన్యలుగా ఉండి, ఉద్యోగం చేస్తూ ఏదో దేశాన్ని ఉద్ధరించాలనుకునే వాళ్ళం. ఆ రోజులు గుర్తుకు వస్తే యిప్పుడు నవ్వొస్తుంది కూడాను.

రైల్వేస్టేషనులో కమలను చూడగానే నా కళ్ళు చెదిరిపోయినయ్. ఎంత అందంగా ఉంది కమల!

సంతోషం పట్టలేక దానిని గట్టిగా కౌగలించుకుని ఏడ్చేసేను కూడాను.

వస్తూనే కమల స్నానం భోజనం ముగించుకుని నిద్రపోసాగింది. ఎన్నో రోజుల తరువాత కలుసుకున్నాం కదా చక్కగా మాట్లాడుకుందామంటే అదేమో గుర్రుపెట్టి నిద్రపోతోంది. అక్కడికీ ఒకటి, రెండుసార్లు గదిలోకి వెళ్ళి చప్పుడు చేసాను కూడాను. ఐనా దానికి మెలకువ రాలేదు. చిన్నప్పటినుండీ అదంతే. దానిది వట్టి మొద్దునిద్ర. వోసారి నిద్రాదేవత ఒడిలోకి ఒరిగిందంటే యింక దానిని మేల్కొలపటం బ్రహ్మతరం కూడా కాదు.

నేను మాటిమాటికీ దాని గదిలోకి వెళ్తూండటం చూసి ఆయన 'ఆమెను డిస్టర్బ్ చెయ్యకు. ప్రయాణపు బడలికతో నిద్ర పోతోంది' అన్నారు. ఇంక చేసేదిలేక వెళ్ళి ఆయన పక్కనే కూర్చుని మా చిన్ననాటి కబుర్లు చెప్పసాగాను.

మధ్యాహ్నం రెండయినా కమల లేవలేదు. నేను పకోడీలు, కాఫీ తయారు చేసేను. మేమిద్దరం తినటం అయినాక అరగంటకు లేచింది కమల.


నిద్రకళ్ళతో, రేగిన జుట్టుతో మా దగ్గరకు వచ్చింది కమల. ఈ ఒక్కసంవత్సరంలోనే కమల అందం చాలా పెరిగింది. ఆయనకూడా నాలానే కమలను రెప్పవాల్చకుండా చూస్తున్నారు. ఔను! కమల అందం అలాటిది. ఆడా, మగ అన్న భేదం లేకుండా ఎలాటివారి దృష్టినైనా నిల్పివేయగలిగే రూపం ఆమెది. కాని...కాని నా మనసులో ఎక్కడో చిన్నగా ముల్లుగుచ్చుకున్నట్లనిపించింది.

కమలకి టిఫిను తీసుకు రావటానికి లోపలికి వెళ్ళేను. ప్లేటులో పకోడీలు పెడుతుండగా బయటనుండి ఆయన నవ్వు వినిపించింది.

ఎందుకో ఆయనంతగా పగలబడి నవ్వుతున్నారు! ఆయన స్వభావమే అంత. ఎంత కొత్తవారితోనైనా యిట్టే కలిసిపోతారు.

నేను టిఫిను, కాఫీ తీసుకుని బయటకు వచ్చేసరికి కమల కొత్త పెళ్ళికూతురిలా సోఫాలో ముడుచుకుని కూర్చుంది. ఆయనముఖంలో చిరునవ్వు!

ఆ దృశ్యం చూసేసరికి నా వళ్ళు మండిపోయింది. అంత చదువుకున్నదై ఉండికూడా కమల మగవాళ్ళముందు ఎందు



కిలా సిగ్గులి మత్లే మొగ్గలా నటి స్తుంది? అది జాణతనమా, లేక అమాయకత్వమా?

ఆయనంటాడు నాలాగా కాదుట కమల. ఆమెది షైల్డ్ నేచర్‌ట! ఔను. ఈ మగవాళ్లకు పెళ్లాం తప్ప మిగతా ఆడవాళ్లంతా అద్భుతంగానే కనిపిస్తారు.

కొంతసేపైనాక నా ఆలోచనా పద్ధతికి నాకే పశ్చాత్తాపం కలిగింది. కమల నా ప్రాణ స్నేహితురాలు. ఎంతో నిష్కపటి. ఆయనస్వభావం ఎంత నిర్దుష్టమైనదో ఈ సంవత్సరంనుండీ చూస్తూనే ఉన్నాను. ఐనా నా మనసెందుకిలా పెడతోవ బట్టాల్సింది?

నామీద నాకే అసహ్యం వేసింది. నాలో నాకు తెలియకుండా ఏదో వక్రదృష్టి తలెత్తుతోందోమోనని భయం వేసింది.

సాయంత్రం కృష్ణ ఒడ్డుకి షికారు వెళ్లాం.

వెళ్లేప్పుడు కమల అప్సరసలా అలంకరించుకుంది. నైలెక్స్ చీరలో దేవకన్యలా మెరిసిపోతున్న కమలను చూడగనే నాకు మైకం క్రమ్మినట్లయింది. ఈ రూపంలో కమలని ఆయన చూస్తే...?

అసలే మగవాళ్లది చంచల ప్రకృతి. భార్యకంటె అద్భుతమైన అందంగల ఆడది ఎదురుగా ఉంటే కనీసం మానసికంగానైనా చలించకుండా ఏ పురుషుడైనా...?

నన్ను అసూయా పిశాచం ఆక్రమించుకుంటోంది. నాకు తెలుసు. కాని ఎంతగా ప్రయత్నించినప్పటికీ నాలోని ఆ భావాన్ని చంపుకోలేక పోతున్నాను.

ఒక సంవత్సరం క్రితంవరకు కూడా కమలవంటి సౌందర్యవతి నా స్నేహితురాలైనందుకు నేనెంతో గర్వపడేదానిని. కాని యిప్పుడా అందమే నా గుండెను కోసివేస్తోంది.

నిజానికి నాకు కమలమీద అసూయ యేమీ లేదు. కమల అందాన్ని చూసి నా భర్త ఎక్కడ చలిస్తాడోననే నా భయం.

కృష్ణ ఒడ్డున కూర్చున్నంతసేపూ ఆయన నోకంట కనిపెడుతూనే ఉన్నాను. ఐతే నేనూహించుకున్నట్లు ఆయన కమల అందానికేమీ ముగ్ధుడైనట్లు కనబడలేదు. ఆమె ఉనికినే గుర్తించనట్లు మామూలుగా నామీద జోక్సు విసురుతూ, మధ్యమధ్య కొంటెచేష్టలు చేస్తూ నన్ను నవ్వించేరు. రాత్రి పేకాట దగ్గరకూడా అంతే. మాటిమాటికీ నేను వోడిపోతూండే సరికి నాకు ఉక్రోషం వచ్చి, పేకముక్కలాయనమీదకు విసిరేసి వెళ్లిపోయేను. ఐనా ఆయనకు కోపం రాలేదు. పైగా ఎంతగానో బ్రతిమాలి ఆటలోనికి తీసుకు వెళ్లేరు. సాయంత్రంవరకు అలాంటి మనిషిని అనుమానించినందుకు నేను సిగ్గుపడ్డాను. నిజంగా ఆయన దేవుడు.

మర్నాడు పగలంతా కులాసాగా గడచింది. ఆయన ఆఫీసుకు వెళ్లి వచ్చే వరకు మేమిద్దరం ఎన్నోరకాల కబుర్లు చెప్పుకుంటూ గడిపేం. కమలది ఎంతో సరళమైన స్వభావం. పొరపాటునకూడా తన మాటలతో, చేతలతో ఎదుటివ్యక్తిని నొప్పించదు. అలాటి స్నేహితురాలిని చూసి నేను అసూయ పడ్డానంటే నా అంత మూర్ఖురాలు మరొకతి ఉండదు.

దాంతో మాట్లాడుతున్నంతసేపు మేము హైస్కూల్లో చదువుకున్న రోజులే జ్ఞప్తికివచ్చినయ్. ఒక్కోసారి రాత్రిళ్లు మేమిద్దరం ఎవరో ఒకరియింట్లో ఒకే మంచంమీద పడుకుని తెల్లవారు ఝాము వరకు కబుర్లతో గడిపేవాళ్లం. మళ్లా ఒకసారి అలా కమలదగ్గర పడుకుందా మనిపించింది నాకు. నా కోరికను వెల్లడి చెయ్యగానే సంతోషంగా అంగీకరించింది కమల.

సాయంత్రం ఆయన రాగానే మేము ఫలహారం కాఫీ తీసుకుని 'మేరే మెహబూబ్' సినిమాకు వెళ్లేం. స్నేహితురాలికోసం తన ప్రేమనుకూడా త్యాగం చెయ్యగలిగిన ఆ స్త్రీ గాథ నన్నెంతో కదిలించి వేసింది. ఔను. సృష్టిలో తియ్యనిది స్నేహమొక్కటే!

సినిమా అయినాక హోటల్లో భోజనం చేసి యింటికి వచ్చేం. అప్పటికి పది కొండు దాటింది.

నేను కమలదగ్గర పడుకుంటానని ఆయనతో చెప్పటానికి గదిలోకి వెళ్లేను. ఆయనకి చాలాకోపం వచ్చింది.

'పెళ్లయినాక కూడా అదేం స్నేహం? అంత పడి చచ్చేదానివైతే ఆ కమలనే పెళ్లిచేసికోకపోయేవా?' అన్నారు.

అన్నానికి ఆదరువు

అడ

రెండు కప్పుల బియ్యం, ఒకొక్క కప్పు, కందిపప్పు, మినపప్పు, పచ్చి మిరపకాయలు, ఎండుమిరప కాయలు అల్లంముక్క, చిన్న ఇంగువ ముక్క, కొత్తిమీర, కరివేపాకు ఉప్పు—

బియ్యం, పప్పులు శుభ్రంచేసి నానపెట్టాలి. ఓ మూడు గంటలేనా నాననియ్యాలి. బాగా నీళ్లు వోడ్చి, పచ్చిమిరప కాయలు, ఎండుమిరప కాయలు, ఇంగువ, అల్లం, ఉప్పు వేసి రుబ్బుకోవాలి రుబ్బుకునేటప్పుడు కావలిస్తే కొంచెం నీరు పోస్తూ ఉండవచ్చు. కొత్తిమీర కరివేపాకు వేసి రుబ్బి తీసుకోవాలి. పిండి మరీ గట్టిగానూ మరీ పల్చగానూ కాకుండా ఉండాలి.

దళసరి పెనం బాగా కాలనిచ్చి—పెనంమధ్య గరిటెతో పిండి పోయాలి. అడ చక్కగా గుండ్రంగా ఉండేలా గరిటెతో సర్దాలి. అడ మధ్య చిన్న కన్నంలా గరిటెకాడతో పిండి తొలగించి ఒక స్పూను నెయ్యిగాని నూనెగాని వేయాలి. అడ చుట్టూకూడా నూనె వేయాలి. బాగా కాలిందన్నాక అట్లకాడతో తిరగవేసి రెండోవైపున కూడా కాలనివ్వాలి. అడ పెనానికి అంటుకుందంటే, విరిగిందంటే, మధ్య నల్లగా మాడిందంటే—పెనం ఎక్కువ వేడిగానైనా ఉండి ఉండవచ్చు, వేడి తగ్గి అయినా ఉండవచ్చు.

ఈ అడకి కొబ్బరి పచ్చడి, ఊరగాయలు, బెల్లం, జామ్, తేనె ఏదైనా నల్చుకుందుకు బాగా ఉంటుంది.

—కె. ఆర్.

ఆయన కోపంచూస్తే ముచ్చటవేసింది నాకు.

ఆయన నుదుటిమీద ముద్దుపెట్టుకుని 'ఈ ఒక్కరాత్రికి...'అంటూ బతిమలాడాను. ఆయన ససేమిరా వినలేదు.

'నేనొక్కణ్ణే పడుకుంటే నాకు నిద్ర పట్టదు' అంటూ వెళ్ళబోతున్న నా పమిటచెంగు పట్టుకుని లాగారు.

ఇంతలో 'విమలా !' అంటూ వచ్చింది కమల.

ఆయన నా పమిటచెంగు వదిలేసేరు. వో సారి ఆయనని కళ్లతోనే వెక్కిరించి కమలదగ్గరకి వెళ్లిపోయేను నేను.

అప్పటికే పన్నెండు కావస్తోంది. అలసిపోయి ఉన్నందువల్ల నేను, కమల ఎక్కువ మాట్లాడుకోకుండానే వెంటనే నిద్రలోకి ఒరిగేం.

ఉన్నట్టుండి ఎవరో వెన్నుమీద చరచినట్లు మెలకువ వచ్చింది నాకు. కమల పక్కమీదనుండి సగం లేచి 'ఏమిటి ?' అంటోంది.

మా మంచం దగ్గరే బెడ్‌లైట్ వెలుగులో బిత్తరచూపులతో ఆయన !

నేను కళ్లు తెరవగానే 'విమలా !' అన్నారు.

ఈ సమయంలో యీాయన యిక్కడికి ఎందుకు వచ్చినట్లు? నా కంటె ముందుగానే మేల్కొన్న కమల యీాయనతో ఏం మాట్లాడుతోంది? ఆయన నన్ను కమలదగ్గర పడుకోవద్దనటానికి, యీా సంఘటనకీ ఏమైనా సంబంధం ఉందా? నా తల తిరిగి పోతోంది ఆలోచనలతో.

'ఏం కావాలి మీకు ?' కఠినంగా అడిగేను.

'త...తలనొప్పి...'

'తలనొప్పిగా ఉంటే మీ గదిలోనే అమృతాంజనం ఉంది, రాసుకోండి. అర్ధరాత్రివేళ యీా నాటకాలెందుకు ?' యీాసడింపుగా అని పక్కకి తిరిగి పడుకున్నాను.

నాకు దుఃఖం ఆగలేదు. వీళ్లిద్దరూ నన్నెందుకిలా మోసం చేస్తున్నారు ? కమల పైపై మెరుగులు చూసి రెండు రోజుల్లోనే ఆయనింతగా దిగజారిపోయేరా ? ఛీ ! మగవాళ్లంతా అంతే ! భౌతికాకర్షణల ముందు ఎంతటి నైతిక

అపార్థం

విలువలను కూడా లెక్కచెయ్యరు.

అసలు పెళ్లిచేసుకోవటమంత బుద్ధి తక్కువపని మరొకటి ఉండదు. అనుక్షణం భర్త ప్రేమకోసం ప్రాకులాడుతూ ఆయన కొంచెం ప్రేమ నటిస్తే పొంగిపోయి, మోసం చేస్తే కృంగిపోయి, నిమిష నిమిషానికీ చస్తూ బ్రతుకుతూ ...ఛ ! ఎందుకొచ్చిన జీవితం యిది ?

ఆ రాత్రి నాకింక నిద్రపట్టనే లేదు. జీవితమంటేనే విరక్తి పుట్టింది. కమల మాత్రం హాయిగా పడుకొంది. తోటి ఆడదాని గుండెలో చిచ్చుపెట్టి అంత నిశ్చింతగా ఎలా నిద్రపోగలుగుతోందో!

తెలతెలవారుతూండగానే లేచి వెళ్లిపోయేను నేను. నిద్రలేమివల్ల మెదడుకు కొంత అలసటగా ఉన్నా, మనసులో రోషం, దుఃఖం అతిగా ఉండటంవల్ల ఆ వేడిలో యింటిపనులన్నీ చకచక చేసుకుపోసాగేను.

ఆరుగంటలకి కమల మరో అరగంట తరువాత ఆయన లేచేరు. నాకైతే వాళ్లిద్దరి ముఖాలు చూడటానికి కూడా అసహ్యం వేసింది. అందువల్ల ఎక్కువసేపు వంటింట్లోనే ఉండి వోకంట వాళ్లిద్దరినీ కనిపెట్టసాగేను.

కమల ముఖం కడుక్కుని అరచేతి మందాన పౌడరద్దుకుని షోగ్గా సోఫాలో చేరగిలబడి కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది పెళ్లికాని పిల్లకి పొద్దున్నే ఆ షోకులెందుకో ! పొద్దున లేచిన దగ్గరనుండి వంటింటి చుట్టూ పెంపుడు పిల్లిలా తిరిగే ఆయన యివ్వాళ యీా ఛాయలకు కూడా రాలేదంటే అందులోని అంతరార్థం యేమిటి ?

ఉప్మా, కాఫీ తయారుచేసి వాళ్లిద్దరి ముందు పెట్టి ఒక్కమాటైనా మాట్లాడకుండా గిరుక్కున వెనక్కితిరిగి వచ్చేసేను. కాఫీ తాగాక కమల స్నానానికి వెళ్లింది. కమల వెళ్లిన రెండు నిమిషాలకి ఆయన గదినుండి బయటకు వచ్చేరు. కాసేపు వంటింటి ముందు తచ్చాడి, తరువాత (బహుశా నేనాయన్ని గమనించటం లేదన్న ధైర్యంతో కాబోలు) బాత్‌రూము వైపుకు వెళ్లేరు. నాగుండె దడదడలాడింది. ఆయన అటువైపుగా ఎందుకు వెళ్తున్నట్లు ? మెల్లగా అడుగులో అడుగు వేసుకుంటూ ఆయన వెనుకనే వెళ్లేను.

మా కెదురుగా రెండుగజాల దూరంలో ఉన్న బాత్‌రూమ్ తలుపులు భళ్ళున తెరుచుకుని బయటకు వచ్చింది కమల.

కమల ఆకారం చూస్తూనే స్తంభించిపోయేను నేను. శరీరంలో కొద్ది భాగాన్ని మాత్రమే ఆచ్ఛాదిస్తూన్న లేత గులాబి రంగు టర్కీటవలు చుట్టుకుంది. అప్పుడే తడి ఆరిన, నగ్నంగా ఉన్న ఆమె బుజాలు, కాళ్లూ చేతులు ఉదయం ఎండలో నిగనిగ మెరిసిపోతున్నాయ్. నుదుటిమీద చిందరవందరగా కదులుతున్న వెంట్రుకలు...

(నన్నుచూసి కాబోలు) కంగారుపడింది కమల. వెంటనే ముఖం మార్చేసుకుని (ఎంత జాణ!) 'చూడు విమలా! నా చీరా, జాకెట్టు సూట్‌కేసుమీద ఉన్నాయికాని కాస్త తెచ్చిపెడ్తావూ? ప్లీజ్ !' అని లోపలకి వెళ్లింది.

నేను తేరుకుని చూసేసరికి ఆయనక్కడ లేరు! (ఛాను ఎందుకుంటారు? పానకంలో పుడకలా మధ్య నేను దాపురించేనయ్యె) కమల అలా బట్టలు లేకుండా తిరగటంలో ఉద్దేశ్యం ఏమిటి? ఇంట్లో ఒక మగవాడున్నాడన్న జ్ఞానం లేనంత పసిపిల్లా అది? నేను కనుక సమయానికి అక్కడికి రాకపోతే ఏం జరిగేది? ఆయనక్కడే నిలబడి గుటకలు మింగుతూ... లేదా, ఆమాంతం దాన్ని వాటేసుకుని...

ఉక్రోషంతో, బాధతో, దుఃఖంతో నా నరాలన్నీ కదలబారిపోయినయ్. ఎలాగో నిగ్రహించుకుని కమలకి బట్టలిచ్చేను. ఆరోజు భోజనం చెయ్యకుండానే ఆయన ఆఫీసుకు వెళ్లిపోయేరు.

నేను గదిలో మంచంమీద పడుకుని గుండె పగిలేలా ఏడ్చేను. కాస్త ఉపశమనం కలిగేసరికి పన్నెండయింది.

ఎంతయినా కమల నా ప్రాణస్నేహితురాలు. పైగా యిప్పుడు మాయింటి అతిథి. ఆమెను సత్కరించవలసిన బాధ్యత నామీద ఉంది. అందువల్ల వెంటనే లేచి, లేనినవ్వు ముఖానికి పులుముకుని దాంతో మాట్లాడాను. భోజనానికి రమ్మని

ఎంతో ఆప్యాయంగా పిల్చేను.

అది కూడా యేమీ జరగనట్టే భోజనానికి వచ్చి కూర్చుంది. పెరుగన్నం తింటూ కమల 'నేని మధ్యాహ్నం ట్రైన్‌కి వెళ్ళిపోతున్నాను' అంది, ఎదురు చూడని ఆ వార్తకి విస్తుపోయేను నేను. కాని మనసులో కొండంతబరువు దిగిపోయినట్లు ఫీలయ్యేను. 'ఎంత తొందరగా యిది వెళ్ళిపోతే అంత మంచిది పీడ విరగడైపోతుంది' అనుకున్నాను.

పైకిమాత్రం 'అప్పుడే వెళ్తావా? ఇంకా రెణ్ణాళ్ళు ఉండరాదూ?' అన్నాను.

'కాదు అమ్మావాళ్ళని చూసి నాలుగు నెలలపైగా అయింది. వెంటనే వెళ్ళాలి' అంది లేస్తూ కమల.

విశ్వం :

విమల స్నేహితురాలు వచ్చిన దగ్గర నుండి నా పరిస్థితి ఇబ్బందికరంగా తయారైంది. ఏ మాత్రం అరమరికలు లేని మా దాంపత్య జీవితంలో లేనిపోని స్ట్రెయిన్ కనిపించింది.

పెళ్ళయిన దగ్గరనుండి విమల నాతో ఎప్పుడు మాట్లాడినా కమలని గురించి ప్రస్తావించకుండా ఉండేది కాదు. ఒక్కొక్కప్పుడు దాని వాగుడికి విసుగు పుట్టేది కూడా నాకు.

విమల వట్టి బోళామనిషి. ఏమొచ్చినా పట్టలేదు. నిజంగా వాళ్ళిద్దరి మధ్య అంత గొప్ప స్నేహం ఉందోలేదో కాని, ఉన్నట్టు ఊహించుకుంటుంది విమల. అందుకే అదేం చెప్పినా శ్రద్ధగా వింటున్నట్లు 'ఊఁ' కొట్టి ఊరుకునే వాడిని.

కమల వచ్చినరోజున విమల సంతోషానికి పట్టపగ్గాలు లేవు. ఐతే ఒకటి మాత్రం గ్రహించేను. తన స్నేహితురాలి ముందు విమలమీద యేమైనా జోక్స్ వేస్తే దానికి నచ్చేది కాదు. వెంటనే ముఖం మాడ్చేసుకునేది. దాని మనసు కష్టపెట్టటం యిష్టంలేక నేనుకూడా జోక్స్‌వెయ్యటం మానేసేను.

కమల వచ్చినరోజు సాయంత్రం మేము కృష్ణ ఒడ్డుకి వెళ్ళేం. బయల్దేరే ముందు విమలముఖం కొంచెం కాంతి హీనంగా ఉంది. కారణం గ్రహించటానికి నాకెక్కువసేపు పట్టలేదు. పసిడి కాంతితో మెరిసిపోతున్న కమల ముందు తనెక్కడ తీసికట్టుగా ఉంటానోనని తన భయం. పిచ్చి విమల! తన అందం సంగతి ఆమెకే తెలియదు. వో చాయ తక్కువైతేనేం విమల ముఖంలోని ఆ కళ శరీరంలోని ఆ చైతన్యం— ఏ కొద్దిమంది స్త్రీలకో తప్ప ఉండదు. పైగా నేను ప్రాణాధికంగా ప్రేమించే విమలముందు ఎలాటి అప్సరసలైన దిగదుడుపే! ఈ సంగతి ఎన్నిసార్లు చెప్పినా విమలకి నామీద నమ్మకం కుదరదు.


ఆ సాయంత్రం కృష్ణ ఒడ్డున ఉన్నంతసేపూ విమల సౌందర్యాన్ని తనివితీరా చూస్తూ కూర్చున్నాను. రాత్రి పేకాట దగ్గర చీటికీ మాటికీ అది ఉడుక్కుంటుంటే ఎంతో ముచ్చటేసింది నాకు. వోసారి కోపంతో లేచి గదిలోకి వెళ్ళేసరికి ఇదే అదననుకుని నేను కూడా వెళ్ళి దానిని తనివితీరా ముద్దులతో నింపేసేను.

మర్నాడు ఆఫీసునుండి యింటికి వచ్చేసరికి విమల మంచి హుషారుగా ఉంది. కమల గొడవలోపడి నన్ను పూర్తిగా మర్చిపోయి నట్లుంది. దాంతో నా మనసు చివుక్కుమంది. ఇది చాలదన్నట్లు సినిమా నుండి తిరిగివచ్చేక రాత్రికి కమల దగ్గరే పడుకుంటానన్నది. ఇక నాకు పిచ్చికోపం వచ్చింది.

మగవాడిలో ఉన్నంత ఉద్వేగం, ఆవేశం ఆడవాళ్ళలో ఉండదేమో! ఉదయం నుండి నాకు దూరంగా ఉండికూడా ఏమాత్రం చీకూ చింతా లేకుండా తిరుగుతున్న విమలని చూస్తే నా కాశ్చర్యం వేసింది. ఇక మాటలతో లాభం లేదనుకుని విమలని అమాంతం మంచంమీద పడేసి తలుపు గడియ పెట్టేద్దామనుకున్నాను. కాని కమల అదే సమయాని కక్కడికి రావటంతో నా ప్రయత్నం ఫలించలేదు. నాకు నిద్ర పట్టలేదు. విమల సాహచర్యం ఆ సమయంలో నాకెంతో అవసరమనిపించింది.

వెంటనే లేచి హాల్లోకి వెళ్ళేను. స్నేహితురాళ్ళిద్దరూ ఒక మంచంమీద పడుకున్నారు. ఇద్దరు నిండుగా ముసుగు తన్ని పడుకోవటం వల్ల ఎవరెవరో పోల్చుకోలేక పోయేను. ఏమైనా అవసరముండి నేను పిలిస్తే వినపడేందుకనుకొని నా గదివైపున పడుకున్నట్టుంది. విమల అని భావించి దుప్పటి తొలగించేను. 'ఏమిటి?' అంటూ లేచి కూర్చుంది కమల. విమలకూడా లేచి నన్ను నిందిస్తూ నగా మాట్లాడింది. ఆ సంఘటనతో బిక్క చచ్చిపోయేను నేను.

వో పక్క విమల నన్నపార్థం చేసుకుందన్న బాధ, మరోవంక కమల కూడా నా శీలాన్నిగురించి శంకిస్తుందేమోనన్న భయం నన్నారాత్రి నిద్రకు దూరంచేసి



నయ్.

తెల్లవారినాక విమల ప్రవర్తనకూడా విపరీతంగా ఉంది. దానికి నచ్చచెప్పబోతే గట్టిగా నామీద ఎక్కడ విరుచుకు పడుతుందోనని భయం వేసింది. అనవసరంగా కమల మా దాంపత్య జీవితాన్నిగూర్చి తేలికగా ఆలోచించవచ్చు. అందువల్ల విమల కోపం చల్లారేక, ఒంటరిగా ఆమెకు సర్ది చెప్పవచ్చునని ఊరుకున్నాను.

కమలకి ఒకవేళ నామీద యేమైనా అపోహ ఉంటే క్షమాపణ వేడుకుని దానిని తొలగించాలనుకున్నాను. ఆమె కోసం ఎక్కడ చూసినా కనపడ లేదు. వంటింట్లో విమల ఒక్కతే ఉంది. ఆ పరిస్థితుల్లో విమలని పలకరించటానికి ధైర్యం చాల్లేదు నాకు. పెరట్లోకి వెళ్ళేను. అప్పుడే స్నానంచేసి బయటకు వచ్చిన కమలవంటిమీద బట్టలు సరీగ్గా లేవు. దాంతో వెనక్కి తిరిగేను 'వెళ్ళిపోదామని. ఎదురుగా విమల !

అంటే ఆమె నన్ను వెంబడించి వచ్చిందన్నమాట ! ఆమె కళ్ళలోని భావాలను ఒక్క త్రుటిలో చదవగలిగిన నాకు మొదటిసారిగా విమలమీద అసహ్యం, కోపం కలిగినయ్. అనుమానానికికూడా ఒక హద్దునేది ఉంది. నిమిష నిమిషానికీ భర్త ప్రవర్తనని శంకించే స్త్రీ తను సుఖపడలేదు. ఆతనిని సుఖపెట్టలేదు. ఆ కోపంలో అన్నంకూడా తినకుండా ఆఫీసుకు వెళ్ళిపోయేను.

కాని ఆఫీసుకు వెళ్ళేక నా ఆలోచనలు మరో మార్గంలో పయనించ సాగినయ్. విమల ప్రవర్తనకి కోపంకన్నా ఎక్కువగా జాలి కలిగింది. ఆమె ప్రస్తుత ప్రవర్తనవల్ల నాకు కొంత బాధ కలిగినా ఒక స్త్రీగా ఆమె ఆరాటాన్ని అర్థం చేసుకోవటం, ఆమె భర్తనైన నా కర్తవ్యమనిపించింది. నే నెప్పుడూ అంతే ! ఎప్పుడైనా మాటా మాటా వచ్చి విమలమీద కోపం వచ్చినా ఆమెకు దూరంగా ఉంటే సరి, తప్పంతా నాదేనని విమల క్షమార్హురాలని అనిపిస్తుంది నాకు. అంతేకాక అప్పటివరకు ఆమెను ఎంతగా కోపగించుకున్నానో అంతకు రెట్టింపు ప్రేమ ఆమెమీద జనిస్తుంది. సరిగ్గా యిప్పుడు కూడా అలాగే జరిగింది.

'సాయంత్రం ఆఫీసరు దగ్గర పర్మిషన్ తీసుకుని విమలని చూడాలనే ఆత్రంతో రోజుకన్న ఓ గంట ముందుగానే యింటికి వెళ్ళేను. నేను వెళ్ళేసరికి విమల గదిలో మంచంమీద పడుకుని ఏడుస్తోంది. 'విమలా ఏం జరిగింది?' అంటూ ఆమెదగ్గరకు వెళ్ళేను.


'కమల వెళ్ళిపోయింది— వెళ్ళేముందు ఈ ఉత్తరం నా కిచ్చిపోయింది'. రుద్ధ కంఠంతో అంటూ నా చేతికొక తెల్ల కాగితం యిచ్చింది విమల.

అందులో యిలా ఉంది !

'విమలా ! నిన్ను చూట్టానికి వచ్చేటప్పుడు నా మనసెంత సంతోషంగా ఉందో, అంత బాధతో వెళ్ళిపోతున్నాను. మీ దంపతులమధ్య అనవసరమైన వ్యాకులపాటు కల్పించి అంతకుమించిన విషాదభావాన్ని మోసుకు పోతున్నాను. ఐతే దీనికి బాధ్యు లెవరు ? ఒకరకంగా చూస్తే ఎవరమూ కాదు. మరోరకంగా చూస్తే మనముగ్గురి బాధ్యతకూడా కొంత ఉందనిపిస్తుంది.

అసలు మన సమాజంలో స్త్రీ పురుష సంబంధానికి అధిక ప్రాధాన్యతనిచ్చి దానికి సంకుచితమైన పరిధుల నేర్పరచి మనం ఒక వికృతమైన మనస్తత్వాన్ని పెంపొందించుకుంటున్నా మనిపిస్తోంది. రక్త సంబంధం లేని యువతీ యువకు లిరువురి మధ్య నిర్మలమైన స్నేహభావం ఉండగల దన్నది మన ఊహకికూడా అందని విషయం. అందుకే మనసులో ఏ దురుద్దేశ్యం లేకపోయినా కొత్తగా పరిచయమైన స్త్రీ పురుషులిరువురు స్వేచ్ఛగా మాట్లాడుకోవటానికి సంకోచపడతారు మన దేశంలో.


మన పూర్వ సంబంధం ఎలాటిదైనా నేను మీ యింటికి వచ్చేక నేనొక పరస్త్రీ నన్నభావం నీలోనే కాక మీ యిద్దరిలో కూడా దృఢంగా ఉంది. సహజంగా మనలో ఉన్న సంస్కారానికి అది తప్పని తెలిసినా తరతరాలుగా మనలో జీర్ణించుకుపోయిన నమ్మకాలు ఆచారాలు, అలవాట్లు మన ప్రవర్తనని సంకుచిత పరచసాగినయ్. ఇలా ఒకరినొకరు నిశితంగా పరిశీలించబోయి, ముగ్గురం ఒకరినొకరు అపార్థం చేసుకుంటూ ఒక జుగుప్సాకరమైన వాతావరణాన్ని సృష్టించుకుని అందులో యిమడలేక బాధ పడ్డాం. కాకతాళీయంగా సంభవించిన కొన్ని సంఘటనలు ఆ వాతావరణాన్ని మరింత కలుషిత పరచినయ్. ఈ పరిస్థితులనుండి మనకి విముక్తి కలగాలంటే నేను వెళ్ళిపోవటమే తక్షణ కర్తవ్యమని నాకు తోచి వెళ్ళిపోతున్నాను. మరో నాలుగురోజులు గడచేక యివన్నీ తల్చుకుంటే మనకి 'సిల్లీ'గా అనిపిస్తుంది. పశ్చాత్తాపం కలుగుతుంది. ఈ సారి కలుసుకున్నపుడు ఫ్రీగా, యింకా విశాల హృదయంతో ప్రవర్తించాలని కోరుకుంటాం. ఆ శుభ సమయం త్వరలోనే వస్తుందని ఆశిస్తూ— ఎప్పటికీ నీ స్నేహితురాలు కమల'.



(గత సంచిక తరువాయి)

ఉప్సాలా యూనివర్సిటీ హాస్టలు దగ్గరలో ఉన్న దుకాణంలో రకరకాల సరుకులు, వాటి ఖరీదులు చూస్తూ తిరుగుతున్నాము. మనదేశంలో పరిచితమైన లక్స్, పామాలివ్ సబ్బులు, కాల్గేటు టూత్ పేస్టు, సర్ఫ్ బట్టల సబ్బు పొడి వంటి వస్తువులు ఇక్కడ కూడా ఉన్నాయే అని గమనిస్తూ నడుస్తున్నాను. అవి తప్ప మిగిలినవన్నీ కొత్తగానే ఉన్నాయి. ఒక పక్కని దూరలు సెలోఫేన్ సంచులలో కట్టి, ధరలు వ్రాసి ఉన్నాయి. కేబేజి కిలో 4—40 క్రౌనులు. ఒక స్వీడిష్ క్రౌను మన 1—45 రూ.లకి సమానం. ఇంత ఖరీదేమిటి? టొమాటోలు కిలో 3-50 క్రౌ. నా తలకాయంత వంకాయ ఒకే ఒకటి ఉంది. అది కిలో 4.50 క్రౌ. చిత్రం ఉల్లిపాయలకన్న ఒకటోరకం పిప్పళ్ళు చవక! ఉల్లిపాయలు కిలో 3-50. అవి అయినా వడిలి పోయినట్లున్నాయి. ఏపిల్సు కిలో 2—90 క్రౌ. మాత్రమే. మనదేశపు టీ బ్రూక్‌బాండ్స్ అనే ఇంగ్లీషు కంపెనీ డబ్బాలో పోసి అమ్ముతోంది కిలో 25 క్రౌ. ఈ లోభం అంతా ఇంగ్లండుకా పోవడం అనిపించింది. పలుచని 5 అప్పడాలు 5 క్రౌనులు. ఇలాగ వస్తువుల ధరలన్నీ మనదేశంలోకన్న చాలా ఎక్కువగా ఉన్నాయి. దానికి తగ్గట్టుగా వీరి ఆదాయాలు కూడా చాలా ఎక్కువే. కూలి పని చేస్తే గంటకి 8 క్రౌనులు ఇస్తారు. ఇక్కడ అందరికన్న ఎక్కువ జీతాలు టీచర్లకి. బళ్ళకలేక బడిపంతులనే సామెత మనదేశంలోనే. ఎలిమెంటరీ స్కూలులో 1వ తరగతికి పాఠాలు చెప్పే పంతులమ్మకి నెలకి రెండువేల క్రౌనులు జీతం.

పాలు, పెరుగు కాగితపు డబ్బాలలో పోసి, సీలు చేసి ఏ తేదీలోపుగా అమ్మాలో ముద్రవేసి ఉన్నాయి. ఏవి పాలో ఏది పెరుగో పైన ఉంది కాని చదివి అర్థం చేసుకోగల భాషాపరిజ్ఞానం లేక, అక్కడికి కొనడానికి వచ్చిన ఒక స్వీడ్‌ని అడిగేను. ఇక్కడి యువతరం అంతకీ కొద్దో గొప్పో ఇంగ్లీషు వచ్చును. అందులోనూ ఉప్సాలా యూనివర్సిటీలో చదువుకోడానికి వచ్చిన విదేశీజనాభా హెచ్చు కావడంవల్ల మిగిలినచోట్లకన్న ఇక్కడ బాగా మాట్లాడతారు.



ఆ స్వీడిష్ యువకుడు గడ్డం నిమురుకుంటూ,

'మీకు ఏ రకం పెరుగు కావాలి?' అన్నాడు.

'ఏ రకం ఏమిటి?' అన్నాను అర్థం కాక.

'పెరుగుల్లో మూడు నాలుగు రకాలున్నాయి.'

'మా ఊళ్ళో సిల్లు పెరుగు, గడ్డ పెరుగు అని రెండే రకాలు' అన్నాను.

ఆ యువకుడు నవ్వుతూ 'మీది ఏ దేశం?' అన్నాడు.

'ఇండియా'

ఇండియా అని వినగానే అతగాడిముఖం వికసించింది. దగ్గరలోనే మరేదో వస్తువు కోసం వెతుకుతున్న పడుచుని 'అనేతా' అని దగ్గరగా పిలిచి, నడుంచుట్టూ చెయ్యేసి 'వీరిది ఇండియాట' అన్నాడు. తనపేరు లైటర్ రిచర్డ్సన్ అని, ఆ అమ్మాయిపేరు అనేతా అని పరిచయం చేశాడు.

'నేను మీ దేశంలోని అరవిందాశ్రమం మీద రీసెర్చి చేస్తున్నాను. ఇండియానుంచి వచ్చిన మీరు కనిపించినందుకు సంతోషంగా ఉంది' అన్నాడు.

'ఈ పూటకి మాతో కలిసి భోజనం చేద్దురుగాని రండి' అని తీసుకు వెళ్ళేడు.

ఈ కాలపు స్వీడిష్ కుర్రకారులో చాలా మందికి ఉన్నట్లే అతనికీ జీబూతంలా గడ్డం, తిరపతిమొక్కు ఉన్నవాడిలాగ బుజాలు దిగిన జుట్టు. అదేమి ఫేషనో మరి ఆ అమ్మాయి ఏదో స్కూలులో ఇంగ్లీషు టీచరుట. రాకర్‌బెరీ వీధిలో 32వ భవనంలో (యూనివర్సిటీ హాస్టలులో ఒక భవనం) రెండో అంతస్తులో ఉంటున్నారు. నా కోటూ, టోపీ అందుకుని చిలక్కొయ్యకి తగిలించింది ఆమె.

'తక్' అన్నాను. థాంక్స్ అనే మాటకు స్వీడిష్‌రూపం అది. ఇక్కడికి వచ్చాక, నేర్చుకున్న మొదటిమాట అదే.

అది ఒక్కవిద్యార్థి మాత్రమే ఉండడానికి అనువైన గది. అందులో ఒకే ఒక మంచం.

కింద నేలమీద పక్క వేసి, రెండు తలగడాలు దగ్గర దగ్గరగా అమర్చి

ఉన్నాయి:

'మా కిద్దరికీ ఈ మంచం సరిపోక నేలమీద పక్కలు వేసుకోవలసి వస్తోంది' అన్నాడు పంజాయిషీ చెప్పుకోవలసిన అవసరం ఉన్నట్లు.

ఆ అమ్మాయి గబగబా వంట మొదలు పెట్టింది. మేమిద్దరం దగ్గరలోనే కుర్చీలు వేసుకుని కూర్చుని మాట్లాడు తున్నాం.

బల్లమీద ఉన్న పుస్తకంమీద 'అనేతా ఆర్వీడ్సన్' అని వ్రాసి ఉంది.


'ఆమె ఇంటిపేరు ఆర్వీడ్సన్ అని ఉంటే, మీ ఇంటిపేరు పెట్టుకోలేదా?' అన్నాను.

పెళ్లి అయాక ఆడవాళ్లు తమ పుట్టింటిపేరు మార్చుకుని, మొగుడి ఇంటిపేరు పెట్టుకోవడం అస్వతంత్రతకు లక్షణంగా భావించి మేము మగవాళ్లకు ఏ విధంగానూ తీసిపోము అని చూపించడంకోసం తమ ఇంటిపేరును యథాపూర్వంగానే ఉంచుకోవడం రష్యాలో కొందరు ఆడవాళ్లలో గమనించాను. ఇక్కడకూడా అదే కారణం అవునో కాదో తెలుసుకుందామని ఆ ప్రశ్న వేశాను. నా సందేహం అతనికి అర్థం కాలేదు.

'మా ఇద్దరికీ ఇంకా పెళ్లి అవందే ఇంటిపేరు ఎల్లా మార్చుకుంటుంది?' అని ఎదురుప్రశ్న వేశాడు. ఇంకా పెళ్లి కాలేదన్నమాట. కింద పరిచిన పక్కమీది రెండు తలగడాల మీదికి అప్రయత్నంగా నా దృష్టి మరలింది.

'మేమిద్దరం కలిసి ఉంటున్నాం. ఇంకా పెళ్లి అవలేదు' అన్నాడు.

నాకప్పుడు జ్ఞాపకం వచ్చింది, పెళ్లికాకుండా కాపరం పెట్టెయ్యడం ఇక్కడ రివాజేనని. యువకుల్లో, ముఖ్యంగా విద్యార్థులలో ఇది మామూలేనని దరిమిలాను చాలామందిని చూశాక తెలిసివచ్చింది. ఇక్కడ ఉన్న పదిహేను మంది భారతీయుల్లోనూ ఇటువంటి ముందంజ వేసిన ఘనత 'సుభాష్ దే' అనే బెంగాలీ కుర్రాడికే దక్కింది. ఎల్లా అయినా బెంగాలీవాళ్లు అగ్రగాములే.



హోటలు మెతుకులు తినవలసిన కర్మ అతనికి తప్పింది. కన్నెచెర ఆ అమ్మాయికి వదిలింది, బాగానే ఉంది. దానికేమి? వాళ్ల ఫిలాసఫీలో కూడా అర్థం లేక పోలేదు.

పెళ్లి చేసుకునేముందు అవతలి వ్యక్తి తనకు అన్నివిధాలా సరిపోతాడో (లేదా సరిపోతుందో) లేదో తెలుసుకోవద్దా? పెళ్లి అనేది నూరేళ్ల పంట అని వివరించి బోర్ చెయ్యని సినిమా లేదుకదా మనదేశంలో. మరి అటువంటి నూరేళ్ల పంటని హఠాత్తుగా ఏ అయిదు నిమిషాలు దూరంనుంచే చూసి నిర్ణయించుకుంటే కొంప మునిగిపోదూ అంటారు వీళ్లు. ఓ ఏడాదో రెండేళ్లో కలిసి కాపరం చేశాక, ఒకళ్లకొకళ్లు సరిపోతారని గట్టిగా తేలాక, అప్పుడు నింపాదిగా పెళ్లి చేసుకుంటారట.

'అసలు అప్పుడు మాత్రం పెళ్లి ఎందుకు?' అన్నాను మరోక సందర్భంలో మరో స్నేహితుడితో.

'సరిగ్గా ఆ ప్రశ్నే మాలో చాలామంది అడుగుతున్నారు. బూజు కట్టిన ఈ వివాహ వ్యవస్థతో విసిగిపోయారు మా దేశంలో యువకులు. ఆడది మగవాడి సొత్తుగా పరిగణింపబడ్డరోజుల్లో, దానిని ముట్టుకున్నవాళ్ల డొక్క చీరి డోలు కట్టేస్తానన్న రోజుల్లో, ఆ హక్కుని పరిరక్షించడంకోసం పెళ్లి అనే తంతును సంఘం నిర్ణయించింది. ఈనాడు మా దేశములో ఆడది మగవాడి సొత్తు కాదు. అదొక స్వేచ్ఛా జీవి. ఈ స్వేచ్ఛకీ పెళ్లికీ పొత్తు కుదరదు. ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే పెళ్లి అనే చేదు మందును మింగడానికి ఇష్టంలేని ఓ పది మంది మగాళ్లు, మరో అంతమంది ఆడవాళ్లు కలిసి జాయింటు కాపరాలు పెట్టిన వాళ్లు ఈనాడు మా దేశంలో చాలామంది ఉన్నారు. ఇంతమంది ఒకే ఇంట్లో ఉంటారు. అందరి సంపాదనలూ ఒకచోట పోస్తారు. ఎవరి అవసరాలకు తగ్గట్లు వారు వాడుకుంటారు.' అన్నాడు ఆ స్నేహితుడు.

ఏమండోయ్ అరుణాచలంగారూ! మీరు కలలుగన్న స్వర్గసీమ ఇదిగో. దీనిని ప్రత్యక్షంగా చూసే గౌరవం నాకు దక్కింది అని మనస్సులోనే అనుకున్నాను.

(అయిపోయింది) ●




ఇదీ లోకం
యం. గిరిజా కుమారి
A.S. Murty

'వినోద్ నా చిన్న హెల్ప్ చేసిపెట్టాలి' అతని ఎదురుగా సోఫాలో కూర్చుంటూ అంది వందన.

'ఏమిటి'

'బేంక్‌కెళ్లి ఈ చెక్కు మార్చుకు రావాలి.'

'ఓస్ అంతేకదా, ఎంతలోకి' ఆమె అందించిన చెక్కు అందుకొని చూసి, 'వెయ్యి రూపాయలా!' చెక్కు నోక్షణం మళ్లీ పరికించి 'నీ కిప్పుడు వెయ్యి రూపాయ లెందుకు కావలసి వచ్చింది.' కుతూహలంగా చూస్తూ అన్నాడు.

'నీవు మగాడివి. పైగా ఎప్పుడూ ఇక్కడే వుండేవాడివయా. కాబట్టి నీకే బొంబే అతి సామాన్యంగా వుండొచ్చు. కాని నాకయితే, ఇక్కడ బజార్లో వెళుతుంటే, కనిపించిన ప్రతీదీ కొనాలనిపిస్తుంది తెలుసా. ముఖ్యంగా చీరలు, హేండ్ బేగ్స్, అప్పైన చెప్పులు, ఫేన్సీ వస్తువులు.'

'అయితే ఇంకేం, బొంబేని, సైద్రా జేడ్‌కి తరలించు కెళతావన్న మాట.' చిరుగా నవ్వాడు.

'మీ మొగాళ్లంతా ఇంతే, పదిరూపాయలకే ప్రపంచమంతా వస్తుందనుకుంటారు. నాన్నా అంతే వెయ్యెందుకమ్మా ఐదువందలు చాలదా అన్నారు. నేనే పేచీ పెట్టి వెయ్యి రూపాయలకి చెక్కు రాయించుకొచ్చాను వచ్చేప్పుడు.'

'నాపేరు మీదే వ్రాయించావే.'

'అవును నాకెటూ బేంక్‌కెళ్లి చెక్కు మార్చుకునే వోపిక లేదని ముందే తెలుసు. అందుకే నీ పేరుమీద వ్రాయించాను.'

'అయితే రేపు షాపింగన్నమాట.'

'అవును నీకు రేపుకూడా శలవుందిగా. నీవు పెందరాళే డబ్బుతీసుకొని వచ్చావంటే, ఫోంచేసి మరీ వీధిన పడదాం. అప్పుడే సాయంత్రానికో, తిరిగా, యింటికి చేరుకోవచ్చు. సరేనా.'

'ఆల్ రైట్' హుషారుగా అన్నాడు.

'అంకుల్, రేపు కారు మనకిస్తానని ప్రామిస్ చేసారు. రేపు షాపింగ్ పూర్తయిందంటే, ఎల్లుండి మూటా ముల్లె సర్దుకొని బండెక్కాలి.'

'అప్పుడే.'

'అప్పుడే ఏవిటి వచ్చి పదిరోజు లయింది తెలుసా. పాపం కష్టపడి చూడదగ్గ ప్లేసెస్ అన్నీ చూపించావ్.'

'అంతేకదా. చిన్ననాటి స్నేహితురాలివి. రాక రాక మా ఊరొచ్చావ్. ఈ బీదవాడిని గుర్తుంచుకొని, వెతుక్కుంటూ వచ్చి పలకరించావ్...'

'చాలుగాని, చెక్కు జేబులో పెట్టుకో. మీ బొంబేలో దొంగలు జాస్తంట జాగ్రత్త' యదాలాపంగా అంది.

'ఆ...నేను ఆరేళ్లబట్టి ఇక్కడే వుంటున్న వాడినయా, నాకేమిటి. సరే, రేపు పదిన్నర, పదకొండు ప్రాంతాల్లో వస్తాను. రెడీగా వుండు. గుడ్‌నైట్.'

ఆమెదగ్గర శలవు తీసుకొని తనరూమ్ కెళుతూ, తనిక్కడికి వచ్చిన ఈ ఐదు సంవత్సరాలలో, కష్టపడి వెయ్యిన్నర రూపాయలు కూడబెడితే, వందన రేపొక్క రోజులోనే వెయ్యిరూపాయలు ఖర్చు పెట్టబోతుంది, ఇద్దరి మధ్యా అంత అంతర్యమున్నా తామిద్దరం స్నేహితులవటం తనదృష్టం—సంతోషంతో పొంగిపోతూ అనుకున్నాడు.

* * *

'టికెట్ సార్.' కండెక్టర్ టికెట్టు అడిగేసరికి జేబులో చెయ్యి పెట్టుకున్న వినోద్ బలమైన షాక్ తగిలినట్లు చటుక్కున చెయ్యి బైటకి లాగి త్వరగా లేచి నిలబడి, రెండు చేతులూ, రెండు జేబుల్లో పెట్టుకొని వెతికాడు.

'మీ బొంబేలో దొంగలు జాస్తంట జాగ్రత్త.' వెంటనే వందన మాటలు అతని చెవుల్లో రింగురింగుమని, ముఖం తెల్లగా పాలిపోయింది. కాళ్లూ చేతులూ చచ్చుబడ సాగాయ్. వళ్లంతా చెమటలు పట్టింది తల తిరగ నారంభించి, వెన్నులో నుంచి విపరీతమైన వణుకు పుట్టుకు రాగా, నిలవలేక, స్పృహ తప్పుతున్న వాడిలా సీటులో కూలబడ్డాడు.

'పర్సు పోయిందా.'

'అరే పర్సుపోయిందా. ఎంత డబ్బుంది.'

'ఎక్కేప్పుడుందా.'

వంటి ప్రశ్నలు చాలా హిందీలో వినబడుతున్నాయ్‌గాని, అతనికి ఒక్కటీ వినపడటం లేదు. పిచ్చివాడిలా, నోట మాటరాక, అందర్నీ కళ్లప్పగించి చూస్తుండి పోయాడు.

'వినోద్ భయ్యా కీ పర్సు పోయిందట.' అతన్ని తెలిసున్న బిపిన్‌గుప్త ముందుకొస్తూ అన్నాడు.

కొద్దిగా తేరుకుంటున్న వినోద్ మెల్లగా బుర్ర వూపాడు. అతను బస్సులో ఎక్కేప్పుడు పర్సువుందని తెలుసుకొని, బస్సులో అనుమానాస్పదంగా వున్నవాళ్లందర్నీ, బిపిన్ వెతికాడు. కాని ఏమీ లాభం లేక పోయింది. వినోద్‌కి కూడా తనే టికెట్ కొని, తరవాత స్టేజ్‌లో వినోద్ వద్దు లాభం లేదంటున్నా పోలీస్‌రిపోర్ట్ ఇప్పించి అనంతరం, హోటల్‌కి లాక్కెళ్లాడు. రెండు కప్పుల వేడివేడి కాఫీ తాగాక కాని, వినోద్ బుర్ర పనిచెయ్య నారంభించలేదు.

ఒక అరగంట గడిచాక మళ్లీ మామూలు మనిషయిన వినోద్, బిపిన్ గుప్తాకి కృతజ్ఞతలు చెప్పుకొని, అతని దగ్గర శలవు తీసుకొని, ఎక్కడికో ఏవిటో తెలియకుండా ముక్కుసూటిగా చాలాదూరం వెళ్లి, చివరికో పార్కులో చల్లని నీడన కూలబడ్డాడు

'ఇప్పుడేవి చెయ్యాలి.' అనే ప్రశ్న అతని మెదడులో విలయతాండవ మాడసాగింది.

అన్నీ వందరూపాయల నోట్లే పర్సులో పెట్టుకున్నాడు తను. పోతయ్యేమోనని ఎంతో జాగ్రత్తగకూడా వున్నాడు. అయినా ఎలా పోయిందో ఎంత ఆలోచించినా అంతుపట్టటం లేదు. వందన డబ్బుకోసం ఎదురుచూస్తుంటుంది. ఒకటి కాదు, రెండు కాదు వెయ్యి రూపాయలు ఎలా...ఏవి చెయ్యాలి. బాధగా జుట్టు పైకి తోసుకుంటూ అనుకున్నాడు.

'నిజం వందనకి చెప్పేస్తే. డబ్బు పోయినందుకు బాధపడుతుంది. తనాశించినవి కొనుక్కోలేక పోయినందుకు నిరుత్సాహ పడుతుంది. అంతే మరేమీ అనుకోదు. తనకి తెలుసా నిజం. కాని...కాని... బాధగా కణతలు రుద్దుకున్నాడు.

'మీ బొంబేలో దొంగలు జాస్తంట జాగ్రత్త.' వందన మాటలు అతని గుండెల్లో మారుమ్రోగాయి.

నిన్న చీర కొనుక్కోవాలన్నప్పుడు, వందన వదనం, ఆనందంతో ఎలా వెలిగింది అతనికి గుర్తొచ్చింది. డబ్బు పోయిందని తెలిస్తే, ఆ వదనం ఎలా

వాడిపోయేదీ, అతనూహించుకున్నాడు.

'వద్దు వందన, అంతటి ఆశాభంగంతో, నీ వదనం వాడిపోవటం, నేను భరించలేను. బొంబేలో ఎన్నెన్ని కొనుక్కుందామని ఎంత ఆశగా వచ్చావో. అంత డబ్బు తెచ్చుకుని మరీ ఏదీ కొనుక్కోకుండా వట్టిచేతులతో వెళ్ళటం, నేను భరించలేను' అతని మనసు వ్యథగా మూలిగింది.

'అయినా నీవు ముందే జాగ్రత్తని హెచ్చరించినా, ఇప్పుడు డబ్బు పోయిందని ఏ మొఖం పెట్టుకొని చెప్పగలను. భగవాన్ పేదవాళ్ళ నెందుకిలా మరింత హీనుల్ని చేస్తావ్.' ఆవేదన పొంగుతుండగా అనుకున్నాడు.

అతని దృష్టి వాచీమీద పడింది. టైమ్ పదకొండున్నర అయింది 'వెయ్యి రూపాయలు. ఏం చెయ్యాలిప్పుడు. ఒకటి కాదు. అరకాదు. ఉన్నఫళంగా ఎక్కడినుంచి తెస్తాడంత డబ్బు. బేంక్‌లో తన డబ్బుందిగా, అవును తను ఐదేళ్ళ కష్టపడి కూడబెట్టిన వెయ్యిన్నర రూపాయిలున్నయ్‌గా.' అతనికి చెప్పలేనంత ఉత్సాహం వచ్చి, చటుక్కున లేచి నిలబడ్డాడు.

'కాని తను ఉద్యోగంలో చేరింది మొదలు కూడబెట్టిన డబ్బులో వెయ్యి తీసేస్తే, తనకి మిగిలేదేమిటి. అవి చెల్లి పెళ్లి కోసం కూడేస్తున్న డబ్బులయ్యా.' ఒక్క

ఇదీ లోకం

క్షణం అతన్ని మళ్ళీ నిరుత్సాహం, ఆవరించింది.

'ఏమైనాకాని వందనకి, తను డబ్బు పోయిందని చెప్పలేడు. ఆమె తనకోసం, కొనుక్కోవలసిన వస్తువుల లిస్టు పట్టుకొని, ఇప్పటికే, గంటపైగా ఎదురు చూస్తుండొచ్చు. అవును ఆ డబ్బుతీసి ఆమెకిచ్చేయాలి. పన్నెండవుతుంది త్వరగా వెళితే. బేంక్ మూసివేయకముందే డబ్బు తీసుకోవచ్చు' త్వరగా అడుగులేస్తూ ముందుకు సాగాడు.

'హలో వినోద్, ఏమిటింత ఆలస్యం. టైమ్ ఒంటిగంట అయింది తెలుసా.' కాచుకు కూర్చుందేమో, గేటు తియ్యగానే పరిగెత్తుకొచ్చింది వందన.

'సారి వందన లేటయింది.' నీరసంగా అంటూ, ఆమెననుసరించాడు. జేబులో అతని కష్టార్జితం, వెయ్యిరూపాయలున్నా, బస్సుకిచ్చుకుందుకు డబ్బులు లేక అతనెన్ని మైళ్ళు నడిచివచ్చిందీ ఆమెకు తెలియదు.

'ఏమిటలా వున్నావ్. వంట్లో బాగోలేదా.' అలసటగా కళ్ళు మూసుకొని, సోఫాలో జారగిలబడిన అతన్ని చూసి అందామె.

'ఏమీ లేదు. బైట ఎండగా వుండటం వలన, కొద్దిగ అలసటగా వుంది' కళ్ళు తెరచి ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ అన్నాడు. నిజానికి ఆకలికి నొప్పితో తల బద్దలవుతుందా క్షణాన.

'నీకోసం చూసి, చూసి, నాకు ఆకలి మండుకు పోతుంటే నేను భోంచేసాను. నీవు చేసావా లేదా.'

'చేసాను' అప్రయత్నంగా అన్నాడు.

'కాస్త లేచి ముఖం కడుక్కొని, తల దువ్వుకో చెరిగిపోయింది.'

'బాగానే వున్నాను లెద్దూ.' అంటూ జేబులోనుంచి డబ్బు తీసి, టేబుల్ మీద పెడుతుంటే, అతని చెయ్యి వణికింది. అతని హృదయంలో, ఆవేదన ఉవ్వెత్తున పొంగింది. తన శరీరంలోని ఒక భాగం కోసి ఇస్తున్నట్లతని మనసు గిలగిలలాడుతుండగా, తదేకంగా బల్లమీద రెపరెపలాడుతున్న నోట్లకట్టను, చూస్తుండిపోయాడు. కాని అతనికి కనిపిస్తుంది డబ్బు కాదు. ఏ చెల్లెలి పెళ్ళికోసమైతే, ఆ డబ్బు కూడపెడుతున్నాడో ఆమె రూపు దీనంగా కనబడుతుందా నోట్లకట్టల్లో.


వందన, అదేమీ గమనించుకోకుండా, 'థాంక్స్' అంటూ డబ్బు తీసి, నిర్లక్ష్యంగా హేండ్‌బేగ్‌లో పడేసి, 'యిప్పుడే వస్తానుండు.' అంటూ లోనకెళ్ళి, వేడి వేడి కాఫీ తీసుకొచ్చి ఇచ్చింది. అది తాగాక వినోద్‌కి కాస్త శక్తి వచ్చింది. తనలోని వేదనని లోన అణచిపెట్టి, జేబులోనుంచి దువ్వెన తీసి, తల దువ్వాననిపించి, లేచి నిలబడ్డాడు. ఇద్దరూ వెళ్లి కార్లో ఎక్కారు.

'ఏమిటి వినోద్, ఈ-వాళ డల్‌గా వున్నావ్. వంట్లోగాని బాగోలేదా.' దారిలో మళ్ళీ అడిగింది వందన.

'అబ్బే ఏమీలేదు.' తడబడ్డాడతను.

బజారులో ఎక్కడ చూడనన్ని రంగుల్లో రకరకాల చీరలు చూసి, అన్నీ మర్చిపోయిందామె. ఒక షాపులో రెండువందల యాభై పెట్టి, జరీపువ్వుల ఎంబ్రయిడరీ వున్న, ఫారెన్ నైలెక్స్ చీరొకటి, ఫారెన్ జార్జెట్ చీరొకటి తీసుకుంది.

తన నెలజీతం మూడువందల రూపాయలు. అందులో ప్రతినెలా సగం యింటికి పంపిస్తాడు. మిగిలిన నూటయాభైలో ఇరవై ఐదు రూపాయలు బేంక్‌లో వేసి మిగిలిన డబ్బులు తను వాడుకుంటాడు. ఈ బొంబేవంటి మహాపట్నంలో, నూట



ఇరవై ఐదు ఏమూలకి రావు. అయినా అలాగే సర్దుకుపోతున్నాడు తను. తను కష్టపడి పదినెలలు కూడబెట్టిన డబ్బు వందన పదినిమిషాల్లో ఖర్చుపెట్టేంది. సెట్టూర్చుతూ, ఆమె వెనకాలే మరో షాపులోకి అడుగుపెట్టాడు.

నూటముప్పయ్ పెట్టి జపాన్ జార్జెట్ చీర, కాదీ సిల్కుమీద, మైక్రాపెంట్ చీర తీసుకొని, ఆ షాపులోనుండి బయటకు వస్తుండగా, షోకేస్‌లో వున్న హేండ్ పెయింటెడ్ ప్యూర్ సిల్కు చీర నచ్చి డెబ్బయ్ రూపాయాలిచ్చి అదీ పేక్ చేయించింది వందన.

ఆ మధ్య రెండువందలు బాంక్‌లో నుంచి తీసి, రెండుజతలు బట్టలు కుట్టించు కుందామను కున్నాడు తను. కాని రెండొందలంటే, ఎనిమిది నెలలు దాచుకున్న కష్టార్జితమని గుర్తుకొచ్చే సరికి మనసొప్పక ఆ ప్రయత్నం విరమించుకొని వున్నవాటితోనే గడుపు కుంటున్నాడు. అటువంటిది వందన ఆ రెండు వందల్ని, ఐదు నిమిషాల్లో ఖర్చు పెట్టేసింది. దిగులుపడి లనువరించాడు.

మరోషాపులో బెనారస్ చీరొకటి ఎంచు కుంటుండగా ఆమెకు గుర్తు వచ్చినట్లుంది 'విరాట్ నా షాపింగప్పుడు, మీ చెల్లెలి కోసం ఏరలేసుకుంటానంటివే' తల తిప్పి అతన్ని చూస్తూ అంది.

ఉలిక్కి పడ్డాడతను 'ఆ అనుకున్నాను గాని, ప్రొద్దున్న హడావుడిగా రావటంతో ఆ సంగతి గుర్తులేక డబ్బు తీసుకురాలేదు.' మెల్లగా గొణిగాడు.

'గొప్పేలే, నా దగ్గరున్నయ్‌గా చీర తీసుకో.'


'దాని చీర కేం తొందరొచ్చింది. నే నెప్పుడూ ఇక్కడే వుండేవాడినయా. ఈవాళ కాకపోతే రేపు కొంటాను. ఇంతకీ నీ చీర ఎంచుకోవటం అయిందా' అదే వూపులో మాటకూడా మార్చుతూ అన్నాడు.

'ఆ ఈచీరచూడు బావుందా' ఒకచీర అందిస్తూ అంది.

చీర పరికిస్తున్నట్లు అటూ ఇటూ చూసి మెల్లగా ధరేంతో చూశాడు. మూడువందల డెబ్బయ్ ఐదు. 'వామ్మో'

రంగుల రాట్నం

గొర్రె



జమ్మి కోనేటిరావు

గొర్రెని తెలియని వ్యక్తి ఉండడు కదా? కాని మనకు కనబడే విధంగా మచ్చిక పొందిన గొర్రెలు కాక కొండప్రాంతాలలో వన్యజీవనాన్ని గడుపుతున్న గొర్రెలు యూరపులోను, అమెరికాలోను, ఆసియా ఉత్తర ప్రాంతాలలోనూ ఉన్నాయి. అమెరికా కొండ గొర్రెల కొమ్ములు చాల బలంగా ఉంటాయి. చక్కని వంపు తిరిగి వెడల్పుగా అడ్డుగీరలు కలిగి ఉంటాయి. అమెరికా అడవి గొర్రెల్ని "బిగ్‌హార్న్" అని అందుకే అంటారు. పంజాబు ప్రాంతాల్లో ఉండే ఆసియా గొర్రెని 'యూరియల్' అని, యూరపులో దాన్ని 'మామేఫ్లాన్' అని అంటారు మంగోలియాలోని 'అర్గాలీ' అనే అడవి గొర్రె పెద్దది. సుమారు గాడిద సైజులో ఉంటుంది. ప్రపంచంలో అడవి గొర్రెలు ఇంకా చాల రకాలున్నాయి.

అడవి గొర్రెలు ముఖ్యంగా అర్గాలీ, బిగ్‌హార్న్ వంటివి కొండల మీద జీవితానికి బాగా అలవాటు పడి ఉన్నాయి. అంత పెద్ద గొర్రెలు కూడా ప్రమాదకరమైన కొండ చరియల మీద ఎక్కడం, దిగడం చాల సునాయాసంగా ఎంతో ప్రజ్ఞతో చేస్తాయి. కొండల మీద వీటి సంచారం చూడడమే ఒక అనుభవం అంటారు. మానవుడు, దీని మాంసం రుచి అని, కొమ్ములు ప్రదర్శనకు ఉపయోగపడతాయని వీటిని నాశనం చేస్తున్నాడు. వీటి పిల్లలు తోడేళ్ళు మొదలైన వన్యమృగాలకు, గద్దలకు ఎర అయి కూడా వాటి జాతి నాశనం అవుతోంది.

కొన్ని లక్షణాలలో తేడా కనబడినప్పటికీ, గొర్రెకీ, మేకకీ మధ్య ఖచ్చితమైన విభజన గీత గియ్యలేము. వాటిలక్షణాలు కలుస్తూవస్తాయి. ముఖ్యంగా గమనించవలసినది తేడాలు ఏమంటే కొన్ని మేక వర్గాలలో ఉన్నట్టు గొర్రెలకి గడ్డాలుండవు. గొర్రెలు గడ్డి మాత్రం మేస్తాయి. మేకలు లప్పిరకాల చెట్ల ఆకుల్ని మొ॥ చెట్లని కూడా తిని మొక్కలని నాశనం చేస్తాయి మేక పాలు శ్రేష్ఠం, అంటారు అది నిజంగా "పేదవాడి ఆవు" మొగ మేకలకి వాసన ఉంటుంది. పొట్టేలుకు ఉండదు.

గొర్రె తోక సాధారణంగా పొట్టి. ఎదిగ దేహం కూడా |సామెత చెప్పినట్లు| శరీరం మీద వెంట్రుకల ఒత్తు ఉంటుంది. దాని లోపం మెత్తని ఉలు ఎదుగుతుంది.

మానవుడు అనాది నుంచి గొర్రెలని పెంచుతున్నట్లు ఆధారాలున్నాయి. జంతు బలికి కూడా పాపం!! గొర్రె ఎంతో ముఖ్య పాత్ర వహించింది వహిస్తుంది

పెంపుడు గొర్రెలను మనం సాధారణంగా చూసేవి ఏటికో కూడా |మక్కలలో మాదిరిగా| చాలా రకాల ప్రీడలున్నాయి అవి ఇచ్చే ఉలు, పాలు, మాంసం మొదలైన లక్షణాలలో వాటికి తేడా ఉంది "మెరినో", అమెరికా, ఆస్ట్రేలియా, రష్యలలో చాల పెంపొందింది. ఇది ఉలుకు ప్రసిద్ధి. అసలు మొదట ఇది స్పెయినులో ఏర్పడిన బ్రీడు. ఆస్ట్రేలియా గొర్రెల పెంపకానికి చాల ప్రసిద్ధి వహించింది. ప్రపంచంలో సుమారు 30 పాళ్ళు ఆస్ట్రేలియా నుంచే ఉలు, వస్తుంది.

'ఇదీ లోకం

అతని గుండె తేలికైనంత పనయింది.

ఆ మధ్య అమ్మకి అనారోగ్యంగా వుండటంతో మందులకీ, దానికి డబ్బు కావలసి వస్తే, ఒక సంవత్సరం, ప్రతినెలా బేంక్‌లో డబ్బు వేయటం మాని, ఆ పాతిక కూడా, వాళ్ళకే పంపాడు తను. కాని తనదృష్టం కొద్దీ, ఆ సంవత్సరం కంపెనీకి బాగా లాభాలు రావటంతో, ఒకనెలజీతం బోనస్‌గా ఇచ్చారు. ఆ మూడువందలు బేంక్‌లో వేసి, ఈ సంవత్సరం వెయ్యి లేకపోయిన మొత్తాన్ని పూడ్చగలిగాడు.

అతని చూపు మళ్ళీ చీరమీద పడింది. మూడువందల డెబ్భయ్‌ఐదు. అంటే ఆపైన మరో మూడు నెలలు కూడ బెట్టిన మొత్తమన్న మాట.

'ఏవిటి బావుందో లేదో చూడమంటే, అలా పట్టుకు కూర్చున్నావ్. బాగోలేకపోతే చెప్పేయ్' వందన అంది.

'చాలా బావుంది వందన. నీకు మరీ బావుంటుంది. ఇదే తీసుకో.'

'ఆ చీర ఇంకా బావుందికదూ.' కొద్ది దూరంలో మరొకామె తీసుకుంటున్న చీర చూపిస్తూ అంది వందన.

'అవును భలే బావుంది.'

'అది ఆరువందలు.' షాపతను అన్నాడు.

'ఆరువందలే !' వినోద్‌గుండె పగిలినంత పనయింది. వెంటనే చూపటు నుంచి మరల్చుకున్నాడు. కాని ఆ, ఆరువందల చీర ఎంచుకుంటున్నామెకీ, ఆ చీర కొనిస్తున్న వ్యక్తే తనపర్సు కొట్టేసిందని, అతనికి తెలిస్తే, అతన్ని అక్కడికక్కడ చంపి పాతేసేవాడేమో. అతను మాంచి వుడు దానప్పుడిగా మారే సందర్భాలు వుంటయ్ కొన్ని. వాళ్ళు షాపు బయటకు వస్తున్నప్పుడు, ఆరువందల చీర కొనుక్కున్నామె, అతనూ పెద్దగా ఏదో చెప్పుకుంటూ, హాయిగా నవ్వుకుంటూ వినోద్ ప్రక్కనుంచి వెళ్ళిపోయారు.

అనంతరం ఎట్సీ బ్లౌజుపీసెస్ అండే షాపులో ఆరుచీరలకీ సరిబడ్డ జాకెట్లు తీసుకుంటె అక్కడో ఏభై రూపాయ లయినయ్. రెండునెలలు అలిభారంగా గడిస్తే తను ఏభై రూపాయలు బేంక్‌లో వెయ్యగలడు. బిరాగ్గా వెంట్రుకలు పైకి నెట్టుకుంటూ అనుకున్నాడతను.

తరువాత ఒక ఫేన్సీషాపులో కెళ్ళి ఎనభై రూపాయలకి ఏవేవో మేకప్‌సామగ్రి కొనింది వందన.

'యిాటౌన్లో అందరికీ బట్టలు చిరిగిపోయినయ్. ఒక డెబ్భయ్‌ఐదు రూపాయలు పంపన్నయ్యా, పండక్కి అందరం బట్టలు కొనుక్కుంటాం' పోయిన నెల చెల్లెలు వ్రాసిన ఉత్తరం జ్ఞాపకంవచ్చిందతనికి.

చెల్లి నీసంత ఇదిగా అడిగినా, బేంక్‌లో మూడునెలలు కూడేసిన డబ్బు తీయటం ఇష్టంలేక నీకేంపాబూ వ్రాయలేదీ పిసినారి అన్నయ్య. డెబ్భయ్ ఐదు రూపాయిలకే, ఆరుగురు బట్టలు కొనుకుందామని, ఆశపడ్డారంటే, బట్టలకి మీరెంత ఇబ్బంది పడుతున్నారో ఊహించుకో లేకపోయిన మూర్ఖుడమ్మా ఈ అన్నయ్య. మిమ్మల్ని ఉసూరు పెట్టినందుకు నేడు నాకు మంచి శాస్తి అయింది తల్లీ.' బాధతో కుంగిపోతూ నిట్టూర్చాడు.


వెయ్యిలో మిగిలింది ఇంకా నలభయ్ ఐదు రూపాయలే, మరో షాపులో అడుగు పెడుతుండగా అతనిమనసు ఎగాలిగింది. అనంతరం, చెప్పులకీ, ఫేన్సీ జువలరీకి, హేండ్‌బేగ్స్‌కి, కూలింగ్‌గ్లాసస్‌కి, ఒక అరడజను మేగ్జిన్స్‌కి ఒక నూటముప్పయ్‌దాకా ఖర్చయితే, ఆమె పర్సులో ముందే వున్న మరో వందరూపాయల నోటు కూడా మార్చాల్సి వచ్చింది.

'అబ్బ అన్నీ కొనగలిగాను.' కారు పోతుండగా, హాయిగా వెనక్కి జారిగిల పడుతూ, లిస్టు చూసుకొని తృప్తిగా నిట్టూర్చింది వందన.

'ఆడవాళ్ల షాపింగంటే కొనేది కొద్దయినా, ఒకరోజంతా అయినా సరిపోదని నా ఉద్దేశం. కాని నీవు రెండు గంటల్లోనే వెయ్యిరూపాయలపైన ఎనభై ఐదు రూపాయల సామగ్రి కొనేసావ్' వినోద్ అన్నాడు. తన పర్సు కొట్టేసినను కూడా, ఆసరికి వెయ్యిరూపాయలు ఖర్చుపెట్టేసాడని అతనికి తెలియదు.

'ఆ అటువంటి నాన్చుడు బేరాలంటే నాకు చిరాకు. దానికేంగాని, దారిలో ఎక్కడన్నా కారాపి, కాఫీ తాగుదాం. భలే అలసటగా వుంది.' అంది.

కాఫీ అనేసరికి, అతనికి తను అన్నం తినలేదనే విషయం గుర్తుకొచ్చింది. 'తనింతసేపు గుర్తించలేదుగాని, భలే



ఆకలేస్తుంది. చాలా నీరసంగా కూడా వుంది. హోటల్‌కి వెళ్ళి ఏదన్నా తింటే బావుంటుంది. కాని తనదగ్గర డబ్బు లేవు. తనకన్నా ముందు వందనే బిల్లు చెల్లించటానికి ప్రయత్నిస్తుంది తనకి తెలుసు. కాని తను మగవాడయ్యుండి, ఆమెచేత డబ్బు లిప్పించటంకన్నా అభిమాన హీనమయిన పనివుందా.' అని మనసులో అనుకుంటూ 'వద్దు వందన నాకు భలే తలనొప్పిగా వుంది. వో గంటసేపు కాళ్ళుచాచుకొని పడుకోవాలని వుంది. నన్ను నా రూమ్‌దగ్గర డ్రాప్‌చేసావంటే నీకెంతయినా పుణ్యం వుంటుంది.' అతను వద్దనుకున్నా స్వరంలో దీనత్వం స్పష్టపడింది.

చటుక్కున అతని వళ్ళు పట్టి చూసింది వందన. 'అరే జ్వరంగా కూడా వుందే.' కంగారు పడింది. 'గొప్పస్నేహితుడివే దొరికావ్. జ్వరంగావుంటే కూడా రమ్మన్నాను ఏవిటి.' నొచ్చుకుంటూ పన్నగా చివాట్లు పెట్టింది.

'ఏవిటి జ్వరం వచ్చిందా' తనవళ్ళు వేడిగా వుండటం అప్పుడే గమనించాడతను. 'అరే ఇప్పుడే వచ్చినట్లుంది వందన. బయల్దేరినప్పుడు లేదు.' అన్నాడు.

కాని వాడిపోయి వున్న అతని వదనం చూసి, అతను చాలా నీరసంగా వున్నాడని, గుర్తించగలిగింది. కారు అతని రూముముందు ఆగింది. అతను ఫరవాలేదు; నేను బాగానే వున్నానని అంటున్నా కూడా వినిపించుకోకుండా, వందనకూడా దిగి, డ్రైవర్‌చేత హోటల్‌నుంచి కాఫీ, ఏస్ప్రో తెప్పించి, అతనిచేత బలవంతంగా మింగించింది. ఒక అరగంట అనంతరం అతనికి కొద్దిగ శక్తి వచ్చి, లేచి కూర్చున్నాడు.

'ఎలా వుంది' ఆదుర్దాగా అడిగింది.

'బావుంది. కొంచెం దానికి నీ వనవసరంగా బాధపడుతున్నావ్.'

'జ్వరం గురించి కాదు వినోద్, నీవు మధ్యాహ్నం, మాయింటికి, వచ్చినప్పటి నుంచీ, ఎలాగెలాగో వున్నావ్. ఎండలోపడి రావటంవలన, అలాగున్నావేమో అనుకున్నాను. కాని బజారులోకూడా, ఏదో పరధ్యానంగా, దేనికోసమో విపరీతంగా ఊహిస్తున్నావేమో అనుకున్నాను. కాని షాపింగయేసరికి, అర్థాంతరంగా ఈ జ్వరం చూస్తే నిజంగా ఏదో వుందనిపిస్తుంది. చెప్పు వినోద్, నీకొచ్చిన కష్టమేమిటి నేను విన తగనా. అలా అయితే చెప్పు మళ్లీ అడగను.'

'అంత మాటనకు వందన' బాధపడ్డాడా మాటకి.

'ఏమిటో చెప్పు మరి. నేను చెయ్యగల సాయమేమన్నా వుంటే, తప్పక చేస్తాను.'

'ఏవి చెప్పేది.'

'ఏవుందో అదే చెప్పు.'

'ఏవీ లేందే అసలు,'

'నీవు అబద్దాలకోరు వెప్పుడయ్యావో నాకు తెలియదు.'

'ఎప్పుడయినా, అయానని ఇప్పుడు తెలుసుకున్నావుగా.' ప్రయత్నపూర్వకంగా నవ్వుతూ అన్నాడు.

'నేని ఊరు అర్థాంతరంగా వచ్చానంటే, ఊరు చూద్దామన్న ఆశకన్నా, నిన్ను చూద్దామన్న ఆశతోనే సగం వచ్చాను. ఇన్ని రోజులూ ఎంతో సంతోషంగా నాకన్నీ చూపించావ్. చివరకి నేను వెళ్లిపోయే ముందు నీవిలా అవటం నాకు చాలా బాధగా వుంది. హాయిగా గుండెలనిండా నవ్వే నీవిలా విడుస్తున్నట్లు నవ్వుతుండగా కూడా చూస్తాననుకోలేదు.'

'వందన నీవనవసరంగా బాధపడుతున్నావ్. నీవనుకుంటున్నట్లు, ఇందుకు పెద్ద కారణాలేమి లేవు. మనిషన్నాక అనారోగ్యం కలగదా ఏమిటి. ఇంత సడన్‌గా ఎలా వచ్చిందంటావ్, ఇన్నాళ్ళు రోజూ అవిరామంగా అక్కడికీ, ఇక్కడికీ తిరగటం వలన అయుండవచ్చు.'

'మూర్ఖురాల్ని నీ ఆరోగ్యం సంగతి కూడా ఆలోచించకుండా విశ్రాంతి లేకుండా తిప్పాను.'

'అదేం లేదు వందన' కంగాయిగా అన్నాడు. 'ముందునుంచే బావో లేదు. ఈ తిరగటంలో మరి కాస్త ఇదయిందంతే.' తేల్చేసాడు.

ఆమె అతని వ్యధకి కారణం తెలుసుకోవాలని, ఎంతో ప్రయత్నించిందిగాని లాభం లేకపోయింది. చివరకి అతను వద్దంటున్నా రాత్రి తినటానికి బ్రెడ్, కాఫీ తెప్పించి, మళ్లీ తెల్లవారే వస్తానని చెప్పి శలవు తీసుకొని వెళ్లిపోయింది.

ఆ మరుసటిరోజు, ప్రయాణానికి సిద్ధమైన వందన, స్టేషన్‌కెళుతూ, దారిలో

(64వ పేజీ చూడండి

ఈ నల్లని రాళ్ళలో...ఏ కన్నులు దాగెనో...





నండూరి విఠల్

జ రి గి న క థ

స్వామికి స్కూల్లో టీచరు ఉద్యోగంతోపాటు రఘుపతిగారింట్లో ఆశ్రయంకూడా దొరకటంతో అదృష్టవంతుడిని అనుకున్నాడు. అయితే రఘుపతి గారమ్మాయి పావనికి ప్రైవేటు చెప్పాల్సి వచ్చేటప్పటికి అతడికి పచ్చి వెలక్కాయ గొంతున పడ్డట్లయింది. పావని గడుగ్గాయి ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ వుండే ఆ అమ్మాయి స్వామికి కాస్త ఇబ్బందిగానే తయారయ్యింది. పావనికి సంబంధాలు వస్తున్నాయి పోతున్నాయి. ఒకటీ కుదరడ లేదు. తల్లి రాయించిన ఉత్తరంతో స్వామి మనసు వద్దన్నా పావనిపై మోజు పడుతోంది. స్వామి స్కూల్లో సాటివాళ్ల కామెంట్లు భరించ లేకుండా వున్నాయి. అందరి అంగీకారంతోను స్వామికి పావనికి పెళ్లయి పోయింది.

12

'నాకు తెలుసు' అంది పావని.

జరిగిందంతా చెప్పాక ఆ మాట మాత్రం అని పూరుకుంది పావని.

ఇన్నాళ్లా కష్టపడి చదివిందీ, ఉద్యోగం సంపాదించిందీ యిందుకాని. 'ఈ కాంట్రాక్టులు చేయడానికి యింత చదువు కావాలా పావనీ?' అన్నాడు భయంగా.

'ఎంత చదువు మీరు చదివింది?' అంది నవ్వుతూనే పావని. స్వామికి తెలుసు తన 'ఇస్కూలు ఫైనలు ఎంత పెద్ద చదువో.

'ఉద్యోగం—పాడికుండలాంటి ఉద్యోగం చేతులారా పాడు చేసుకోవడమంటే...'

'ఎందుకండీ అంత భయపడతారు? నాన్న చెప్పాడు. నిశానీదారు ఆ బండి వీరయ్య — ఒంటెద్దుబండీ రైలుస్టేషనుకు తోలుకుంటూ బతికేవాడు—రెండంతస్తులమేడ కట్టాడు చూడండి కంట్రాక్టులుచేసి మన రోజులుమాత్రం ఎందుకు బాగుపడగూడదు?' అంటూ తాంబూలం చుట్టి భర్త నోట్లోకి బలవంతంగా తోసి 'ఈ చీర బావుందా?' అంది.

అంతవరకూ భార్య కట్టుకున్న చీరను పరీక్షగా చూడగలిగిన స్థిమితం లేక పోయింది స్వామికి. ఇప్పుడు చూశాడు. ధగధగ మెరుస్తున్న నెమలికంఠంరంగు సిల్కుచీరలో మెరిసిపోతున్నది. గులాబిలా కదిలింది పావని.

'ఎలా వుంది?' అంది తాంబూలం నములుతూ పమిటను బిగించి వెనకనుంచి ముందుకు లాగుతూ.

'బాగుంది.'

'ఏమిటి?'

'ఊఁ'

మీరు ఏదో ఆలోచిస్తున్నారు' ఎంతో తెలుసా? చెప్పుకోండి.'

'తెలియదు'

'ఊహించి చెప్పండి'

'నిజం పావనీ—చీరల సంగతి నాకెలా తెలుస్తుంది? యాభై వుంటుందా?'

'రెండొందలు. తెలుసా?' విరగబడి నవ్వింది పావని అతని అజ్ఞానానికి.

రెండు వందలు! తనకు రెండు నెలల జీతం. తన తల్లికది ఆరునెలల జీతం.

'మీరు బిజినెస్ చేసి సంపాయిస్తే రోజు కొక చీర కొనిపెడ్తారు యిటువంటివి. కొనిపెట్టరూ?'

'చెయ్యాలిగదా?'

'ఏం చెయ్యాలని లేదా?'

'చెయ్యాలనుకున్న ప్రతి పనీ చెయ్యగలిగా ప్రతిమనిషీ'

'నేను చేయిస్తా చూడండి. నాకోసం చేయాలి మీరు. అన్నీఉండి అల్లుడి నోట్లో శని అన్నట్లు—రెండు చేతులా మీరు సంపాదిస్తే—నవ్వ రాన్ని లాగి కట్టెయ్యనూ మన దగ్గరే—'

'నా కంత ధైర్య మనిపించడంలేదు పావనీ'

'వెర్రి. యుద్ధంలో కెళ్తున్నారా—పెద్దపులితో పోట్లాడుతున్నారా? అనుభవం కావలసినంత ఉన్న సమర్థుడు ఆ కోనేటిరావు. దమ్మిడీ పెట్టుబడి లేకుండా సగం వాటా అంటే మాటలా?'

కోనేటిరావు సమర్థత విషయంలో ఎవరికీ అపనమ్మకం లేదు. చాలా గటి వాడని పేరు. 'నువ్వు మంత్రివి కావలసిన వాడివోయ్. ఈ సారి ఎమ్మెల్యేగా నుంచోక తప్పదు' అనేవారు రఘుపతి గారు ఆ శిష్యపరమాణువును.

'మీ శిష్యరికం వృధా పోతుందా? ఈ సారి చూద్దాం' అంటూ అంతులేని ఆత్మ విశ్వాసంతో సమాధానం చెప్పేవాడు కోనేటిరావు. అంత బలవంతునితో లావాదేవీలు పెట్టుకు బ్రతకడం—కత్తి మీద సాము కాదుగదా! ఏ క్షణంలోనైనా ఎదురు తిరిగి తన పిలక ఝాడించగల సమర్థత వున్న మనిషి ఆ కోనేటిరావు.

'మరీ అంతగా ఆలోచించకండి. నా జాతకం ఎంత మంచిదో తెలుసా? మనీ జాతకాలు మారి తీరతాయి చూడండి' మీరూ మారాలి'

'అంటే?'

'ఉన్నమాట చెబుతున్నానని కోపగించుకోకండి? నిజానికి మీరు ఇరవయ్యో శతాబ్దంలో పుట్టవలసిన మనుష్యులు కాదు. ఇంత పర్సనాలిటీ వుంది. బస్తీసీను గులా వుంటాడు ఆ భారతమ్మ మొగుడు. అటువంటి సూటు మీరు తొడుక్కుంటే చూడాలని వుందండీ'

నవ్వొచ్చింది స్వామికి.

'నవ్వకండలా—'

'ఏం చేయమంటావ్ ?'

'నిజం చెపుతున్నాను, సరైనపోషణ, డ్రెస్సు; గెటప్పూవుంటే — మీ పర్సనాల్టీ చూసి మూర్ఛపోరుటండీ జనం? నే చెప్పినట్టు వినండి: నాన్నిచ్చిన సందతో మీరు మాంచి సూటు కొనుక్కోవాలి'

విన్నాడు స్వామి చివరకు.

మూడునెలల్లో స్వామి గుర్తుపట్టలేనంత మారాడు. తల్లి సీతమ్మగారే ఆశ్చర్యపోయింది, మెరుస్తున్న టెర్లిన్ స్లాకుతో, పావని దగ్గరుండి కుట్టించిన పేంటుతో, అంతకుమించి లేని పిలకతో —మొదటిసారి వచ్చిన స్వామిని చూసి.



మమత

తప్పుచేసిన మనిషిలా సిగ్గుపడ్డాడు. తన బిజినెస్ సంగతి చెప్పాడు. నిజానికి సీతమ్మ గారు ఎక్కువ సంతోషించలేదు. ఆమె దృష్టిలో స్వామి ఒట్టి అమాయకుడు. బ్రతకడం చేతకానివాడు. వెర్రిబాగుల వాడు. 'ఆ తండ్రికడుపున ఎలా పుట్టాడు' అనుకునేది. పులికడుపున మేకపిల్ల పుట్టింది—అనిపించేది తనను బల్లిలా కరచుకు పసితనంలో నిద్రపోతున్న స్వామిని చూసి. రాజయ్యగారు నిజంగా పులే.


సీతమ్మగారిని చూడటానికి రెండవ సారి వెళ్ళినప్పుడు—జీపుకారులో వెళ్ళాడు స్వామి. సంబరపడింది తల్లి హృదయం. కాంట్రాక్టుల గొడవనుగురించి ముందు భయపడినంత—ఇప్పుడు భయపడటంలేదు. గుమాస్తాలున్నా తానే స్వయంగా అన్ని పనులూ చూసుకోగలుగుతున్నాడు. నిద్రాహారాలు మాని కూలీలతోపాటు మండు టెండలను లెక్కచేయకుండా కాలవ గట్టునే ఒక తాటాకుపాక దింపించి అక్కడే కూర్చొని పని చేయిస్తున్నాడు. అనేక సార్లు జీపున్నా యింటికి పోవడం పడేది కాదు. నీళ్ళు వదలకముందే పూడికలు తీయించేపని అంతా అయిపోవాలన్నాడు ఇంజనీరు. సలహా యివ్వడానికి కోనేటి రావు లేకపోయాడు. మంత్రిగారితో మాట్లాడటానికి—ఆ మిడిల్ స్కూలును హైస్కూలుగా మార్చే విషయంలో—హైదరాబాద్ వెళ్ళాడు. తానే తెగించి, రెట్టికి రెట్టింపు ఖర్చుపెట్టి ఉత్తరాది నుంచీ రెండు లారీలకు సరిపడ కూలీలను దిగుమతి చేసుకుని, పెట్రొమాక్సు లైట్లుపెట్టి రాత్రింబవళ్ళు పని చేయించాడు. కోనేటిరావు ఏమంటాడోనని భయపడ్డాడు. కాని అతను పదిహేను రోజులు బృందావనంలో విహరించివచ్చి, జరిగింది తెలుసుకొని స్వామిని కౌగలించుకుని — 'బ్రతికించావులే మాష్టరూ. కొంపమునిగేది లేకపోతే' అని ఆకాశాని కెత్తాడు. పదివేల చెక్కొచ్చింది. ఆ ఆనందంతో నూజివీడు వెళ్ళి— జీపులో —ఆ సంగతులన్నీ చెపుతుంటే ఆశ్చర్యంగా విని సీతమ్మగారు, భర్త రాజయ్యను గుర్తుకు తెచ్చుకుని, కళ్ళు తుడుచుకుని '— ఎక్కడికి పోతాయి పోలికలూ? అనుకుంటూ సంబరపడింది. 'వెర్రివాడనుకున్నా. తండ్రిని మరిపిస్తున్నాడు—షుమా!' అని ఆశ్చర్య పోయింది. జీపెక్కి వెళుతున్న కొడుకును చూసి. ముఖం ముడుచుకు దిగులుగా కూర్చు న్నాడు, స్వామి జీపులో. 'వెర్రినాయినా కోపమెందుకురా? ఎప్పటికైనా నీదగ్గ రుండవలసినదాన్నేగా వీలు చూసుకు వస్తాగా' అంది సీతమ్మగారు కొడుకు చుబుకాన్ని తాకి లాలనగా. జీపు వీధి మలుపు తిరిగి వెళ్ళేవరకూ అక్కడే నిలబడి నివ్వెరపోయి చూసింది. కళ్ళల్లో నీరుపొంగి — చూపు మసక బారింది. తుడుచుకు చూసింది. జీపు మలుపు తిరిగిందని వెనక్కు తిరిగింది సీతమ్మ గారు.

స్వామి జీవితం ఎటువంటి మలుపు తిరిగిందో కొంతవరకే తెలుసు ఆమెకు.

*　　*　　*

రాజయ్యగారి కడుపున పుట్టిన కొడుకు స్వామి.

జీపులో ఎక్కి తిరుగుతున్నంత సేపూ తండ్రి గుర్తుకు వచ్చేవాడు స్వామికి— 'జీపురాజయ్యగారు' తనతండ్రి. తాను అలా జీపుకారెక్కి — వందలూ వేలూ జేబులో పెట్టుకు తిరగగలనని కలగనలేదుస్వామి. పావనిచెప్పింది నిజమనిపించింది. నిజంగానే తమకు మంచిరోజులు వచ్చాయేమో? మరోరెండు కాంట్రాక్టు లిప్పించాడు కోనేటిరావు. 'వచ్చే ఎన్నికల్లో నెగ్గి మంత్రికానీ—ఇటువంటివి లక్షకాంట్రాక్టు లిప్పిస్తాడు కోనేటిరావు. అమ్మాయి జాతకంలో అదృష్టగీత అటువంటి దబ్బాయ్' అనేవాడు రఘుపతి. పావని అదృష్ట వంతురాలే. నాలుగైదు నెలల తర్వాత కోనేటిరావు— అందరితో సంప్రదించిన మీదటనే, తన బావమరది—భారతమ్మ మొగుడికిగూడా వాటా యిచ్చాడు. అంతకు ముందు నెలకు సగంరోజులు పుట్టింట్లో ఉండటం అలవాటయిన భారతమ్మ —



యిప్పుడు భర్తతోసహా అన్నగారింట్లోనే కాపురం పెట్టింది.

భారతి భర్తపేరు భీమారావు. పేరును బట్టి అతని రూపాన్ని ఊహించుకుంటే ఎవరైనా మోసపోతారు. చాలా నీరసం మనిషి. రోజుకు పదహారుసార్లు కాఫీ తాగి, ఆరేడు పాకెట్ల సిగరెట్లు పీలుస్తూ— 'ఆ బలంతో' బ్రతుకుతున్న అర్భకుడు. భార్య నడుస్తున్నా ప్రక్కన— ఇద్దరిమధ్యా కనీసం పదిగజాల దూరముండేటట్లు జాగ్రత్త పడతాడు. ఆ భీమారావుకూ మున్సబుగారికీ ప్రాణమైపోయింది. ఆ బంధం చీట్లాట. కుటుంబ కలహాలు అడ్డం రాలేదు ఆ స్నేహానికి.

అటువంటి కాంట్రాక్టులకు పనికొస్తాడని జాయింటు కలుపుకోలేదు కోనేటిరావు, చెల్లెలిమీదున్న మమకారమే కారణం. స్వామికి కాంట్రాక్టు పనుల్లో ఆవంతకూడా ఉపయోగపడటం లేదు భీమారావు. క్షణం తీరికలేకుండా, వేళకు తిండిలేకుండా, ఒంటిపట్టున కమ్మని నిద్రలేకుండా తిరుగుతున్న భర్తను చూస్తే— పావని మనస్సు కలవరపడేది.

'నల్లబడ్డారండీ' అనేది నాలుగు రోజుల తర్వాత యింటికి వచ్చిన భర్తకు నీళ్లతోడి పిపురుద్దుతూ.

'చిక్కిపోయారండీ' అంటూ మరింత పప్పువడ్డించి, చారెడు నెయ్యి పోసేది అన్నంతింటున్న భర్తచేతుల్లో.

'కష్టపడి సంపాదిస్తున్నారు పాపం. ఒకొక్కసారి ఒక్కదాన్నీ పరుపుమీద పడుకుని— ఎంత రాత్రయినా నిద్రరాక— కలవరిస్తాను. పలవరిస్తాను. పరుపుమీద నీళ్లు జల్లుకుంటాను. వళ్లు ఆవిరి వాస్తుంది. ఆకాలువ గట్టుమీద పాకలో మీరూ అలాగే బాధపడుతున్నారని పిస్తుంది. ఏమండీ నిజం చెప్పండి— మీకూ అలాగే అనిపిస్తుందా? మంచిచీర కట్టుకుంటే— మీరు చూడటానికి వీల్లేకుండా ఎక్కడో ఉంటారు తెల్లవారటం ప్రొద్దుగూకటం. మొగుడు ఎదురుగుండా లేక నా బ్రతుకు ఎలా అనిపిస్తుందో, ఎదురుగుండా ఉండి భారతి బ్రతుకూ అలానే అనిపిస్తుంది. అదేం మొగుడండీ బాబూ అర్ధరాత్రి దాకా ఆ మున్సబు

గారి అరుగులమీద చీట్లాటల్ట. ఎప్పుడో కోడికూసే వేళకు దొంగలా కొంపకు జేరి నిద్రపోతాట్ట బండరాయిలా. రోజూ చెప్పుకు ఏడుస్తుంది భారతి పాపం. చీట్లాటయ్యాక తెల్లవారు జాముదాకా ఏం చేస్తాడని అడగరేం?'

'ఏం చేస్తాడూ?'

'మెరక దిబ్బ మీదుంది లెండి. ఓ ఖరోడా దొమ్మరిది. కాటుక పులుముకున్నట్టు కళ్లచుట్టూ మచ్చలు. చుట్ట కాలుస్తుంది మన్సబ్బులా. ఆ మిసాలరాణి ఖర్మకాలి— భారతమ్మ మొగుడి ప్రియురాలు. పేరు బుజ్జిలు లెండి. పగలుమూస్తే రాత్రికల్లోకి వస్తుంది. ముస్సబు ఝలాకా అని చెప్పుకునేవారు. వాడే తగిలించి వుంటాడు పీడికి దాన్ని. వాడోని ద్రమోహం'

'సిగరెట్టు' అన్నాడు స్వామి దిండు క్రింద తడుముకుంటూ.

'ఈవిద్య ఎప్పుడు మొదలు పెట్టారూ?'

మమత

అంది పావని మొగుణ్ని తొడపాశం పెట్టి.

'నువ్వే మొదలు పెట్టమన్నావుగా?'

'చంపారు పొండి. నేను సిగరెట్టు తాగమన్నానా మిమ్మల్ని?'

ముక్కుమీద వేలేసుకుని ఔరా! అంది పావని.

'ఏమిటి ఆశ్చర్యపోతున్నావ్?'

'భారతమ్మ ఆ బుజ్జిలు దగ్గరకు మొగుణ్ని పంపించడం ఎంత నిజమో, నేను మిమ్మల్ని సిగరెట్టు తాగండి అనడం అంత నిజం. మీ పిండికట్లు చెరిపింది—పిలక తీయించి, క్రాపు పెట్టించి సూటు తొడిగించేసరికే— నా తాతలు దిగొచ్చారే. నే త్రాగమంటేనుటుకు మీరు సిగరెట్టు త్రాగుతారా? నల్లబడ్డాయండీ పెదవులు. నా పెదిమలకంటే ఎర్రగా వుండేవి.'

'ఏమిటా మోటుతనం!'

'ఏమో'

'ఊపిరాడటంలా'

'ఊ!'

అరే'

'వ్వ్'

'ఉండు చెప్తా'

'అమ్మో చచ్చాను బాబోయ్'

అరచేతో అద్దుకుంది నోటిని.

'వెనుకటికి నాది కాకపోతే తాటిపళ్లకు ఎదురుదేకమన్నాట్ట. ఏం చిట్టీ! నువ్వే తెలివైనదానివనుకుంటున్నావా? నీమాత్రం బలం నాకు లేదనుకుంటున్నావా? నిజానికి నువ్వు నాకు గురువ్వి.'

'మాష్టారు మీరు.'

'ఇంక పడుకో మళ్లీ తెల్లవారు జామునే బయలుదేరాలి లాకులకు.'

'నిద్రరావడం లేదండీ.'

'ఇవాళ ఎంతదూరం ప్రయాణంచేసి వచ్చానో తెలుసా?'

ఆవులించి అటు తిరిగి పడుకున్నాడు స్వామి.

'ఏమండీ?'

'ఏమిటి పావనీ'

'ఆ ముసుగేమిటండీ—యిటు తిరగండి.'

'అబ్బబ్బ'

'ఒక చిన్నకోరికండీ'

'ఏమిటి ?'

'తీరుస్తారా?'

'చెప్పు ?'

'రేపు పెందరాళే రండి. ఏలూరెళ్దాం సినిమాకి. భారతికూడా వస్తానంది.'

'పానకంలో పుడకలా మధ్య ఆవిడ గారెందుకు?'

'పాపం! ఎంతైనా స్నేహితురాలు కదుటండీ. దానికి మొగుడున్నాడన్న మాటేగాని ఒకముద్దా ముచ్చటా? తోచక పిచ్చెక్కి ఛస్తూంది. రానీండి వెంట. మీ సొమ్మేం పోయింది. ఏమంటారు ?'

'వెళ్తే నూజివీడు వెళ్దాం నాలుగు మైళ్లు ఎక్కువైనా. అమ్మని కూడా చూసి రావచ్చు—రేపు చూద్దాంలే.'

'చూద్దాంకాదు. మీరు రేపు మధ్యాహ్నానికే వచ్చెయ్యాల మరి'

'అలాగే'

ఆఫీసులో ఈ వేషాలు నచ్చవురా... అంటాండా... ఇంట్లో అమ్మ వుండగా సంగతి వేరు....



'మొన్నటిదాకా' భారతి నన్ను చూసి జాలిపడేది. యిప్పుడు దాన్నిచూసి నేను జాలిపడాల్సి వస్తూంది. మొన్నేంజరిగిందో తెలుసా? అదేం క్రితంసారి— పోరుపడ లేక భార్యను వెంటబెట్టుకు — సినిమా కంటూ ఏలూరు బయలుదేరాట్ట. తీరా హాలుదగ్గర కెళ్ళాక ఒకే ఒక టిక్కెట్టు కొని— నువ్వు చూడు సినిమా— ఆట అయ్యే వేళకొస్తాను— అంటూ క్లబ్బుకు పేకాటకి పోయాట్ట. ఒక్కతే సినిమా హాల్లో కూర్చుని కుళ్ళికుళ్ళి ఏడ్చిందట. అదేం మొద్దండీ బాబూ. అటువంటి పదార్థాన్ని కట్టుకోవడం కంటె ఏ నా పరాయినో కట్టుకుంటే యింకా ఎక్కువ సుఖపడేది. కాకిముక్కుకు దొండపండు కట్టినట్టు — అంత దబ్బపండులా వుంటుందా భారతమ్మ—మనిషిని చూస్తేనే చిరాకు పడ్తాడుటండీ. భారతమ్మ కాలి గోరికి సరిపోతుందా చెప్పండి ఆ దొమ్మరి ముండ బుజ్జిలు. అవిడగరిలో ఏం సౌభాగ్యం కనిపించిందో ఈ మహాను భావుడికి. మొన్నటండీ — దాన్ని సైకి లెక్కించుకొని కాలవగట్టుమీద...'

స్వామి నిద్రపోయాడు ఆదమరచి.

భార్యకు యిచ్చినమాట — నిలబెట్టు కున్నాడు స్వామి. మర్నాడు స్వయంగా జీపు తోలుకుంటూ సినిమాకు బయలు దేరాడు." ఆ నాడు మాట్లాడినంత చనువుగా అంతకు ముందెన్నడూ భారతి స్వామితో మాట్లాడలేదు. మున్సబుగారి అరుగుల ముందుగా జీపు పరిగెత్తుతున్న ప్పుడు — భారతి భర్త శ్రీమారావు ముగ్గులు కలుపుతున్నాడు తలెత్తి ఆగి చూశాడు ఒకక్షణం. స్వామికి ఏదో బెరు కనిపించింది ఒక్కక్షణం.

'మీ ఆయన కూడా వస్తే బావుండేది భారతి' అన్నాడు స్వామి.

'సరి సరి — ఆ పీటాట వదిలి స్వర్గానికి రమ్మన్నా రాడాయన'

'మరీ అంత పిచ్చేమిటే బాబూ'

'పిచ్చకాదు మాయరోగం'

'నీకు మరీ నోట్లో నాలికలేను లెద్దూ భారతి! అటువంటివాడు నాకు దొర కాల్సింది. ఆ మాయరోగ మేమిటో వదల గొట్టేదాన్ని దుమ్ముదులిపి'

'మొండిఘటమే బాబూ! నీకేం తెలుసు ఆయనసంగతి'

'ఎంత మొండిఘటమైనా మొగుణ్ణి లొంగదీయటానికి అనేక చిట్కాలున్నాయి. మచ్చిక చేసుకోవడంలో వుంది'

'అన్ని చిట్కాలు ఉపయోగించా. ఆఖరుకు మూణ్ణాళ్ళు అన్నం తినకుండా పడుకున్నా నా కడుపే కాలిందిగాని ఆయన గరు ఆ మున్సబుగారి అరుగుల్ని వదిలి రాలా'

'విడాకు లిచ్చేస్తానని బెదిరించలేక పోయావ్?'

'నిక్షేపంగా యిచ్చేస్తుంటాడు పీడా విరగడయిందనుకుంటూ. ఈ బ్రతుకు యిలా వెళ్ళ మారిపోవాల్సిందే. అందరికీ మాస్టారిలాంటి భర్త దొరకొద్దూ'

'మరీ అంత పొగిడెయ్యకేవ్ యిప్పటికే ఉబ్బిపోతున్నారాయన దర్జాగా పట్టుకుండా'

'నువ్వే కావాలని ఉబ్బేస్తున్నావ్ అంతంత నెయ్యిపోస్తూ.'

కారు ఎగిరిపడింది 'చంపారండి బాబోయ్' అంటూ స్వామిమీద పడింది పావని — పావని మీద పడింది భారతి.

'ఎంత మార్పొచ్చేతల్లీ మీ ఆయన్ను. విమానంలా నడుపుకొచ్చారు కారు.'

ముందు సరాసరి తల్లిని చూడటానికి వెళ్ళాడు స్వామి.

'ఆ సమయంలో సీతమ్మగారు అవధానిగారింట్లో వుంటుందని స్వామికి తెలుసు. జీపు యింటిముందు ఆపి 'నువ్వూరా పావనీ' అన్నాడు.

'మీరు వెళ్ళిరండి సినిమా అయ్యాక ఆవిడ యింటికి వస్తుంది గదా?' అంటూ తప్పుకుంది పావని. అవధాని గారింట్లో అత్తగారికున్న ప్రతిపత్తి పావనికి పూర్తిగా తెలుసు. కాని ప్రత్యక్షంగా చూడటానికి పావనికి మనస్కరించలేదు. అందులో భారతి ప్రక్కన వుండగా.

'మీ అత్తగారు యింకా వంటలక్కగా రెక్కలు విరగ్గొట్టుకోవలసిన అవసరమే ముందే పావనమ్మా. ఆవిడకూడా పెద్దదైపోయింది గదా' అంటూ అమ్మలక్కలు దెప్పి పొడుస్తున్న ధోరణిలో మాట్లాడినప్పుడల్లా, అరికాల్లో గంటుముల్లు దిగినట్లనిపించేది.

స్వామియింట్లో అడుగు పెట్టగానే, అవధానిగారు కూడా అతన్ని ఎగాదిగా పరీక్షించి చూసి, చూసాక కళ్ళు చిట్లించి వాకిట్లో నిలబడ్డ జీపును చూసి, ఏదో ఘోరం జరిగిపోయి నక్షత్రాలు రాలిపోయినట్లు ఎగిరిపడి 'కారులో వచ్చావా?' అని ప్రశ్నించి, అలాగే నోరుతెరుచుకుని సమాధానం కోసం నిరీక్షించారు.

'ఔనండీ!'

అవధానిగారు క్రింద తన్నిన ఆవిరికి అన్నపుసిబ్బి లేచినట్లు నిలబడి, ఊడిపోతున్నగావంచా మరింత గట్టిగా బిగించి 'ఎవరేమిటి కారులో?' అన్నారు అలాగే దృష్టి కేంద్రీకరించి చూస్తూ.

'మా ఆవిడండి'

'చెప్పావు కావేమయ్యా! పెద్దవాడివయ్యావ్. కార్లెక్కి తిరుగుతున్నావు పెళ్ళాన్ని వెంటేసుకొని. కళ్ళముందు పుట్టి పెరిగిన వాడినిగదా పెళ్ళాన్ని తీసు

కొచ్చి— పెళ్ళికాగానే — చూపెడతావనుకున్నా—ఔన్నే—లోపలికి రమ్మను'

అతి బలవంతంమీద పావనిని వెంటబెట్టుకుని అవధానిగారింట్లోకి నడిచాడు స్వామి.

'నాకు భయంగా ఉందే బాబూ! నువ్వా కాస్త వెంటరా.'

భారతికూడా వెనక నడిచింది.

సీతమ్మగారు యింట్లోలేదు. 'ఎవరో మీ మామయ్యకూతురట ఇక్కడే కాపరంతే. వంట్లో బాగుండలేదంటే చూసి రావడానికి వెళ్ళింది' అంది అవధానిగారి భార్య. ఆ మామయ్యకూతురు శ్రీదేవి కాదుగదా? మరింకెవరున్నారు. యిక్కడికెలా వచ్చింది. పెళ్ళి అయినట్లు తనకు తెలియదే! తలుచుకుంటే జాలనిపించింది. పాపం! చిన్న వయస్సులో భర్తపోవడం — వైధవ్యం — బాధలు —

'కాసిని మంచినీళ్ళుకావాలా బాబూ?' అంది అవధానిగారి భార్య మరచెంబు పట్టుకొచ్చి. రెండుగ్లాసులు గటగట త్రాగేశాడు పరధ్యానంగానే. పావని మూతి ముడుచు కూర్చుని 'యింకపోవాం పదండి' అని సైగచేయటం మొదలెట్టింది. అవధానిగారి కూతురు — పెళ్ళికాబోతున్న పిల్ల — మంగమ్మ — కిటికీ సందులోంచి కనిపించింది.

'కాంట్రాక్టుల వ్యాపారం బాగా సాగుతున్నదన్నమాట' అన్నారు. అవధానిగారు జీపుకారునే చూస్తూ, 'వీడింతవాడు కాగలడని కలగన్నానా—మంగుల్నే యిచ్చేవాణ్ని' అనుకుంటూ.

'రోజులు కలిసొస్తే అంతే లెండి. భైరవమూర్తిగారి తండ్రి మా నాన్నగారింట్లో నీళ్ళ కావిళ్ళుమోపి కొడుకుకు చదువు చెప్పించాడు. వీధిలాంతరు దగ్గర కూర్చొని చదువుకుని, 'చిన్నపిల్లలకు ట్యూషన్లు చెప్పుకు యిస్కూలు ఫీజు కట్టి — చివరకు కలెక్టరై పరగణా మొత్తాన్ని గడగడ లాడించాడు. రోజుల మహాత్యం! మన అబ్బిగాడి చదువుకు యింత తగలేశాం. ఆ మోటారు సైకిలెక్కి తిరగడం తప్ప చదువు వంటబట్టిందీ.'

నిట్టూర్చారు అవధానిగారు. రెప్పలార్పకుండా కిటికీ సందులోంచి స్వామికేసి అలాగే చూస్తున్నది మంగులు.

అవధానిగారు అదోకరకంగా దగ్గి అది అసూయో, ఆపేక్షో తెలియని పద్ధతిలో 'చూడు స్వాములూ! మా అరుగులమీద చదువుకుని — యింతటివాడివి కావడం గొప్పే అనుకో. ఎంతగొప్పయినా, కన్న తల్లితండ్రులకు అన్నం పెట్టకుండా వాళ్ళని గాలికి వదిలిపెట్టమని లేదుగదా? ఎంత కష్టపడి చదివించింది మీ అమ్మ? అరమైలుదూరం గంగాళంలాంటి బిందెలతో హోటళ్లకు నీళ్ళు జారబోస్తుంటే — తోటి కుటుంబం తాలూకుగదా అని నేనే యింట్లో వంటపనికి పెట్టుకుని — నీ చదువుకేమిటి ఆవిడ తిండికేమిటి తోచిన సహాయం చేశాననుకో. కాని రెక్కలు విరగ్గొట్టుకుందెవరు? ఆవిడ బరువు బాధ్యతలు నువ్వు వహించడం ధర్మమయ్యా! నువ్వేమనుకున్నాసరే. పెద్దవాణ్ని గనక— ఆవిడను చూస్తే గుండె తరుక్కుపోయి చెబుతున్నా' అంటూ మొదలుపెట్టారు. ఆయన ధోరణి చూస్తే అయిదారుగంటల వరకూ వదిలేటట్లు కనిపించటంలా.

పావని ఈ మాటలు వినలేక 'పదండి! సినిమా టైమయింది' అంటూ లేచింది. భారతి అనుసరించింది. చివరకు స్వామి గూడా లేచి 'వస్తానండీ' అన్నాడు.

'పాడు సినిమాకోసం పద్నాలుగుమైళ్ళు మేరేసుకొచ్చారా?' అంటూ ఆశ్చర్యపోతున్న అవధానిగారు, కారు కను చూపు కార దాటిపోయేవరకూ ముక్కుమీద వేలు తీసెయ్యనే లేదు.

'అంత తాటాకు మంటలా మండిపోతూంది ఆ స్వామిగాడిపెళ్ళాం. అదెక్కడ కాపరం చేస్తుందండీ మీ వెర్రిగానీ—' అంటూ దీర్ఘాలు తీసింది అవధానిగారి భార్య.

మెట్లెక్కుతూ సినిమాహాల్లోకి నడుస్తున్నారు ముగ్గురూ.

సగం మెట్లు యెక్కింతర్వాత మలుపు మూలలో గోడకు నిలువుటద్దం బిగించారు. చెప్పు మడతపడి వంగి పడబోయింది పావని. నడుం పట్టుకుని అడ్డుపడ్డాడు స్వామి. ముగ్గురూ వరసగా ఆ నిలువుటద్దంలో మెరిసారు. తనకేసి చూస్తూ కళ్ళు చిట్లించింది భారతి. పావని 'బ్రతికించారు. అందుకనే భరించువాడు భర్త — అని ఉత్పత్తి అర్థం ఒకటికి పదిసార్లు చెప్పేవాడు పరాంకుశ

మాష్టారు.'

'ఈ హిందీ ముక్కలు ఒక్కటీ నా కర్థం కావు. పాటలూ గంతులూ బాగుంటాయని చిలుము వదిలించుకోవడం గానీ' అంది పావని హాల్లో అడుగు పెడుతూ.

'నా కసలే తలకెక్కవే తల్లీ' అంది భారతి.

'మాష్టారూ! మళ్ళీ పాఠం చెప్పాలి మీరివాళ ఇద్దరికీ. పాపం ఎన్నడో భారతి కూడా మీ శిష్యురాలు కావలసింది. సీతమ్మవారిని రావణాసురుడెత్తుకుపోయినట్లు ఆ భీమారావుగారు కొన్నాళ్ళు తాళివుంటే—'

స్వామికి అటు భారతీ—యిటు పావనీ కూర్చున్నారు.

'మొదట్లోనే యీలవ్వేమిటండి దిక్కుమాలిన గోల!' అంది పావని.

'ఎత్తికుదేస్తున్నాడే బాబూ ఆ హీరోయిన్ని. ఎలా భరిస్తున్నదోగాని—'అంటూ మరింత ఆసక్తిగా ముందుకు వంగింది భారతి.

స్వామి వళ్ళు జలదరించింది. చెయ్యి కంటె ఎక్కువ నలుగుతూంది మనస్సు.

'ముఫ్ఫైవేలో— మూడు లక్షలో యిస్తార్ట. అందులో ఏదో వంతిమ్మను. ఇంతకు పదిరెట్లు ఎత్తికుదేసినా ఎవరు భరించరు.'

'ఛీ పాడుపో.'

'మొహబ్బత్ అంటే ఏమిటండీ?'

'అవ్వే చిట్టితల్లీ. ఆ భూతాలద్దాల కళ్ళజోడు ప్రేమలేఖల్లో వాక్యానికి మూడు సార్లు కనిపించేదీ మాట గుర్తులేదూ?'

'ఎందుకండీ' అలా ముళ్ళు గుచ్చుకుంటాయని కూడా లేకుండా ఆ కొండల మీదా గుట్టలమీదా అలా కుప్పిగంతులేసింది— అంతట్లో ఏమయింది అలా యేడుస్తూంది తేలు కుట్టినట్లు హీరోయిన్న'

'ఇంటిపట్టు పట్టకుండా అలా రౌడీ వెధవల్తో తిరిగే గుట్టలంట — కాళ్ళు విరగకొడతానన్నాడేమో వాళ్ళ నాన్న—విలనుండాలిగా మరి'

'అంతేనాండీ?'

'సినిమా కథ కంటె మీ కథే బాగుంది కానీండి వింటా' కళ్ళు మూసుకు కూర్చున్నాడు స్వామి.

(ఇంకా ఉంది)



'ఖడ్గవీర'లో కాంతారావు, జ్యోతిలక్ష్మి.

చిత్ర సమీక్ష:

ఖడ్గవీర

ఒకే కథానాయకుడు చిత్రమంతా వీరవిహారం చేసే జానపదాలే మనకి ఎక్కువ. కొట్టేటిలు ఏదయినప్పటికీ — ముగ్గురు వీరులమీద కథనివంచి కొత్తదనాన్ని చూపిస్తారనుకున్న విజయరాణి కంబయిన్స్ వారి 'ఖడ్గవీర' కొంత నిరుత్సాహాన్నే కలగజేస్తుంది.

ముగ్గురు ఖడ్గవీరులు కలసి మెలసి ఒక రాజకుటుంబాన్ని సంరక్షించడమే ఇందులో కథావస్తువు.

ఒక వీరుడు రాకుమార్తెతోను, మరొక వీరాగ్రేసరుడు ఆమె చెలికత్తెతోను ప్రేమాయణం సాగించగా, మరొక వీరుడు భగ్నప్రేమికుడుగా మిగిలిపోతాడు.

ఇందులో భగ్నప్రేమికుడుగా వున్న వీరుడిదే కొంతవరకు వైవిధ్యమున్న పాత్ర. ఆ పాత్రలో త్యాగరాజా మెండయిన నటనని కనబరిచారు. కథానాయకుడుగా కాంతారావు సాహసకృత్యాలు ఆసక్తి కానికంగానూ, ఆకర్షణీయంగానూ వుండి కథని రసవంతం చేశాయి. వీరత్వంలో సమానులైన ముగ్గురు వీరుల పాత్రలూ కథానుగుణంగా వుండివుంటే చంద్రమోహన్ నటన కనిపించివుండేది. రాజశ్రీ మనోహరంగా నటించింది. జ్యోతిలక్ష్మి నర్తకిగా మాత్రమేగాక ఒక ప్రధాన పాత్రని పోషించడం విశేషం. ఆమె నటన ప్రేక్షకులకు మంచి రిలీఫ్ నిస్తుందని చెప్పొచ్చు. రాజనాల నటన బాగున్నది.

జి కె మూర్తి రచన చేశారు. కెమెరాను మధు నిర్వహించారు. టి. వి. రాజు సంగీతం చిత్రానికి మంచి ఆకర్షణ కూర్చింది. జి విశ్వనాథం దర్శకత్వంలో చిత్రం ఒక ప్రత్యేకతని నిలుపుకున్నది. జె. యం. కృష్ణంరాజా, కె. శోభనాచలం నిర్మించిన ఈ చిత్రాన్ని ముద్దు సూర్యనారాయణ సమర్పించారు. జయలక్ష్మి విడుదల.

—సీతరాజు.

సినిమా

జగత్ కిలాడీలు విజయాన్ని పురస్కరించుకొని మన నిర్మాతలలో చాలామంది ఇలాంటి చిత్రాలవైపు మొగ్గారు. దర్శకుడు ఐ. ఎన్. మూర్తి సుప్రజా పిక్చర్సు పేరిట నిర్మిస్తున్న 'కిలాడి సింగన్న' సగానికిపైగా పూర్తయింది. ఎస్. వి. రంగారావు ద్విపాత్రాభినయం ఈ చిత్రానికి హైలైట్. నాయకీ నాయకులుగా వాణిశ్రీ, హరనాథ్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి కన్నప్ప ఛాయను, కోదండపాణి సంగీతాన్ని ఐ. ఎన్. మూర్తి దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. చిత్రంలోని ప్రధాన పాత్రలను నాగభూషణం, రాజబాబు, చంద్రమోహన్, విజయలలిత, రేణు, విజయశ్రీ, సూర్యకుమారి ధరిస్తున్నారు. పూర్ణా విడుదల.

* * *

జానపద చిత్ర రచయితగా వినుతికెక్కిన పింగూరి విజయలలితాపిక్చర్సు పేరిట నిర్మిస్తున్న 'అదృష్టదేవత' చిత్రం మూడువంతులు తయారైంది. ఈ చిత్రానికి కోదండపాణి సంగీతాన్ని,



'తల్లీ తండ్రులు'లో విజయలలిత.



ఫొటోగ్రఫీలో వినోదం కోసం ఆగ్ఫా క్లిక్ III

అభ్యాసానికి, అనుదిన వినియోగానికి అత్యుత్తమం


- ఉపయోగించుట తేలిక. ఎడ్జెస్ట్‌మెంట్లు అవసరం లేదు.
- ప్రతి 120 రోల్‌తో, 12 పెద్ద సైజు (6 x 6 సెమీ) చిత్రాలు తీయవచ్చు.
- ఎవర్-రెడీ కేస్, పోర్ట్రెయిట్ లెన్సు, మరియు ఫ్లాష్ గన్ అదనపు వెలకు లభిస్తాయి.

ఇంకా ఎక్కువ ఉజ్వలమైన చిత్రాలు కావాలంటే, ప్రత్యేక యాక్రొమాట్ ఎఫ్. 8.8 లెన్సు అమర్చియున్న ఆగ్ఫా క్లిక్ IV చూడండి. మసక వెలుతురులో కూడా, దీనితో మెరిసిపోయే చిత్రాలు తీయవచ్చు. వెల 62.50 (పన్నులు అదనం).

కన్నులు మిరుమిట్లుగొలిపే ప్రింట్లు, ఎన్‌లార్జిమెంట్లు కావాలంటే, ఆగ్ఫా ఫొటో పేపరే వాడండి.

అథరైజ్డ్ ఆగ్ఫా డీలర్లు అందరివద్ద లభిస్తాయి.

ఆగ్ఫా గెవార్ట్ సహకారంతో, తయారు చేయువారు:
ది న్యూ ఇండియా ఇండస్ట్రీస్ లి., బరోడా.



రు. 46.50 (పన్నులు అదనం)


AGI సోల్ డిస్ట్రిబ్యూటర్లు:
ఆగ్ఫా-గెవార్ట్ ఇండియా లిమిటెడ్
బొంబాయి . క్రొత్త ఢిల్లీ . కలకత్తా . మద్రాసు



® ఫొటోగ్రఫిక్ ఉత్పత్తుల నిర్మాతలు, ఆగ్ఫా-గెవార్ట్ అంట్‌వెర్ప్-లివెర్కు-సెన్ యొక్క రిజిస్టర్డ్ ట్రేడ్‌మార్క్

ఆగ్ఫా క్లిక్—భారతదేశంలో విస్తార ప్రజాదరణ కల కెమేరా

CMAG-139-203 Tel



'విజయం మనదే'లో రామారావు, సరోజాదేవి.

లాల్ ఛాయను, కె. యస్. ఆర్. దాస్ దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. ముఖ్య పాత్రలను కాంతారావు, రామకృష్ణ, సత్యనారాయణ, త్యాగరాజు, ధూళిపాళ, మిక్కిలినేని, బాలకృష్ణ, అల్లు రామలింగయ్య, వాణిశ్రీ, విజయలలిత, శ్యామల, సురేఖ, పుష్పకుమారి పోషిస్తున్నారు. జ్యోతి విడుదల.

* * *

కొడైకెనాల్ నుండి హీరో నాగేశ్వర

సినివహా

రావు మద్రాసుకు వచ్చారని తెలిసి, సవేరాహోటల్‌కు (మద్రాసులో ఆయన విడిది) ఫోన్ చేశాను. 'రండి' అనేడి సమాధానం రావడమే ఆలస్యం, టాక్సీని 'సవేరా'కు డైరెక్టు చేశాను. నేను వెళ్లడం, జెమిని అధినేత శ్రీ బాలసుబ్రహ్మణ్యం హీరోగారి రూమ్‌నుండి రావడం ఒకేసారి జరిగింది. నమస్కార



'శ్రీదేవి'లో రాజబాబు, సంధ్యారాణి.

మేంటూ రూమ్‌లోకి వెళ్లాను. అక్కినేని సోఫాలో కూర్చుని, యేదో సైంటిఫిక్ మ్యాగజైన్ను తిరగేస్తూ వుండడాన్ని గమనించాను. నన్ను చూచి 'ట్యేక్‌యువర్ సీట్' అన్నారు. ఏమిటి, యివాళ మీకు షూటింగులేదా? అని ప్రశ్నించాను. జెమినీలో వుండాల్సిన షూటింగు క్యాన్సిల్ అయింది. మా సేవుంటారు అనుకుంటూ నిర్మాత బాలూగారిని అన్నారు.

మీకు తెలుసా?

తమిళ సినీరంగ ప్రముఖుల్లో చాలామందికి స్వంతపత్రికలు ప్రారంభించాలనే కోరిక యీమధ్య విపరీతంగా యేర్పడింది. కారణం—తమ స్వంతఅభిప్రాయాలను వెలిబుచ్చడానికే అనుకుంటూ.


హేమమాలిని ఒక హిందీచిత్రంలో 64 రకాల దుస్తులను ఒక నృత్య దృశ్యానికిగాను ధరించి, రికార్డును సృష్టించింది.

వైజయంతిమాల నిర్మిస్తున్న మరొకచిత్రంలో నాయికగా ఆమె నటించడంలేదు. అనుపమ అనేడి మరొకి నటి నాయికగాను, డాక్టర్ కాశీనాథ్ గణేశర్‌నాయకునిగాను నటిస్తున్నారు

ఇటాలియన్ నటి సోఫియాలారెన్‌కు ఆమె యింట్లోనే ఆరు సాహిత్య గ్రంథాలయాలు వున్నాయట. అన్ని బాషల్లో వుత్తమమైనవిగా పరిగణింపబడే గ్రంథాలు యీమె లైబ్రరీలో వున్నాయట.

నిర్మాత లంచడవచ్చు. కథ: ఎవరి?

'మీకు మరీ కుర్రతనం వచ్చి, యిప్పటికీ మీరే నూతన కథానాయకుడిగా వుండడం చాలా ఆశ్చర్యంగా వుంది' అని ప్రారంభించాను. 'ఏం చెయ్యమంటారు చెప్పండి. నేను విగ్ పెట్టుకుని స్లాక్ అండ్ ప్యాంట్ వేస్తే, నాకు తెలియకుండానే నేను యువకుణ్ణైపోతున్నాను.



ప్రత్యేకంగా మీదే!

ఈ తాళం స్టేట్ బ్యాంక్ సేఫ్ డిపాజిట్టు లాకరుకు చెందింది. మీ ఒక్కరిదగ్గరే ఈ తాళముంటుంది. ఎందుకంటే, దీనికి డూప్లికేటు లేదు. స్టేట్ బ్యాంక్ సేఫ్ డిపాజిట్టు లాకరు ఒకటి అద్దెకు తీసుకోండి. (మా పెద్ద శాఖలన్నిటిలో ఈ సదుపాయం లభిస్తుంది). మీ విలువగల వస్తువులన్నీ భద్రంగా దాచుకోండి. నిర్భయంగా ఉండండి! ముఖ్యమైన కాగితాలు, విలువగల వస్తువులు దాచుకొనుటకు సేఫ్ కస్టడీ సదుపాయాలు నామమాత్ర వెలకు దొరుకుతాయి.

స్టేట్ బ్యాంక్ సేవ నిమిత్తం

S. 272 TL



“ఆడజన్మ”లో జమున, మాలతి

ది హౌస్ గాట్ ది పెక్యూలియర్ పర్స నాలిటీ ఆన్ ది స్క్రీన్' అని జవాబిచ్చారు. మీరు కొత్త నిర్మాణ సంస్థల్లో నటించ డానికి (చాలా) ఒప్పుకున్నారట? 'వాళ్లు వచ్చి అడుగుతున్నారు. చూద్దాం అని చెప్తున్నాను. ఎన్ని పిక్చర్లను అంగీక రించేది? అంగీకరించినా కథలుకావాలిగా?' అన్నారు.

* * *

మీరు ప్రస్తుతం నటించనున్న చిత్రా లేవో చెప్పగలరా? 'ఇప్పుడు ప్రొడ్యూసర్స్ కంబైన్స్, సినస్ పిక్చర్స్, ఉత్తమచిత్ర,

సినిమా

దసరాబుల్లోడు, మాధవీ కంబైన్స్ షూటింగులు జరుగుతున్నాయి అక్టోబరు నుండి పి. ఎ. పి. మేనేజరు సుబ్బారావు గారి చిత్రం, విశ్వభారతి, పి. ఎ. పి., అన్నపూర్ణా, రాజ్యంపిక్చర్స్, సురేష్ మూవీస్ చిత్రాల్లో నటించడానికి అంగీ కరించాను. మద్రాసు స్టుడియో చిత్రం యేదీ లేదా? అని ప్రశ్నించాను జెమినీ అధినేత శ్రీ బాలు నిర్మించనున్న కలర్ చిత్రానికి అక్టోబరును డ కాల్ షీట్లు యిచ్చారు ఈ చిత్రాన్ని శ్రీ వి మధు సూదనరావు డైరెక్టు చెయ్యొచ్చు.

* * *

నాకు ఒక చిన్నసందేహం, తీర్చగలరా అని అడిగాను. 'నో. ఎస్' అన్నారు. 'మీరు హీరోయిన్స్ అందరితోనూ నాయ కునిగా నటించారుగదా మరి దేవిక కాంబినేషన్‌లో ఒక పిక్చరుకూడా రాలేదే? 'నాకు ఆమెతో నటించడానికి ఎలాంటి అభ్యంతరం లేదు దర్శక నిర్మాతలు మా కాంబినేషన్‌తో నిర్మాణానికి యింకా పూనుకోలేదు. అదీగాక ఆమెలో నేను నటించిన రెండు చిత్రాల్లోనూ ఆమె నాకు వదినగా నటించింది. నాకు మిగతా వాళ్లెంతో, దేవికకూడా అంతే. ఆమె కనిపిస్తే, తమాషాగా జోక్సుకూడా వినిపిస్తుంటాను

రిటయిరయ్యేప్పుడు డైరెక్షన్

మీరు స్థాపించిన అన్నపూర్ణా సంస్థ ద్వారా విడుదల చేసే మొదటి చిత్రం ఏదో చెప్పగలరా? 'యిదీ నా ప్రశ్న. 1970 కి యే చిత్రం లేదు. 1971లో జగపతి చిత్రంతో ప్రారంభమవుతుంది,' అన్నారు సినిమా రంగంలో చాలామంది దర్శకులవుతున్నారుగా. 'మరి ఇంత అనుభవం వున్న మీరు యింకా...?' 'ముందెందుకండీ. స్టార్‌గా నాకు హెవీ డిమాండ్ వుంది. ప్రేక్షకుల అభిమాన ఆశీర్వాదాలున్నాయ్. 'ఉయ్ మస్ట్ బి కంటెంట్ విత్ వాట్ వుయ్ హావ్' అన్నారు. స్టార్‌గా రిటైర్ ఉయ్యే సమయంలో డైరెక్షన్ సంగతి ఆలోచిస్తాం అన్నారు. ఇంతలో ఫోన్ మ్రోగింది. శ్రీ అక్కినేని రిసీవ్ చెయ్య డానికి లోపలికెళ్లారు

మదేపియహా కిస్‌మిస్

వాహినీ స్టుడియోలో 'కొరడా రాణి' షూటింగు జరుగుతున్నట్లు తెలిసింది. ఫ్లోర్‌లోకి అడుగెట్టాము. అది ఒక అల్ట్రా మోడరన్ హోటల్. ఆ హోటల్ పేరు 'క్స్'. పడుచుకుర్రాళ్ళు అందాల బరిణెలు ఒక్కరా, యిద్దరా? జంటజంటలుగా

సినిమా డైరీ

● ప్రొడ్యూసర్స్ కంబైన్స్ వారి కలర్ చిత్రం “పూజకొద్దీ పురుషుడు” షూటింగు జూన్ 1 నుండి 12వరకు జెమినీలో జరిగింది పుట్టన్న దర్శకత్వంలో నాగేశ్వరరావు, రంగారావు, వాణిశ్రీ వాణిశ్రీ, శోభన్‌బాబు నటించారు


● నవశక్తి పిక్చర్స్ వారి షూటింగు ప్రసాద్ స్టుడియోలో జూన్ 9, 10 తేదీల్లో జరి గింది పి ఎస్ రావు దర్శకత్వంలో రామారావు, వాణిశ్రీ పాల్గొన్నారు

● నవభారత్ ప్రొడక్షన్స్‌వారి “కొరడారాణి” షూటింగు జూన్ 9న వాహినీలో ప్రారంభ మైంది కె. ఎస్ ఆర్ దాస్ దర్శకుడు

● మధు పిక్చర్స్‌వారి సాంఘికానికి సంబంధించిన సన్నివేశాలను జూన్ మొదటి వారంలో బాపూ వాహినీలో చిత్రీకరించారు “షావుకారు” జానకి, నాగభూషణంగార్లు పాల్గొన్నారు

● రవి ఆర్ట్ పిక్చర్స్ వారి “ఒకే కుటుంబం” షూటింగ జూన్ 10న న్యూటోన్ స్టూడి యోలో ప్రారంభమైంది ఏ భీమ్‌సింగ్ దర్శకుడు

● రామవిజేతావారి “తల్లీతండ్రులు” చిత్రంలో చంద్రకళ నాయికగా నటిస్తోంది చంద్ర మోహన్ ఒక ముఖ్యపాత్రను ధరిస్తున్నాడు


SANKAR
CEMENT

'ప్రశ్నావళి' శీర్షికకి ప్రశ్నలను పంపేవారు కవరుమీద స్పష్టంగా 'ప్రశ్నావళి.' ఆంధ్ర సచిత్ర వార పత్రిక, మద్రాసు — 1.' అని వ్రాయకోరుతున్నాము.— సం॥

సినిమా

కూర్చుని తియ్యటి కబుర్లు చెప్పుకుంటున్న సంతోష సమయంలో ఒక అప్సరస మిణుక్కుమనింది తన నృత్యకళా వైభవంతో, అవయవసౌంగాల గుబాళింపుతో అక్కడ వారిని మైమరపించింది. మత్తుగొలిపే ఆ నెరజాణని హత్తుకోవాలనే కోరిక అందరికీ కలిగింది. హోటల్ కస్టమర్సుచూచి, ఒక్కొక్కరే దరిచేరి—

'ఐ లవ్ యూ
యూ—యూ - యూ
హేయ్, మిస్టర్,
నిషావాలా, ఖుషీవేలా'

అంటూ కవ్వించి, వాళ్లలో తియ్యటి కోర్కెలను రేకెత్తించింది 'కట్' అన్నారు దర్శకుడు కె. ఎస్. ఆర్. దాస్ ఓ. కే అన్నారు డ్యాన్స్ డైరెక్టరు కె. ఎస్. రెడ్డి, కెమరామెన్ కన్నప్ప.

ఈ నృత్యాన్ని పూర్ణచంద్రరావు నిర్మించే నవభారత్ ప్రొడక్షన్స్ 'రాజకుమారి'లో మీరు చూస్తారు ఈ నృత్యాన్ని అభినయించిన నర్తకి ఎవరో తెలుసా మీకూ నాకూ కూడా తెలియనిది. ఇంతవరకు వెండితెరపై కనుపించనిది. ఎవరామె? ఏ వూరు? యేం పేరు? అని మీకు చెప్పాలిగా. ఆమె వూరు మలేషియా: పేరు కిన్మిన్ ఆమె మూవ్మెంట్స్ చూస్తుంటే మనం యీ లోకాన్ని మరచిపోయి, స్వప్నలోకంలో విహరించినట్లు వుంటుంది.

టైటిల్ పాత్రను విజయలలిత ధరిస్తూంది హీరో+హీరోయిన్ కూడా ఆమే ముఖ్యపాత్రలను సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, త్యాగరాజు, నెల్లూరు కాంతారావు, రాజబాబు, జ్యోతిలక్ష్మి, ధూళిపాళ (గెస్టు) రావి కొండలరావు (గెస్టు) ధరిస్తున్నారు విశ్వప్రసాద్ మాటలు వ్రాసిన యీ చిత్రానికి కె ఎస్ ఆర్ దాస్ దర్శకుడు; కన్నప్ప ఛాయాగ్రాహకుడు, సత్యం సంగీత సారధి, చలం శిల్పకళా దర్శకుడు మొదటి షెడ్యూలు జూన్ 9 నుండి 30 వరకు జరుగుతుంది.

* * *

హీరో నాగేశ్వరరావుకు తల్లిదండ్రులుగా అంజలీదేవి, జగ్గయ్యగార్లు మాదవి కంబయిన్స్‌లో నటిస్తున్నారు. ఈ నావల్ కాంబినేషన్‌లో ప్రేక్షకులు కొత్తదనాన్ని చవి చూడగలరని ఆశిస్తున్నా నటుడికి ఫలానా పాత్రనే చెయ్యాలనే పట్టింపు వుండకూడదని జగ్గయ్య, అంజలీదేవి గార్లు నిరూపించారు —శ్రీనివాస్ ●



"అఖండుడు"లో గీతాంజలి



మిస్ ఆన్ మార్క్ గ్రోక్స్

కెనడా యువతి భరత నాట్యం

ఈ మధ్య ఒక అమ్మాయి రాజధానిలో భరతనాట్యం, ఒడిస్సీ ప్రదర్శనలు చేసింది. ఆమెకి పక్కవాద్యం ఒక తమిళ కళాకారుడు వేశాడు అంతా ఆమె ఈ దేశం యువతే అనుకున్నారు. తమిళ విద్వాంసుడి సంగీతం ఆమె స్వంతందే అనిపించింది ప్రేక్షకు . అంత లక్షణంగా, సంప్రదాయబద్ధంగా ఆమె భంగిమలు.

అంతకీ ఆమె భారత వనితకూడా కాదు! ఆన్—మార్క్ గ్రోక్స్ కెనడాకి చెందిన యువతి. ఆమె భరతనాట్యకళనేకాక భారత సని ఒకదానిని కూడా నేర్చుకుంది. ఈ యంలో భారతీయులు చాలామంది అశ్రద్ధ చూపుతారు. స్వరం మాత్రం నేర్చుకుని భావాన్ని పట్టించుకోరు. ఇది విదేశ సంగీత వ్యాఖ్యానంలో బాగా కనిపిస్తుంది. అందు కనే వారి కదలికలు కొంత రసవిహీనంగా ఉంటాయి! మిస్ గ్రోక్స్ భారతసంగీత, నాట్యా లవేకాక భారత భాషలలో ఒకటయిన తమి గాన్ని కూడా నేర్చుకుంది. ఆమె కృషిని విజ్ఞులు గుర్తించారు. ఆమె నాట్య ప్రదర్శ నలు ఎందరి ప్రశంసలనో అందుకున్నాయి.

పాశ్చాత్యకళలలో ఎందరో భారతీయులు మంచి ప్రవేశాన్ని కలుగచేసుకున్నారు. 1970 లో భారతీయులకి డేవిస్‌కప్ వచ్చింది. అంతకి ముందు నోబెల్ బహుమతులుకూడా వచ్చాయి. లాస్ఏంజెలెస్‌లో ఎంతోపేరు సంపాదించు కున్న సంగీత దర్శకుడు ఒకతను భారతీయ జాతివాడే— జూబిన్ మెహతా.

కాని, మన కళలలో ఇంత వాశస్త్యం సంపాదించుకున్న విదేశాలవారు తక్కువ. మిస్ ఆన్—మార్క్ గ్రోక్స్ ఈ కోవకి చెందిన వారిలో ఒకామె.

హిగ్గిన్స్ అనే అతను తమిళపాటలు పాడాడు. నాట్యంలో పేరు సంపాదించుకున్న మొదటి పాశ్చాత్య వనిత మిస్ గ్రోక్స్ ఒకర్తే! ఆమె కనుక బ్రిటన్‌లో ఉంటే బ్రిటిష్‌రాణి ఆమెని తగినవిధంగా గౌరవించేవారు. మన ప్రధానమంత్రి ఆమె సేవని గుర్తించి గౌరవిస్తారా?

—శ్రీకృష్ణ.

ఆంధ్ర విజ్ఞాన సమితి, జయపూరు ఆధ్వర్యాన జరిగిన సభలో ప్రొ గోపీనాథ శర్మ [హిస్టరీ డిపార్టు మెంటు, రాజస్థాన్ యూనివర్శిటీ, జయపూరు] గారు, శ్రీ వల్లభాచార్యులవారి జీవితము, వారు స్థాపించిన పుష్టిమతమనే వైష్ణవ మతము, వారి శుద్ధ అద్వైత సిద్ధాంతముల గురించి ఉపన్య సించారు.

* * *

ఏప్రిలు 19 వ తేదీ ఆదివారంనాడు బరోడా ఆంధ్ర సమితి సర్వసభ్య సమావేశం జరిగింది.

* * *

'యువభారతి', 5, కింగ్స్‌వే, సికింద్రాబాదు—3 వారు విద్యార్థులకి కథా రచన పోటీ నిర్వ హిస్తున్నట్టు తెలుపుతున్నారు. వివరాలకి పై చిరు నామాకి వారికి వ్రాయవచ్చు. [సం]

* * *

3—6—70న ఆంధ్ర నాటక సాహిత్యసంఘ భవనంలో 1969 ఆంధ్ర తుఫాను బాధితుల సహాయనిధి ముగింపు సమావేశము జరుపబడెను. ఈ నిధి కృషి ఫలితముగా ఆంధ్ర జంధ్రీతర స్థానిక ప్రజానీకమునుండి వసూలు చేయబడ్డ రూ. 8085లు ఇంతవరకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి పరిపాలిత బాధితుల సహాయనిధికి పంపబడమైనదని తెలియ చేయబడెను ఇంకనూ మిగిలిన సుమారు రు.600లు ఈనిధికి పంపుటకు నిర్ణయింపబడినది.

కొ. లక్ష్మణమూర్తి, కోశాధికారి,

ఆంధ్రుల తుపాను బాధితుల సహాయనిధి,

[జంషెడ్‌పూరు]

వి వా హ ం

బి. విశ్వనాథం అండ్ కంపెనీ ప్రొప్ర యిటరు శ్రీ బొమ్మిశెట్టి విశ్వనాథం, శేషమ్మగారి కుమార్తె చి. సౌ. భ్రమరాంబకి శ్రీమతి పద్మాలమ్మగారి పెంపుడు కుమా రుడు చి. నరసింహారావుకు మద్రాసులో వైభవంగా వివాహం జరిగింది. ఈ సంద ర్భంగా అనేకమంది పురప్రముఖులు వచ్చి వధూవరులను ఆశీర్వదించారు.

సవరణ

తేదీ 19–6–70 ఆంధ్ర సచిత్రవారపత్రిక 15 వ పేజీలోని ప్రకటనయందు చౌపల్ క్విజ్ నెం. 1 ఫలితాలలోని 2 వ ఫలితము 'విరాగి' అని ప్రకటింపబడినదానికి బదులుగా "కరుణా" అని సవరించి చదువుకోవలెను.

ఇదీ లోకం

(47వ పేజీ తరువాయి)

వినోద్ రూమ్ దగ్గర ఆగింది

అతనికి జ్వరం తగ్గకపోగా మరికాస్త ఎక్కువయి నీరసంగా అలాగే పడుకొని వున్నాడు.

'వినోద్' త్వరగా వెళ్ళి మంచం పక్కన కూర్చుంది. 'ఎలా వుంది' నుదురుమీద చెయ్యి వేస్తూ అంది.

'వో...వందన, నీ వెళ్ళిపోతున్నావు కదూ, మర్చిపోయాను' అతను ఒక్క వుదుటున లేచి కూర్చున్నాడు.

'నీకు చాలా జ్వరంగా వుంది. నీవు లెగవకు. పడుకో. నన్నిప్పుడు చూసావుగా. స్టేషన్‌కి అంకుల్ వస్తున్నారు. వెళ్ళగానే ఉత్తరం వ్రాస్తాను. పడుకో వినోద్' ఒకరోజులోనే పీక్కుపోయిన మొఖంతో, లోతుకు పోయిన కళ్ళతో పెద్ద జబ్బు పడ్డవాడిలా వున్న అతన్ని చూస్తే, ఆమెకి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నిన్నిటువంటి పరిస్థితిలో వదిలేసి వెళ్ళాలంటే నాకు కష్టంగా వుంది వినోద్' మెల్లగా అంది.

కాని ఆమె మాటలు వినిపించుకోకుండా లేచి త్వరగా తనూ బయల్దేరాడు. స్టేషనుకి వెళ్ళేసరికి రైలు వచ్చింది. ఎక్కి సామాను సర్దుకొని, వినోద్ దెస చూసింది వందన.

'ఆఖరిసారిగా అడుగుతున్నాను. నిన్ను చూస్తుంటే ఏదో అయిందనిపిస్తుంది. అదేవిటో నన్ను తెలుసుకోనియ్ వినోద్' అంది.

'ఏవీ లేదు వందన.' పేలవంగా నవ్వాడతను. 'నాకు తెలుసు నీకు చెబితే మీ అంకుల్‌ని అడిగి, ఈ క్షణానే, నా పేరున వెయ్యి రూపాయలకి చెక్ ఇస్తావు కాని, అవి నేనెలా తీసుకోను.' అభిమానంతో అతని మనసు మూలిగింది.

'పోనీ ఉత్తరంలో రాస్తావా.'

'ఏవీ లేందే, ఏవి రాయను' రైలు కదిలింది.

అతనికి ఒక్కసారిగా రైలు క్రింద బుర్ర పెట్టాలన్నంత విరక్తి కలిగింది. కాని ఎలాగో నిగ్రహించుకున్నాడు.

నిన్న అరువందలరూపాయల చీర కొన్న పెద్దమనిషి, ఐదువందల చిల్లర మరో క్రొత్త పర్స్‌ని ఖరీదైన జేబులో అదిమిపట్టి బిజీగా ముందునుంచే వెళ్ళిపోయాడు, నవ్వుకుంటూ.

క్రమంగా వందన దూరమవుతు వినోద్ హృదయం బాధతో మెలి పెట్టింది. తను మళ్ళీ వెయ్యి రూపాయ కూడబెట్టేదెప్పుడు, చెల్లెలి పెళ్ళి దెప్పుడు? ఎందుకో ఆ క్షణంలో ఆ విషయం ఆమెకు చెప్పాలనిపిం చెబితే వెళ్ళగానే ఊరునుంచి డబ్బు స్తుందనే ఆలోచనతో గట్టిగా చెప్పబోయాడు. కాని స్వరం పెగ అతని కళ్ళల్లో నీళ్ళు నిండా చెంపలమీదకి జారేసరికి వందన అదృశ్యమయింది. స్ఫృహతప్పి అతన్ని వందనఅంకుల్ పట్టుకు

పుస్తకాలు

కళాజ్యోతి

పద్మశ్రీ యన్. టి. రామారావు అభినంద సంచిక. పి. సుదర్శనం సంపాదకత్వంలో వెలువడి ఈ సంచికలో యన్. టి. రామారావు జీవిత విశేషాలు పలువురి రచనలు వున్నాయి. సుదర్శ పబ్లికేషన్స్, 6—116నెహ్రూబజార్, మదనపల్లె

* * *

'సూవెనీర్, సెకెండ్ ఆనివర్శరీ'—గోపీచం ఆర్ట్స్. హైద్రాబాదు.

ఇది కీ. శే. గోపీచంద్ మీద ఎందరో ప్రముఖు రాసిన వ్యాసాల కూర్పు.

గోటేటి ఫిలిం డైరీ

తారల చిరునామాలు సినిమా పరిశ్రమ సంబంధించిన పూర్తి వివరాలతో ముచ్చ ముద్రించిన గోటేటి సినిమాడైరీ వెలువ 216 పేజీలు, వెల రెండున్నర రూపా సంకలనం : గోటేటి శ్రీరామారావు. వెంకటసాయీ నిలయం, సి—2907వ వీ అశోక్ నగర్, మద్రాసు—33.

జమీన్‌రైతు

జమీన్‌రైతు సాధారణ ఉగాది ప్రత్యేక ప్రముఖ రచయితల వ్యాసాలు, కథలు, గే మొదలైన వాటితో ప్రత్యేకంగా రూపొంది. 120 పేజీల వెల రూపాయి. సం శ్రీ నెల్లూరి శ్రీరామమూర్తి, 170 వరపు వారి వీధి, నెల్లూరు.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press; 6 & 7 Thambu Chetty Street, Madras-1. Chief Editor: S. Sambhu Prasad.

Regd No. 4479 ANDHRA SACHITRA VARA PATRIKA.

